www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 254 | మంగళవారం 06-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

హస్తినలో హోదా హోరు



ప్రత్యేక హోదా ఉద్యమ సెగ ఢిల్లీని తాకింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికార, విపక్షాలు పార్లమెంటు లోపలా, బయటా ఆందోళనలతో వేడిపుట్టించాయి. హోదా ఇవ్వాలని డిమాండు చేస్తూ ఢిల్లీ వీధుల్లో ప్రధాన పార్టీలు నినదించాయి. సోమవారం ఉదయం నుంచీ వైసీపీ ఢిల్లీలో ధర్నా చేపట్టింది. దీనికి వామపక్ష పార్టీలు సంఘీభావం తెలిపాయి. ఏపీ కాంగ్రెస్ పార్టీ తనదైన శైలిలో నిరసనలు తెలిపింది. 'ప్రత్యేక హోదా భిక్ష కాదు... ఆంధ్రుల హక్కు' అంటూ దేశ రాజధాని ఢిల్లీ నడివీధుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజకీయ నాయకులు, ప్రజలు నినదించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండు చేశారు. ఇంతకాలం రాష్ట్రానికే పరిమితమైన హోదా ఉద్యమం ఇప్పుడు రాజధానికి చేరింది. ప్రత్యేకహోదా కోసం పార్లమెంటు ఉభయసభల్లో టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ ఎంపీలు ఆందోళన చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. సభా కార్యకలాపాలను అడుగడుగునా నిలువరించేందుకు యత్నించారు. టీడీపీ ఎంపీలు పార్లమెంటు లోనూ, గాంధీ విగ్రహం వద్ద నిరసనలు తెలిపారు.

మరోవైపు, రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం వైసీపీ ఢిల్లీలో ఆందోళనకు దిగింది. జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించింది. ఆ తర్వాత పార్లమెంటుకు ర్యాలీగా వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులను అరెస్టు చేశారు. పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైసీపీ ధర్నాకు వామపక్షాలు మద్దతు తెలిపాయి. హోదాపై కేంద్ర ప్రభుత్వం దిగొచ్చేదాకా కదిలేది లేదని నాయకులు స్పష్టంచేశారు. వైసీపీ ధర్నాలో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో సాయంత్రం ఓ చానల్ నిర్వహించిన డిబేట్‌లో సీపీఐ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డి.రాజా, ఏపీ కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, హోదా సాధన సమితి నేత చలసాని శ్రీనివాస్, సీపీఎం ఏపీ కార్యదర్శి పి.మధు, కాంగ్రెస్ నేత కేవీపీ రామచంద్రరావు, కొణతాల రామకృష్ణ, వైసీపీ, టీడీపీ నేతలు మల్లాది విష్ణు, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండు చేశారు.

ఢిల్లీని తాకిన సెగ

- రాజధానిలో పోటాపోటీ ఆందోళనలు
- దద్దరిల్లిన పార్లమెంటు
- టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ నిరసనలు
- గాంధీ విగ్రహం వద్ద ఎంపీల ధర్నా
- వైసీపీ ప్రజా ప్రతినిధుల ర్యాలీ, అరెస్టులు
- సీపీఐ, సీపీఎం సంఘీభావం

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు 'ప్రత్యేక తరగతి హోదా' డిమాండుతో పార్లమెంటు ఉభయ సభలూ సోమవారం దద్దరిల్లాయి. ఏపీకి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండు చేస్తూ తెలుగుదేశం పార్టీ(టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ(వైసీపీ), కాంగ్రెస్ ఎంపీలు సభలో నిరసన చేపట్టడంతో ప్రారంభమైన 10 నిమిషాల్లోనే లోక్‌సభ, రాజ్యసభ వాయిదాపడ్డాయి. లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటల వరకు, రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు కె.వి.పి. రామచంద్రరావు వెల్‌లోకి దూసుకువెళ్లారు. దీంతో చైర్మన్ వెంకయ్యనాయుడు సభను - మిగతా 2 లో



చంద్రబాబూ..

ఢిల్లీ రా..!

- అసెంబ్లీ సమావేశాలు వాయిదా వెయ్...
- ధర్నా చేస్తే మద్దతిస్తాం...
- మోడీ వద్దే అమీ తుమీ తేల్చుకో
- రెండు రోజులు హస్తినలోనే..
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ వచ్చి ధర్నా చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండు చేశారు. సోమవారం న్యూఢిల్లీలో వైసీపీ నిర్వహించిన మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సమస్యలను విస్మరించి బాబు అసెంబ్లీని పట్టుకుని ఊగులాడుతున్నారేంటని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రావాలంటే ఆయన అసెంబ్లీని వాయిదా వేసి ఢిల్లీలో కేంద్రానికి వ్యతిరేకంగా ధర్నా చేయాలని డిమాండు చేశారు. అఖిలపక్షం ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన బిల్లులో ఆమోదించిన అన్ని అంశాలను కేంద్రం అమలు చేయాలని కోరారు. ప్రత్యేక హోదా సాధన సమితి, వామపక్ష పార్టీలు కలిసి రెండు రోజులు పాటు దేశరాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తామని రామకృష్ణ తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, 2018-19 కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని, వాటిని భర్తీ చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు - మిగతా 2 లో

పీఎన్‌బీ అక్రమాలపై దద్దరిల్లిన పార్లమెంటు

ఉభయ సభలు నేటికి వాయిదా



9 లో



'సినిమా' చర్చలు విఫలం

- నాల్గో రోజుకు చేరిన థియేటర్ల బంద్
- ఇబ్బందుల్లో చిన్న సినిమాల నిర్మాతలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల బంద్ నాలుగో రోజుకు చేరింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు, నిర్మాతల మధ్య సోమవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. వీపీఎఫ్ 16 శాతం తగ్గిస్తామని సర్వీస్ ప్రొవైడర్లు ప్రతిపాదించారు. ఈ హామీపై నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో బంద్ కొనసాగింపు అనివార్యమైంది. ఈ నెల 9 వరకూ బంద్ కొనసాగించాలని వారు నిర్ణయించారు. వీపీఎఫ్ చార్జీలు తగ్గించేందుకు డిజిటల్ సంస్థలు ససేమిరా అనడంతో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, - మిగతా 2 లో

మళ్లీ తీర్మానం..!

- హోదాపై సభలో ప్రతిపాదనకు టీడీపీ యత్నం
- కేంద్ర సహాయాన్ని వివరిస్తామంటున్న బీజేపీ

విశాలాంధ్రబ్యూరో-అమరావతి : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశం మరోసారి కీలకంగా మారనుంది. రాష్ట్ర విభజన అనంతరం 2015, 2016 అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఆ తర్వాత కేంద్రం ప్రత్యేక హోదా ఇచ్చేది లేదని, దానికి సమానమైన ప్యాకేజీని అమలు చేస్తామని ప్రకటించింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ మిత్రపక్షంగా ఉండటంతో చంద్రబాబు కూడా ప్రత్యేక ప్యాకేజీ వైపే మొగ్గు చూపారు. అయితే గత నెలలో పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి నిధులు కేటాయించలేదు. కనీసం ప్రత్యేక హోదా అంశంగానీ, ప్యాకేజీ అంశం ప్రస్తావనే లేదు. దీంతో మిత్రపక్షాల మధ్య క్రమంగా దూరం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో - మిగతా 2 లో

హోదా ఇవ్వాల్సిందే..

- ఏపీని వెంటాడుతున్న విభజన సమస్యలు
- హామీలపై కేంద్రంతో కొనసాగుతున్న సంప్రదింపులు
- తొలిసారి విభజనాంశాలను ప్రస్తావించిన గవర్నర్ నరసింహన్



విశాలాంధ్ర-అమరావతి : ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి తీరాల్సిందేనని గవర్నర్ ఈఎస్ఎల్ఎన్ నరసింహన్ స్పష్టం చేశారు. విభజన హామీలన్నీ నెరవేర్చాలని, రెవెన్యూ లోటును భర్తీ చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి గంటపాటు సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఏపీ విభజన చట్టంలోని అంశాలను గవర్నర్ తొలిసారి ప్రముఖంగా ప్రస్తావించడం విశేషం. హామీల అమలు కోసం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామన్న గవర్నర్.. ఏపీని విభజన సమస్యలు వెంటాడుతున్నాయని చెప్పారు. విభజన కారణంగా ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద చేసిన వాగ్దానాలను, ఇచ్చిన హామీలను కేంద్రం నెరవేర్చాల్సింది ఉందన్నారు. ఏపీ ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కోల్పోయి, రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిందన్నారు. రెవెన్యూ లోటు, తక్కువ ఆదాయంతో కష్టాలు మరింత పెరిగాయి. అందువల్ల కేంద్రం రాష్ట్రాన్ని ఆదుకోవాలన్నారు. భౌగోళిక ప్రదేశం ఆధారంగా ఇరు రాష్ట్రాలకు ఆస్తులు పంచితే, అప్పులు మాత్రం జనాభా ఆధారంగా పంచారన్నారు. ప్రత్యేక హోదా, వనరుల వ్యత్యాసాన్ని సరిచేయడం, కేంద్ర ప్రభుత్వ నిధులతో పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయడం, - మిగతా 11 లో

సర్కారు వైద్య కళాశాలలకు..

ఒక్క పీజీ సీటూ లేదు..!

- 'ప్రైవేటు'కు దక్కిన 39 సీట్లు
- 'నారాయణ'కు 12 సీట్లు లభ్యం
- ఎంసీఐకు ఎల్ఓపీ పంపడంలో జాప్యం
- ప్రభుత్వ ప్రతిపాదనల్ని తిరస్కరించిన కేంద్రం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కొత్తగా ఒక్క పీజీ సీటూ దక్కలేదు. సీట్ల వివరాల నివేదికను సకాలంలో ఎంసీఐకు అందజేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలున్నాయి. రాష్ట్రానికి ఒక్క కొత్త పీజీ సీటు రాకపోవడమే ఇందుకు నిదర్శనీయం. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఎంసీఐకు సకాలంలో లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్ఓపీ) అందజేసి అవసరమైన సీట్లను పొందాయి. ప్రైవేటు కళాశాలల యాజమాన్యం సకాలంలో సంబంధిత కళాశాలల పరిస్థితిని నివేదించి - మిగతా 2 లో

వచ్చారు.. వెళ్లారు...!

- కేంద్రం..టీడీపీ..బీజేపీ... తూతూ మంత్రం మీటింగ్
- ఎలాంటి హామీలు ఇవ్వని కేంద్రం..
- నిరాశతో వెనుదిరిగిన నేతలు
- అమిత్‌షాతో సమావేశం వాయిదా



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పిలుపు మేరకు ఢిల్లీ వచ్చిన టీడీపీ బృందానికి పరాభవం ఎదురైంది. అమిత్‌షా టైమ్ ఇవ్వకపోవడంతో ఆఖరికి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసి ప్రత్యేకహోదాపై పాతపాటే పాడి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో టీడీపీ నేతల సమావేశం తూతూ మంత్రంగా సాగింది. కొత్తదనమేం కనిపించలేదు. కనీసం కేంద్రం నుంచి ఒక్క హామీని కూడా సాధించకుండానే టీడీపీ బృందం బయటకు వచ్చింది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత సుజనా చౌదరి, రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కుటుంబరావు, టీడీపీ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడులు సోమవారం రాత్రి 7గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని నార్త్‌బ్లాక్‌లోని - మిగతా 2 లో

ఇదీ లోకం!



ది షేప్ ఆఫ్ వాటర్‌కు ఆస్కార్

- నాలుగు విభాగాల్లో అవార్డులు
- ఉత్తమ దర్శకుడు గల్లీర్మో డెల్ టోరో
- ఉత్తమ నటి ఫ్రాన్సిస్ మెక్ డోర్మండ్
- ఉత్తమ నటుడు గ్యారీ ఓల్డ్‌మ్యాన్
- ఉత్తమ సహాయ నటి అల్లీసన్ జాన్నే
- ఉత్తమ సహాయ నటుడు సామ్ రాక్‌వెల్
- అట్టహాసంగా వేడుక

లాస్‌ఏంజెల్స్ : ప్రతిష్టాత్మక 'ఆస్కార్' అవార్డుల వేడుక అట్టహాసంగా జరిగింది. లాస్‌ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో 90వ అకాడమీ అవార్డుల ప్రదానోత్సవ ఈ కార్యక్రమానికి ప్రముఖ అమెరికన్ టెలివిజన్ హోస్ట్ జిమ్మీ కిమ్మెల్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. హాలీవుడ్ నటీనటులు ఈ వేడుకకు హాజరై ప్రేక్షకులను అలరించారు.

ఆస్కార్ విజేతలు వీరే..

ఉత్తమ చిత్రం : ది షేప్ ఆఫ్ వాటర్, ఉత్తమ దర్శకుడు గల్లీర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్), ఉత్తమ నటి ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైట్ ఎబ్బింగ్, మిస్సోరీ), ఉత్తమ నటుడు గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్), ఉత్తమ సహాయ నటి అల్లిసన్ జెన్నీ (ఐ, టోన్యా), ఉత్తమ సహాయ నటుడు సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ), ఉత్తమ యానిమేటెడ్ చిత్రం కోకో, ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిలిం డియర్ బాస్కెట్‌బాల్, ఉత్తమ సినీమాటోగ్రఫీ చిత్రం - మిగతా 2 లో



ప్రపంచం

ఐక్యతకు మదురొ పిలుపు



కారకాస్ : వెనిజులాలో శాంతి, పురోగతి సాధించేందుకు సమాజంలోని అన్నివర్గాల మధ్య ఐక్యత తక్షణ అవసరమని దేశాధ్యక్షుడు నికొలస్ మదురొ పిలుపునిచ్చారు. 'కలిసివుంటే ప్రతిదీ సాధించవచ్చు' అన్న శీర్షికతో ఆయన ఒక వ్యాసం రాశారు. ఈ వ్యాసాన్ని వెబ్‌సైట్‌లో పోస్ట్ చేశారు. వెనిజులా ప్రజలు కఠోర శ్రమచేసే గిరిజనులవలె రాజకీయాలలోను కృషి చేయాలని సోదరులు, సోదరీమణులవలె కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. బొలివేరియన్ చరిత్ర అంతా ఐక్యతనే సూచించిందని పేర్కొన్నారు. దేశంలో శాంతి నెలకొంటేనే పురోగతి సాధ్యమవుతుందని సమైక్యత ద్వారానే దేన్నైనా సాధించవచ్చునని ఆయన తెలిపారు. సమైక్యతకే విలువ ఉంటుందని, భిన్నత్వంలో ఏకత్వం ఇమిడి ఉంటుందని అన్నారు. భిన్నత్వంలో ఐక్యతను సాధించాలనుకుంటే వెనిజులా పురోగతి మన ప్రధాన లక్ష్యంగా ఉండాలి. అప్పుడే మనము శాంతిని సాధించగలము అని మదురొ పేర్కొన్నారు.

క్యూబాలో నమూనా ఎన్నికలు

హవానా : క్యూబాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందుగా ఆదివారం నమూనా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 2 లక్షలమందికి పైగా ఓటర్లు పాల్గొన్నారు. ఈనెల 11వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికలకు అవసరమైన వస్తు సామాగ్రి మానవ వనరులు అందుబాటులో ఉన్నాయా లేదా? అని తెలుసుకునేందుకే నమూనా ఎన్నికలు జరిపినట్టు జాతీయ ఎన్నికల కమిషన్ వెల్లడించింది. నమూనా ఎన్నికల సందర్భంగా అవసరమైన యంత్రాలను, ఇతర పరికరాలను పోలింగు కేంద్రాలలో ఏర్పాటు చేశారు. 11వ తేదీ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుంది. సమాచార సేకరణ, సమాచార బదిలీ, రవాణా సౌకర్యాలు, కమ్యూనికేషన్ సౌకర్యాలు తదితర అంశాలను ముందుగానే పరిశీలించారు. నమూనా ఎన్నికల సందర్భంగా జిల్లా మున్సిపల్ స్థాయిల్లో జరిపిన కసరత్తుకు సంబంధించి సమీక్షా సమాచారాన్ని ఎన్నికల కమిషన్ స్వీకరిస్తున్నది. నమూనా ఎన్నికల్లో పాల్గొన్న 2 లక్షలమంది సిబ్బందికి, అధికారులకు తగిన శిక్షణ ఇచ్చారు.

వేర్పాటువాద కార్యకలాపాలు సహించం

తైవాన్‌కు చైనా ప్రధాని హెచ్చరిక



బీజింగ్ : స్వీయపరిపాలన కలిగిన తైవాన్‌లో వేర్పాటువాద కార్యకలాపాలను, పథకాలను తాము ఏనాటికీ సహించబోమని చైనా ప్రధాని లీకెకి యాంగ్ హెచ్చరించారు. ఇక్కడ గ్రేట్‌హాల్ ఆఫ్‌ది పీపుల్‌లో జాతీయ పీపుల్స్ కాంగ్రెస్ ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చైనా భౌగోళిక సమగ్రతను కాపాడుకుంటామని అన్నారు. ఇటీవల తైవాన్, అమెరికాల మధ్య అధికార సంబంధాలు మరింత పెరిగేందుకు అమెరికా రూపొందించిన బిల్లుపైన ఆయన మాట్లాడుతూ తీవ్రమైన హెచ్చరికలు చేశారు. తైవాన్ విదేశీయులపై ఆధార పడదల్చుకుంటే అది తీవ్రమైన రిస్కును ఎదుర్కొంటుందని ఆయన చెప్పారు. అమెరికా పార్లమెంటు రూపొందించిన బిల్లు అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేసినట్లయితే అది చట్టరూపం తీసుకుంటుంది. ఈ బిల్లు ప్రకారం అమెరికాకు చెందిన అన్నిస్థాయిల అధికారులు తైవాన్‌లో పర్యటించి అక్కడ ఉన్నతస్థాయి అధికారులను కలుసుకునేందుకు వీలుకలుగుతుంది. అదే సమయంలో అమెరికాలో తైవాన్‌కు చెందిన ఉన్నతాధికారులు పర్యటించాలంటే పరిమితి అవసరమౌతుంది. అది కూడా గౌరవనీయమైన షరతుల పేరుతో అమెరికా తైవాన్ అధికారులను అనుమతిస్తుంది. చైనా, తైవాన్ మధ్య శాంతియుతమైన సంబంధాలను పెంపొందించుకునేందుకు అలాగే శాంతియుతంగా పునరేకీకరణకు ఆయన పిలుపునిచ్చారు. చైనా సార్వభౌమాధికారానికి భౌగోళిక సమగ్రతకు ఎటువంటి ముప్పు కలుగనీయబోమని అదే సమయంలో తైవాన్‌లో వేర్పాటువాద కార్యకలాపాలను ఎట్టి పరిస్థితులలోను అనుమతించబోమని ఆయన హెచ్చరించారు. పీపుల్స్ కాంగ్రెస్ సమావేశాలకు మూడువేలమందికిపైగా హాజరయ్యారు. తైవాన్‌లో చైనా పౌరులు నివసిస్తున్నారని అదే సమయంలో తైవాన్‌కు చెందిన పౌరులు చైనాలో నివసిస్తున్నారని ఈ సంబంధ బాంధవ్యాలు కొనసాగుతాయని కెకియాంగ్ అన్నారు. చరిత్రలో సైతం రెండు దేశాలు కలిసి పనిచేశాయని భవిష్యత్ పునర్నిర్మాణానికి ఇప్పుడు కూడా కలిసి పనిచేస్తామని ఆయన అన్నారు. 2018లో రక్షణశాఖ వ్యయాన్ని గత ఏడాదికంటే 8.1 శాతం పెంచుతున్నట్టు తెలిపారు.

కిమ్‌తో లోతైన చర్చలు : ద. కొరియా దూత



పొంగ్‌యాంగ్ : ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌తో లోతైన చర్చలు జరిపేందుకే తమ బృందం పొంగ్‌యాంగ్ చేరుకున్నదని దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్ ప్రత్యేక దూత చుంగ్ ఇయాంగ్ తెలిపారు. సోమవారం 5గురితో కూడిన దక్షిణకొరియా బృందం ఉత్తరకొరియాకు చేరుకున్నది. కిమ్‌తో ఈ బృందం విందు చర్చలు జరపనున్నదని తెలుస్తోంది. చుంగ్ ఇక్కడికి చేరుకున్న తరువాత విలేకరులతో మాట్లాడుతూ ఉత్తర, దక్షిణ కొరియాల మధ్యనేకాక, అమెరికా, ఉత్తరకొరియా మధ్య చర్చలు జరగవలసిన అవసరం ఉందని అన్నారు. చర్చలు జరపడానికి తమకు అభ్యంతరం లేదని అయితే ముందస్తు షరతులను అంగీకరించబోమని గతంలోనే ఉత్తరకొరియా తెలిపింది. సియోల్‌లో జరిగిన వింటర్ ఒలింపిక్స్‌కు ఉత్తర కొరియా 400 మందితో కూడిన బృందాన్ని పంపడం ద్వారా రెండు దేశాల మధ్య సామరస్యపూర్వక సంబంధాలకు తాము సుముఖంగా ఉన్నట్టు ఉత్తరకొరియా సంకేతాలను ఇచ్చింది. ఈనేపథ్యంలోనే దక్షిణకొరియా బృందం ఉత్తరకొరియాకు చేరుకున్నది. ఈ బృందం రెండురోజులపాటు ఉత్తరకొరియాలో పర్యటించి చర్చలు జరిపి తిరిగి వెళుతుంది. ఉత్తరకొరియాతో చర్చలకు అమెరికా అంత సుముఖంగాలేదని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ చేసిన ప్రకటన తెలియజేస్తుంది. ఒకవేళ ఉత్తరకొరియాతో సమావేశం జరిగితే అమెరికా తరపున ఎవరు నాయకత్వం వహిస్తారో అనే సూచన కూడా ఏమీ లేదు. ఉత్తరకొరియాలో అమెరికా దౌత్యాధికారి జోసఫ్‌యున్ తాను త్వరలో పదవీ విరమణ చేయనున్నట్లు ప్రకటించారు. ఆయన ఉత్తరకొరియాతో రాజీకి, దౌత్యపరమైన సంబంధాలకు అనుకూలంగా ఉన్నట్టు పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

లండన్‌లో మహిళల భారీ ర్యాలీ



లండన్ : సమానహక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ లండన్ నగరంలో వేలాదిమంది మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్త్రీ, పురుషుల మధ్య అసమానత్వాన్ని, లైంగిక వేధింపులను నిలిపివేయాలని వారు నినాదాలు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈనెల 8వ తేదీన ప్రపంచ దేశాలలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముందుగానే మహిళా ఉద్యమాలకు సంబంధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. లండన్ పార్లమెంటువద్ద నుంచి బయలుదేరిన ప్రదర్శన ట్రఫాల్గర్ స్క్వేర్ వద్దకు చేరుకుంది. సంగీత కళాశాలలు, రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత కార్యక్రమాలు జరిగాయి. రచయితలు తమ కవితలను వినిపించారు. పలువురు ప్రముఖులు, మహిళల స్థితిగతులపై మాట్లాడారు. లండన్ మేయర్ సాదిక్‌ఖాన్ మాట్లాడుతూ ట్రఫాల్గర్‌లో 11 మంది గొప్పనేతల విగ్రహాలను ఏర్పాటుచేశారు కాని వీటిలో ఒక్కటి కూడా మహిళా విగ్రహంలేదని అన్నారు. వచ్చేనెలలో మొదటి మహిళా విగ్రహాన్ని తాము ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ప్రముఖ మహిళ మిల్లీసెంట్‌ఫాసెట్ విగ్రహాన్ని నెల్సన్‌మండేలా, మహాత్మాగాంధి విగ్రహాల పక్కనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఫాసెట్ 1929లో చనిపోయారు. మహిళా సమస్యలపై తాను ఎల్లవేళలా సానుకూలంగా పనిచేస్తానని మేయర్ చెప్పారు. స్త్రీ, పురుషుల మధ్య వివిధ రంగాలలో సమానత్వాన్ని సాధించేందుకు రెట్టింపు కృషి చేయవలసిన అవసరంవుందని ఆయన అన్నారు. ప్రపంచంలోని పలు ప్రాంతాలలో అద్దాల పగులగొట్టి పోరాటాలు చేసిన మహిళలను ప్రశంసించవచ్చు. అయితే అదే సమయంలో మహిళా ఉద్యమాలకు వ్యతిరేకంగా ప్రచారాలు సాగుతున్నాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

సౌదీతో ద్వైపాక్షిక సహకారం : ఈజిప్టు



కైరో : సౌదీ అరేబియాతో ద్వైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంపొందించుకుంటామని ఈజిప్టు అధ్యక్షుడు అబ్దల్‌ఫతాహ్‌అల్‌సిసీ తెలిపారు. ప్రస్తుతం ఈజిప్టులో పర్యటిస్తున్న సౌదీ రాజు మహమ్మద్‌బిన్‌సల్మాన్‌తో ఆయన చర్చలు జరిపిన అనంతరం మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విచ్ఛిన్నకర శక్తుల జోక్యాన్ని ఎదుర్కొనేందుకు సౌదీతో కలిసి పనిచేస్తామని అన్నారు. బెదిరింపులను, సవాళ్లను ప్రత్యేకించి టెర్రరిజం, దానికి తోడ్పాటు ఇస్తున్న దేశాలపైన పోరాటాలకి కలిసి పనిచేస్తామని అన్నారు. ఈజిప్టు జాతీయ భద్రతలో అంతర్భాగమే గల్ఫ్ భద్రత అని సిసి చెప్పారు. సౌదీ రాజు మూడురోజులపాటు ఈజిప్టులో పర్యటిస్తారు. గత సంవత్సరం ఆయన రాజుగా పదవీ స్వీకారం చేసిన తరువాత మొదటిసారిగా ఈజిప్టులో పర్యటిస్తున్నారు.ఈనెల 7వ తేదీన ఆయన బ్రిటన్ చేరుకుంటారు. అనంతరం తమకు అత్యంత సన్నిహితమైన అమెరికాకు చేరుకొని చర్చలు జరుపుతారు. గత సంవత్సరం ఖతార్‌పైన ఆంక్షలు విధించడంలో ఈజిప్టు సౌదీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో కలిసి పనిచేసింది. సౌదీ రాజు మాట్లాడుతూ తన పర్యటన ఈజిప్టుతో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు దోహదం చేస్తుందని అన్నారు. వివిధ రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకుంటామని చెప్పారు.

ప్రకృతి వనరుల జాతీయకరణ : మొరేల్స్



లాపాజ్ : బొలీవియాలో సాధించిన విజయాలలో ప్రకృతివనరుల జాతీయకరణ ఒకటని అధ్యక్షుడు ఎఒ. మొరేల్స్ అన్నారు. దేశంలో ప్రవేశపెట్టిన మార్పులను ఆయన వివరించారు. ప్రజల సమైక్యతవల్ల, సామాజిక ఉద్యమాల ద్వారా ఇది సాధ్యమైందని, ప్రకృతి వనరుల జాతీయకరణవల్ల ఆర్థిక వ్యవస్థ ఎంతగానో ప్రయోజనం పొందిందని మొరేల్స్ అన్నారు. 2006లో తాము అధికారం వచ్చేనాటికి అమెరికా రాయబార కార్యాలయంప్రభుత్వంలో కీలకమైన పదవులను నిర్వహిస్తున్నవారిని సైనికపరంగా ప్రోత్సహించిందని అన్నారు.బొలీవియా పోలీస్ అకాడమీ 81వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ మన ప్రకృతి వనరులను దోచుకునేందుకే వివిధ దేశాలు, రాచరిక ప్రభుతాతీఇలు మనపై షరతులను రుద్ది బ్లాక్ మెల్‌చేసి యధేచ్ఛగా వ్యవహరించాయని అన్నారు.రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల విముక్తి తర్వాతే బొలీవియా ప్రపంచంలో ఒక నమూనాగా నిలిచిందని మొరేల్స్ చెప్పారు. ఆర్థిక స్వేచ్ఛ సాధించడానికిప్రకృతి వనరులు, కీలకమైన జాతీయకరణ ఎంతగానో దోహదం చేసిందని తెలిపారు.

హోదా హోరు

(మొదటిపేజీ తరువాయి)

10 నిమిషాలపాటు వాయిదా వేశారు. తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభమైనప్పటికీ ఇదే విధమైన నిరసనలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు, 'మీరు పార్లమెంటులో ఉన్నారా లేదా వేరే చోట ఉన్నారా' అని సభ్యులను ప్రశ్నించారు. సభ్యులు తమతమ స్థానాల్లో కూర్చోవాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ టీడీపీ సభ్యులు, కేవీపీ సభలో పోస్టర్లు ప్రదర్శించారు. దీనికి సభ చైర్మన్ మాట్లాడుతూ 'మీరు పార్లమెంటులో ఉన్నారు. హంగామా సృష్టించొద్దు. సభ గౌరవాన్ని దిగజార్చొద్దు' అని పేర్కొన్నారు. ఎటువంటి పోస్టర్లను ప్రదర్శించొద్దు అని అన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రెండో సెషన్ ప్రారంభానికి ముందు టీడీపీ ఎంపీలు ఏపీకి ప్రత్యేక హోదా డిమాండుతో పార్లమెంటు ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం ముందు ధర్నా చేపట్టారు. 'ఐదు కోట్ల ఆంధ్రుల గొంతు వినండి', 'పొత్తు ధర్మం కాపాడండి' వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులను ఎంపీలు ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఇచ్చిన హామీలన్నింటినీ పరిపూర్తి చేయాలని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ డిమాండు చేశారు. 'వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని మేము కోరుతున్నాం. అయితే మాకు అత్యంత స్వల్ప ప్యాకేజీ మాత్రమే అందింది. కానీ అది సరిపోదు. తలసరి ఆదాయం ఆధారంగా ఇవ్వాలి. ఇతర పర్వత ప్రాంత రాష్ట్రాల మాదిరిగా పారిశ్రామిక రాయితీలను కూడా కోరుతున్నాం' అని గల్లా చెప్పారు. ఇదిలాఉండగా, టీడీపీ ఎంపీ శివప్రసాద్ కృష్ణుడి వేషధారణలో ఇక్కడ నిరసన తెలిపారు. 2014లో పార్లమెంటులో ప్రకటించబడిన 'ప్రత్యేక తరగతి హోదా'కు బీజేపీతో సహా ప్రతిపక్ష పార్టీలన్నీ ఆమోదం తెలిపాయి.

మళ్లీ తీర్మానం..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక హోదా అంశం మరోసారి చర్చకు రానుంది. ఇప్పటికే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటూ అన్ని పక్షాలు డిమాండు చేస్తుండటంతో పాటు ఢిల్లీలో ఆందోళనకు దిగాయి. మొన్నటి వరకూ హోదాపై మాట్లాడని టీడీపీ కూడా అందు కోసం పట్టుబడుతోంది. అలాగే ఏపీ పునర్విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని సీఎం చంద్రబాబు డిమాండు చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో ఆందోళనను కొనసాగిస్తుండగా, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక హోదా ఇవ్వాలని ముచ్చటగా మూడోసారి తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని ప్రభుత్వం భావిస్తోంది. బడ్జెట్ సమావేశాల్లో ప్రధానంగా ఈ అంశంపైనే చర్చించేందుకు టీడీపీ ప్రాధాన్యం ఇచ్చేలా కనిపిస్తోంది. ప్రత్యేక హోదా, అవశ్యంపై కూలంకషంగా చర్చించేందుకు 17 రోజులపాటు జరగనున్న సమావేశాలను వినియోగించుకునేం దుకు టీడీపీ వ్యూహరచన చేస్తోంది. అదే సమయంలో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో సభలో వివరించేందుకు మిత్రపక్షం బీజేపీ సభ్యులు సిద్ధమవుతున్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉందని బీజేపీ శాసనపక్ష నేత పి.విష్ణుకుమార్ రాజు చెబుతున్నారు. ప్రధాన ప్రతిపక్షం వైసీపీ కూడా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటూ ఢిల్లీలో ఆందోళన చేయటంతోపాటు ఎంపీలతో రాజీనామా చేయించేందుకు సిద్ధమైంది. కానీ ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరుకావటం లేదు. బడ్జెట్ సమావేశాల తొలి రోజైన సోమవారం గవర్నర్ ప్రసంగానికి కూడా ఎమ్మెల్యేలు హాజరుకాలేదు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 23 మందిపై చర్యలు తీసుకున్న తర్వాతే అసెంబ్లీకి హాజరవుతామని ఆ పార్టీ ప్రకటించింది. దీంతో కీలక అంశాలు సభలో చర్చకు వచ్చే అవకాశాలు కనిపించటంలేదు. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లో కొన్నింటిని సభ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, కీలక అంశాలు చర్చకు రాకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే మిత్రపక్షం బీజేపీ మాత్రం ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని స్పష్టం చేస్తోంది. ఈ నేపథ్యంలో మిత్రపక్షాల మధ్య ఈసారి ప్రత్యేక హోదాతోపాటు కేంద్ర సహాయంపైనా రెండు పక్షాల మధ్య ఆసక్తికరమైన చర్చ జరిగే అవకాశం ఉందంటున్నారు.

ది షేప్ ఆఫ్ వాటర్‌కు ఆస్కార్

(మొదటిపేజీ తరువాయి)



బ్లేడ్ రన్నర్ 2049, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ మార్క్ బ్రిడ్జెస్ (ఫాంటమ్ థ్రెడ్), ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఇకారస్, ఉత్తమ లఘు చిత్రం హెవెన్ ఈజ్ ఎ ట్రాఫిక్ జామ్ ఆన్ ది 405, ఉత్తమ ఎడిటర్ లీ స్మిత్ (డన్‌కర్క్), ఉత్తమ అలంకరణ, కేశాలంకరణ కజుహిరో సుజి, డేవిడ్ మాలినోవ్‌స్కీ, లూసీ సిబ్బిక్ (డార్కెస్ట్ అవర్), బెస్ట్ సౌండ్ మిక్సింగ్ మార్క్ వీన్‌గార్టెన్, గ్రెగ్ ల్యాన్‌డార్కర్, గ్యారీ ఎ.రిజ్జో (డన్‌కర్క్), బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ పాల్ డెన్‌హామ్, ఆస్టర్‌బెర్రీ (ది షేప్ ఆఫ్ వాటర్), ఉత్తమ విదేశీ చిత్రం ఎ ఫెంటాస్టిక్ ఉమెన్ (చిలీ), ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిలిం డియర్ బాస్కెట్‌బాల్, బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ జాన్ నీల్సన్, గెర్డ్ నెఫ్జర్, పాల్ లాంబర్ట్, రిచర్డ్ ఆర్.హూవర్(బ్లేడ్ రన్నర్ 2049), బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం ది సైలెంట్ చైల్డ్, బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే జేమ్స్ ఐవరీ (కాల్ మి బై యువర్ నేమ్), బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే జోర్డన్ పీలే (గెటౌట్), బెస్ట్ ఒరిజినల్ పాట రిమెంబర్ మీ(కోకో)

ఉత్తమ చిత్రంగా 'ది షేప్ ఆఫ్ వాటర్'

ఆస్కార్‌కు నామినేట్ అయిన ఎనిమిది చిత్రాలతో పోటీ పడి 'ది షేప్ ఆఫ్ వాటర్' చిత్రం ఉత్తమ చిత్రంగా నిలిచింది. 2017లో వచ్చిన ఈ సినిమాను దర్శకుడు గులెర్మో డెల్ టోరో అమెరికన్ ఫాంటసీ డ్రామా చిత్రంగా తెరకెక్కించారు. సాల్లీ హాకిన్స్, మైఖెల్ షాన్నన్, రిచర్డ్ జెన్‌కిన్స్, డోగ్ జోన్స్, మైఖెల్ స్టుల్‌బార్గ్, ఆక్టేవియా స్పెన్సర్ తదితరులు ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ ప్రభుత్వ ల్యాబొరేటరీలో పని చేస్తున్న ఓ మూగ యువతి.. ఇదే ల్యాబొరేటరీలో పరిశోధన నిమిత్తం ఉంచిన హ్యూమనాయిడ్ నీటి జంతువుతో ప్రేమలో పడటం చిత్ర కథాంశం. కాగా 'ది షేప్ ఆఫ్ వాటర్' చిత్రానికి నాలుగు కేటగిరీల్లో ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, బెస్ట్ ఒరిజినల్ స్కోర్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ విభాగాల్లో అవార్డులు వరించాయి.

ఉత్తమ నటిగా ఫ్రాన్సెస్ మెక్‌డోర్మండ్

'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' అనే చిత్రానికిగాను ఫ్రాన్సెస్ మెక్‌డోర్మండ్ ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డును అందుకున్నారు. ఓ హత్య కేసులో కూతుర్ని పోగొట్టుని న్యాయం కోసం పోరాడుతున్న తల్లి పాత్రలో ఫ్రాన్సెస్ నటించారు. ఈ సినిమాలో ఆమె నటనకు గానూ గోల్డెన్ గ్లోబ్, బాఫ్టా అవార్డులను సొంతం చేసుకున్నారు.

ఉత్తమ నటుడుగా గ్యారీ ఓల్డ్‌మ్యాన్

'డార్కెస్ట్ అవర్' చిత్రానికిగాను గ్యారీ ఓల్డ్‌మ్యాన్ ఉత్తమ నటుడిగా ఆస్కార్ అవార్డు అందుకున్నారు. ఈ చిత్రంలో గ్యారీ.. మాజీ బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ పాత్రలో నటించారు.

ఉత్తమ సహాయ నటిగా ఆల్లిసన్ జాన్నే

'ఐ, టోన్యా' సినిమాకి గానూ జాన్నే ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. ఈ సినిమాలో జాన్నే తల్లి పాత్రలో నటించారు. ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. సినిమా చూశాక విమర్శకులు సైతం ఆమె నటనను అభినందించకుండా ఉండలేకపోయారు. గోల్డెన్ గ్లోబ్ అవార్డును కూడా సొంతం చేసుకున్నారు.

ఉత్తమ సహాయ నటుడుగా సామ్ రాక్‌వెల్

'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' చిత్రానికిగాను రాక్‌వెల్ ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు అందుకున్నారు. ఈ చిత్రంలో రాక్‌వెల్ మద్యానికి బానిసైన పోలీస్ అధికారి పాత్రలో నటించారు. సహాయ నటుడిగా రాక్‌వెల్ పేరు ప్రకటించగానే తన ప్రేయసి వల్లే ఈ అవార్డు వరించిందని తెలిపారు.

'డన్‌కర్క్' చిత్రానికి మూడు అవార్డులు

'డన్‌కర్క్' చిత్రానికి బెస్ట్ సౌండ్ మిక్సింగ్, బెస్ట్ ఫిలిం ఎడిటింగ్, బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ అవార్డులు దక్కాయి.

ఒక్క పీజీ సీటూ లేదు..!

(మొదటిపేజీ తరువాయి)

సీట్లు పొందాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు పెరిగితే తమకు అవకాశాలు లభిస్తాయని విద్యార్థులు ఆశించి నిరుత్సాహానికి గురయ్యారు. వైద్య విద్యా రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. వైద్య విద్యలో పరిశోధనా డిగ్రీలను ప్రవేశపెడతామంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనలు ఆచరణకు నోచుకోవట్లేదు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అన్ని విభాగాలకూ పూర్తి స్థాయి బోధనా వైద్య సిబ్బంది లేరు. పలు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య సీట్ల పెంపుదలకు అవసరమైన వనరులున్నాయి. అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు కొత్తగా ఎండీ(జనరల్ మెడిసిన్), ఎంఎస్(ఆర్థోపెడిక్స్), ఎంఎస్(ఓబీజీ), ఎండీ(పీడియాట్రిక్స్), ఎండీ(ఫోరెన్సిక్ మెడిసిన్) సీట్ల కోసం పంపిన ప్రతిపాదనల్ని కేంద్రం తిరస్కరించింది. ప్రైవేటు మెడికల్ కళాశాలల యాజమాన్యం సకాలంలో ప్రతిపాదనలు పంపి 39 కొత్త పీజీ సీట్లను సాధించగలిగాయి. ఇందులో రాష్ట్ర మంత్రి నారాయణకు చెందిన మెడికల్ కళాశాలకు 12 సీట్లు అదనంగా లభించాయి. పీజీ సీట్లను సాధించడంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్, అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలున్నాయి. శ్రీకాకుళం రిమ్స్, విజయనగరం, విశాఖ, కాకినాడ, విజయవాడ సిద్ధార్థ, గుంటూరు, ఒంగోలు, కడప, కర్నూలు, తిరుపతి తదితర వైద్య కళాశాలల్లో పీజీ సీట్లున్నాయి.

ప్రభుత్వ తప్పిదాలివీ..

ప్రతి ఏటా ఫిబ్రవరి రెండో వారంలోగా ఆయా రాష్ట్రాల వైద్య కళాశాలల సీట్ల పరిస్థితి, విభాగాల పెంపుపై లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్‌ఓపీ) ద్వారా నివేదిక అందజేయాలని ఎంసీఐ కోరుతుంది. రాష్ట్రాల నుంచి వచ్చిన నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతుంది. ఎల్‌ఓపీని సకాలంలో పంపడంలోను, ప్రైవేటు కళాశాలల యాజమాన్యానికి దీటుగా కేంద్రంతో చర్చించడంలోనూ ప్రభుత్వం వైఫల్యం చెందింది. ఈ నివేదికను ఎంసీఐకు సకాలంలో పంపాలని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినా స్పందించలేదు. ఫలితంగా రాష్ట్రానికి ఒక్క పీజీ వైద్యసీటూ దక్కలేదు.

ప్రభుత్వం విఫలం : కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ కో-కన్వీనర్ అంబటి నాగ రాధాకృష్ణ

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ సీట్లను సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ కో-కన్వీనర్ అంబటి నాగ రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రానికి ఒక్క పీజీ సీటు దక్కలేదని ప్రైవేటు కళాశాలల యాజమాన్యం సకాలంలో ఎల్‌ఓపీలు అందజేసి 39 సీట్లు పొందాయని పేర్కొన్నారు.

చర్చలు విఫలం

(మొదటిపేజీ తరువాయి)

ఎగ్జిబిటర్లు శుక్రవారం నుంచి సినిమా ప్రదర్శనలను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ చిత్రాల ప్రదర్శన నిలిచిపోయింది. సినిమా హాళ్ల బంద్ చేయడంతో ఆన్‌లైన్ బుకింగ్స్, అడ్వాన్స్ బుకింగ్స్ నిలిచిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 1700 థియేటర్లు మూతపడ్డాయి. దీంతో రోజుకు దాదాపు రూ.3 కోట్ల మేర ఇప్పటి వరకు రూ. 12 కోట్ల వరకు నష్టపోయారు. డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లు దిగి వచ్చే వరకు థియేటర్ల బంద్ నిర్వహించనున్నట్లు దక్షిణ భారత నిర్మాతల మండలి స్పష్టం చేసింది. సినిమా థియేటర్ల బంద్ కారణంగా చిన్న సినిమాల విడుదల వాయిదా పడింది. బంద్ విరమణ తరువాత సినిమాలు విడుదల చేద్దామని అనుకున్నా మళ్లీ ఈ స్థాయిలో సినిమా హాల్‌లు దొరుకుతాయో లేదోనని చిన్న సినిమా నిర్మాతలు ఆందోళన చెందుతున్నారు.

ఢిల్లీ రా..!

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం నుంచి రూ.74వేల కోట్లు రావాల్సి ఉందని అది కచ్చితంగా ఇవ్వాలని డిమాండు చేశారు. పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామన్న బీజేపీ ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. విభజన హామీలు నెరవేర్చేవరకూ ఆందోళన కొనసాగిస్తామన్నారు. కేంద్రంతో అమీ తుమీ తేల్చుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. ఏపీలోని రాజకీయ పార్టీలు దేశరాజధానిలో ఉంటే.. చంద్రబాబు అసెంబ్లీలో ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లోనే అఖిలపక్షం ఏర్పాటు చేసి ముక్తకంఠంతో ఒకే వాదనను వినిపించాలన్నారు. ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, వామపక్ష నేతలు అందర్నీ ఢిల్లీకి పిలిపించి ప్రత్యేక హోదాపై ఇక్కడే అమీ తుమీ తేల్చాలన్నారు. బీజేపీ అధ్యక్షుడు హరిబాబు అసత్యాలను మానుకుని రాష్ట్ర ప్రయోజనాల రీత్యా తమతో కలిసి రావాలని పిలుపు నిచ్చారు. ఢిల్లీలో వైసీపీ నేతలు ధర్నా చేశారని, తమ పార్టీ నుంచి సంపూర్ణ మద్దతు ప్రకటించామన్నారు. ప్రత్యేక హోదాపై జరుగుతున్న ఈ ఆందోళనలో ప్రజాసంఘాలు, మేధావులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టారని చెప్పారు. సీపీఐ ఏపీ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఏపీకి శ్వాస, ధ్యాస, సంజీవని అని పేర్కొన్నారు. అలాంటి హోదా సాధించే వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సీపీఎం నేత మధు మాట్లాడుతూ ప్రత్యేక హోదాపై కేంద్రం చేస్తున్న నిర్లక్ష్యం వల్ల ప్రజలు నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

వచ్చారు.. వెళ్లారు...!

(మొదటిపేజీ తరువాయి)

ఆయన కార్యాలయంలో కలిశారు. ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న సమస్యలను యనమల రామకృష్ణుడు కేంద్ర ఆర్థికమంత్రితో చర్చించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్న మేరకు వినతి పత్రాన్ని కూడా సమర్పించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, పారిశ్రామిక ప్రోత్సాహకాలను, రాయితీలను ఇవ్వాలని డిమాండు చేశారు. ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా ఏపీ అభివృద్ధికి కేంద్రం అన్ని విధాల సహకరించాలని కోరారు. న్యాయపరమైన హక్కులను అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను స్పష్టంగా కేంద్రానికి వివరించామన్నారు. అయితే మిగతా మంత్రులతో కూడా మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటామని తమతో జైట్లీ చెప్పినట్లు యనమల తెలిపారు. ప్యాకేజీకి సంబంధించి ఎలాంటి బెనిఫిట్ తమకు రాలేదు కాబట్టి ప్రత్యేక హోదాను ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశామన్నారు. ఏపీకి రూ.16వేల కోట్ల రెవెన్యూ లోటు రావాల్సి ఉందని వెంటనే విడుదల చేయాలని కోరామన్నారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను సమస్యల వలయం నుంచి బయట పడేయాలని సూచించామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కూడా ప్రత్యేక హోదా కోసం రోడ్డు మీదకు ఎక్కాయని ఈ విషయం కేంద్రం గమనించి ఏపీకి జరిగిన అన్యాయాన్ని భర్తీ చేయాలని డిమాండు చేశామన్నారు. అమిత్‌షాతో సమావేశం వాయిదా పడిందన్నారు. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం కోసం అందరితోనూ మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. లోక్‌సభలో, రాజ్యసభలో కూడా తమ పార్టీ సభ్యులు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. కేంద్రం త్వరలో ఏపీ సమస్యలపై ఒక నిర్ణయం తీసుకుంటుందన్నారు. అయితే ఈ సమావేశంలో కొత్తదనం ఏముందని విలేకరులు అడిగిన ప్రశ్నలకు టీడీపీ నేతల నుంచి సమాధానం లేదు.

హిజ్రాలకు మెడికల్ సర్టిఫికెట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని హిజ్రాలకు మెడికల్ సర్టిఫికెట్లు, ఐడీ కార్డుల్ని జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య జీవో జారీ చేశారు.తొలుత హిజ్రాలంతా ఆయా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సర్టిఫికెట్లు/ఐడీ కార్డులు పొందాలని తెలిపారు.విశాఖపట్నం కింగ్‌జార్జ్ హాస్పిటల్, కాకినాడ, గుంటూరు, విజయవాడ, తిరుపతి, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, ఒంగోలు-రిమ్స్, కడప-రిమ్స్, శ్రీకాకుళం-రిమ్స్ హాస్పిటల్స్ నుంచి మెడికల్ సర్టిఫికెట్లు, ఐడీ కార్డులు పొందేలా చర్యలు చేపట్టామన్నారు.సంబంధిత వివరాలతో మీ-సేవలో హిజ్రాలు దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.అర్హులైన వారందరికీ పింఛను సదుపాయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు.ఈ ప్రక్రియను సత్వరమే అమలు చేయాలని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ), అన్ని జిల్లాల కలెక్టర్లకు, స్త్రీ, శిశు సంక్షేమాధికారులకు ఆమె ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తుంది : బీజేపీ ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర అమరావతి : రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోడీ తన వంతు కృషి చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, ఆకుల సత్యనారాయణ చెప్పారు. శాసనసభ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద సోమవారం మాట్లాడుతు రాష్ట్రాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఏమీ చేయలేదని అసత్య ప్రచారం జరుగుతోందన్నారు. సభలో జరిగే చర్చలో రాష్ట్రాభివృద్ధికి బీజేపీ చేసిందేమిటో వివరిస్తామని,విభజన హామీలపై పూర్తి స్థాయిలో చర్చ జరగాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పై తమకు అపారమైన గౌరవం ఉందని, అయితే ఎవరో ఆయనకు తప్పుడు సలహాలు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. 11 రాష్ట్రాల్లో ప్రత్యేక హోదా విషయమై వస్తున్న ఆరోపణలపై వాస్తవాలు తెలుసుకోవాలని, కేంద్రాన్ని నిరసిస్తూ పెడుతున్న ఫ్లెక్సీలను ఖండిస్తున్నామన్నారు.

రాష్ట్ర ప్రగతికి సూచిక గవర్నర్ ప్రసంగం : మంత్రి కాల్వ

విశాలాంధ్ర అమరావతి : బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగం రాష్ట్ర ప్రగతిని స్పష్టం చేస్తుందని సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు చెప్పారు. శాసనసభలో సోమవారం గవర్నర్ ప్రసంగం అనంతరం ఆయన శాసనసభ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైయ్యాయన్నారు. గడచిన మూడున్నరేళ్లలో సంక్షేమం, అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాల్లో రాష్ట్రం దేశంలో అగ్రగామిగా ఉందన్నారు. విభజనానంతరం రాష్ట్రం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, రైతుల రుణమాఫీ, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించినట్లు తెలిపారు. రెవెన్యూ లోటు, రాజధాని నిర్మాణం, కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరులో జాప్యం వంటి అన్ని అంశాలను ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకువెళుతున్నట్లు చెప్పారు. సభలో గవర్నర్ ప్రసంగంపై చర్చ జరిగినతరువాత బడ్జెట్ ప్రవేశపెడతారని చెప్పారు. చట్టసభల నుంచి ప్రజలు ఏమి ఆశిస్తారో ఆ విధంగా చర్చలు జరగాలని ముఖ్య మంత్రి చంద్రబాబు చెప్పినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రతిపక్షం, అధికార పక్షం అనే తేడాలేకుండా మంత్రుల నుంచి సమాధా నాలు రాబట్టాలని ఆయన సూచించారన్నారు.

ఉపాధి ఊపు తగ్గరాదు

- కోటి పనిదినాల లక్ష్యం పూర్తిచేయండి
- కరవు మండలాల్లో 150రోజులు ఉపాధి కల్పించాలి
- నిధుల జాప్యంపై ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఉపాధి పనుల వేగం తగ్గకుండా కోటి పనిదినాల లక్ష్యం పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సోమవారం తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కోటి పనిదినాల లక్ష్యానికి గతనెలలో 38లక్షలే చేశాం. మిగిలింది ఈ నెలలో సాధించాలని చంద్రబాబు చెప్పారు. పంట సంజీవని లక్ష్యంలో 68శాతం, వర్మికంపోస్ట్ 52శాతం మాత్రమే చేశాం. అన్నింటిలో 100శాతం లక్ష్యం చేరుకోవాలన్నారు. ఉపాధి కూలీల చెల్లింపులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కేంద్రం నుంచి నిధులు సకాలంలో విడుదలయ్యేలా ఎంపీలు పార్లమెంటులో ఒత్తిడి తేవాలని సూచించారు. '80 కరవు మండలాలలో 150 రోజులు ఉపాధి కల్పించాలి. 7 రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి. ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలి. ప్రతి పని పారదర్శకంగా చేయాలి. ఫిర్యాదులకు ఏమాత్రం అవకాశం ఇవ్వరాదు. మెటీరియల్ కాంపోనెంట్ 40శాతానికి మించకుండా చూడా లన్నారు. వేజ్ కాంపోనెంట్‌ను ప్రతిజిల్లాలో 60శాతానికి పెంచుకోవాలన్నారు. 'అభివృద్ధి సంతృప్తిస్థాయికి చేరేందుకు ఉపాధి హామీ పథకం(నరేగా) ఒక సోపానం. నిధుల సమీకరణ (కన్వర్జెన్స్)ను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. నరేగా నిధులు ఎంత ఖర్చుచేస్తే అంతగా మౌలికవసతులు కల్పించవచ్చు, మరోవైపు నిరుపేదలకు ఉపాధి పెంచవచ్చు' అంటూ గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో దీనిని పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలన్నారు. జాతీయ స్థాయిలో వృద్ధిరేటు 6.8శాతం ఉంటే...మన రాష్ట్రంలో సగటున 11.22శాతం సాధించామన్నారు. 17.79శాతం వృద్ధి వ్యవసాయం అనుబంధ రంగాలలో వచ్చే పరిస్థితి ఉందన్నారు. గతేదాది 28శాతం మైనస్, ఈ ఏదాది 14శాతం మైనస్ వర్షపాతం(లోటు) ఉన్నప్పటికీ వ్యవసాయంలో దిగుబడులు తగ్గకుండా చూశామన్నారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా భూగర్భజలాలు పడిపోకుండా కాపాడామన్నారు. ఇదే స్ఫూర్తితో రబీ సీజన్‌లో ఒక్క ఎకరం లోనూ పంటలు ఎండిపోకుండా కాపాడాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రైతుల్లో అశాంతి తలెత్తకుండా కందులు, మినుము, అపరాలకు గిట్టుబాటుధర వచ్చేలా చూడాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అసెంబ్లీ ఉన్నా, సమ్మిట్ ఉన్నా క్రమం తప్పకుండా టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించడం 'నీరు-ప్రగతి'కిచ్చే ప్రాధాన్యంగా సీఎం పేర్కొన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్, రియల్ టైం గవర్నెన్స్ ఎండీ అహ్మద్ బాబు, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్ శాఖల కమిషనర్లు హరి జవహర్ లాల్, రామాంజనేయులు, ఇస్రో రాజశేఖర్, అరుణ్ కుమార్, జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ గ్రీన్ సిగ్నల్

రెగ్యులర్ బేసిస్‌పై 300
అవుట్ సోర్సింగ్‌లో 50

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : అవినీతి నిరోధకశాఖలో (ఏసీబీ) 350 అదనపు పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫిబ్రవరి 21న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఏసీబీకి 350 పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి హేమ ముని వెంకటప్ప సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఏసీబీని మరింత బలోపేతం చేయటంతో పాటు అవినీతి అక్రమార్కుల భరతం పట్టేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఉన్న అధికారులు, సిబ్బందితోనే ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ అవినీతి అధికారుల గుండెల్లో రైళ్ల పరిగెత్తిస్తున్నారు. రాష్ట్రంలో అవినీతిని జీరోస్థాయికి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు పని చేయాలంటే కనీసం 350 పోస్టులను మంజూరు చేయాలని ఏసీబీ డీజీపీ ఠాకూర్ చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందిం చటమే కాకుండా వాటిని భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వటం విశేషం. మొత్తం అదనపు 350 పోస్టులలో 300 పోస్టులను రెగ్యులర్ బేసిస్‌పైనా, 50 పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. త్వరలో భర్తీ చేయనున్న ఈ పోస్టులకు సంబంధించిన పే స్కేల్‌ను కూడా ఆర్థికశాఖ ఖరారు చేసింది. అయితే ఈ పోస్టులను పోలీసుశాఖ, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై నియమిస్తారా, లేక నేరుగా నియామకం చేస్తారా అనేది ఇంకా స్పష్టంకాలేదు.

రెగ్యులర్ పోస్టులు : రెగ్యులర్ విధానంలో ఏసీబీకి నాన్ క్యాడర్‌లో ఒక జాయింట్ డైరెక్టర్ (జేడీ) పోస్టును భర్తీ చేయనున్నారు. అదనపు ఎస్పీ పోస్టులు ఏడు, డీఎస్పీ పోస్టులు తొమ్మిది, ఇన్‌స్పెక్టర్ పోస్టులు 34, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టులు 43, ఏఎస్సై పోస్టులు 11, హెడ్ కానిస్టేబుల్ పోస్టులు 49, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు 90, ఏఆర్ పోలీసు కానిస్టేబుళ్లను 20 మందిని, లీగల్ అడ్వైజర్ పోస్టులు ఆరును భర్తీ చేయనున్నారు. కాంట్రాక్ట్ విధానంలో అదనపు స్టాండింగ్ కౌన్సిల్ పోస్టును భర్తీ చేయనున్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) పోస్టులు రెండు, ఏఈఈ పోస్టులు రెండు, టెక్నికల్, అసిస్టెంట్ టెక్నికల్, స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ), డిప్యూటీ డైరెక్టర్, సూపరింటెండెంట్ పోస్టులను ఒక్కొక్కటి భర్తీ చేస్తారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఐదు, జూనియర్ స్టెనో పోస్టులు 13, కంప్యూటర్ ప్రోగ్రామర్, ఫైల్స్ ఆర్గనైజర్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇచ్చింది.

అవుట్ సోర్సింగ్ : ఏసీబీలో అవుట్ సోర్సింగ్ విధానంలో 50 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు ఎంపిక చేసిన వారికి జీఓఎంఎస్ నెంబర్ 151 ప్రకారం నెలకు రూ.12 వేల నుంచి రూ.17,500 వేతనం చెల్లించేందుకు ఆర్థికశాఖ అనుమతించింది. రూ.17,500 వేతనం చెల్లించేలా నాలుగు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు, రూ.15 వేలు చెల్లించేలా రెండు జూనియర్ అసిస్టెంట్, 20 జూనియర్ స్టెనో పోస్టులు, ఐదు టైపిస్ట్ పోస్టులను, రూ.12 వేలు వేతనంపై 13 ఆఫీస్ సబార్డినేట్, 6 స్వీపర్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

రోజు రోజుకూ పెరుగుతున్న వేడి



విశాలాంధ్ర-విశాఖపట్నం : రాష్ట్రంలో ఎండలు ఎక్కువవుతున్నాయి. ఈ వారం కర్నూలు, తిరుపతి, నెల్లూరు, కావలి, గన్నవరంలో 37 డిగ్రీలు, కాకినాడ, మచిలీపట్నం, నర్సాపురంలలో 35 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. మరో నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. ఆకాశం నిర్మలంగా ఉండటం, పశ్చిమ ఆటంకాలు కూడా తొలగిపోవడంతో దేశవ్యాప్తంగా ఎండలు విజృంభిస్తున్నాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. మార్చి మొదటి వారంలోనే ఈ స్థాయిలో ఎండలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. నందిగామలో 39 డిగ్రీలు నమోదైంది. బాపట్ల, ఒంగోలు, గన్నవరంలోనూ 36 డిగ్రీలు, రెంటచింతలలో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. విశాఖ ఎయిర్‌పోర్టులో 36.4 డిగ్రీలకు చేరుకుందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. రాయలసీమలో ఎండలు మరింతగా మండుతున్నాయి. కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురంలో 38 నుంచి 40 మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో మరో నాలుగు రోజులు వాతావరణం పొడిగానే ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. దీంతో ఎండలు క్రమంగా పెరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆగ్నేయ అరేబియాలో కేరళ తీరం నుంచి మహారాష్ట్ర తీరానికి ఆనుకుని అల్పపీడన ద్రోణి, మాల్దీవుల పరిసరాల్లో ఆవర్తనం కొనసాగుతున్నా రాష్ట్రంపై ఎలాంటి ప్రభావం చూపదని వాతావరణ శాఖ తెలిపింది.

నేటి నుంచి జూడాల సమ్మె

- మాట తప్పిన ప్రభుత్వం..
- 9న అత్యవసర సేవల నిలుపుదలకు నిర్ణయం..!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ జూనియర్ వైద్యుల(జూడా) సంఘం ఈ నెల 6 నుంచి (మంగళవారం) సమ్మెకు పిలుపునిచ్చింది.తొలుత జూడాల హామీల అమలు కోసం ఫిబ్రవరి 5 నుంచి సమ్మె నోటీసు ఇచ్చిన విషయం విదితమే.దీనిపై ప్రభుత్వం స్పందించి జూడాల నేతలతో చర్చించింది. ఫిబ్రవరి 28లోగా హామీల అమలుకు చర్యలు చేపడతామని ప్రకటించింది. దీంతో జూడాలు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఇప్పటివరకూ జూడాల వేతనాల పెంపునకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. వేతనాల పెంపు అమలుకు నోచుకోలేదు. జూడాల బ్యాంకు ఖాతాల్లోకి పెంచిన వేతనాల్ని ప్రభుత్వం వేయలేదు. డిగ్రీల తర్వాత చేయాల్సిన రిజిస్ట్రేషన్ ఫైల్‌ను అసెంబ్లీలో ఆమోదం కోసం పెడతామని ప్రభుత్వం చేసిన హామీపైనా కదలిక లేదు. అసలు సంబంధిత ఫైల్‌ను ఇంతవరకూ రూపొం దించలేదు. దీంతో ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ మంగళవారం నుంచి జూడాలు సమ్మెకు సన్నద్ధమయ్యాయి. అసెంబ్లీ సమావేశాల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనల ద్వారా జూడాలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నారు.

డిమాండ్లు ..

- ✦ జూడాలకు 2018 నుంచి నేటి ఖర్చులకు అనుగుణంగా జీవన భృతిని ఇవ్వాలి.
- ✦ 2016, 2017లకు పెంచిన15శాతం బకాయిలు వెంటనే విడుదల చేయాలి.
- ✦ జూడాలకు ఇచ్చే జీవనభృతిని ప్రతినెలా 10న వచ్చేలా చర్యలు తీసుకోవాలి.
- ✦ ఎంసీఐ నిబంధనలల్లో 13బీ ప్రకారం ఎంబీబీఎస్, పీజీ డిగ్రీలు పూర్తి చేసిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలి.

జూడాల హామీలపై ప్రభుత్వం విఫలం: వెంకట రమణ : జూడాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని అమలు చేయడంలో విఫలమైందని ఏపీ జూడా అధ్యక్షులు వెంకట రమణ తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి తాము సమ్మెకు సిద్ధమవ్వగా, ప్రభుత్వం చర్చలకు పిలిపించిందని గుర్తుచేశారు. 28లోగా హామీల్ని అమలు చేస్తామని భరోసా ఇచ్చిందన్నారు. ఇంతవరకూ ఒక్కటీ సక్రమంగా ప్రభుత్వం అమలు చేయలేదని వాపోయారు.దీంతో నెల 6 నుంచి సమ్మెకు పిలుపునిచ్చామన్నారు.ఈ నెల 9 నుంచి అవసరమైతే అత్యవసర నిధుల్ని బహిష్కరిస్తామని జూడాలు హెచ్చరించారు.



ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయండి

- రూ. 4 వేల కోట్లు నిధులు విడుదల చేయాలి
- సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి
- ఖాళీ కుండలతో సీపీఐ వినూత్న నిరసన

విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : చిత్తూరు జిల్లాలో తాగు, సాగునీటి ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి డిమాండు చేశారు. ప్రాజెక్టుల పూర్తికి రూ.4 వేల కోట్లు మంజూరు చేయాలని కోరారు. సీపీఐ చిత్తూరు జిల్లా మహాసభ పిలుపు మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. చిత్తూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ జిల్లా కార్యదర్శి రామా నాయుడు, నగర కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఖాళీ కుండలు నెత్తిన పెట్టుకొని వినూత్న నిరసన చేపట్టారు. అలాగే మదనపల్లి, శ్రీకాళహస్తి, రేణిగుంట, పుత్తూరు, నగరి, చంద్రగిరి, పీలేరు, బి.కొత్తకోట, సత్యవేడు, వరదయ్య పాళెం, పుంగనూరు, ఐరాల, పలమనేరు తదితర కేంద్రాల్లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద పి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు గంగ, హంద్రీనీవా, సోమశిల, గాలేరు నగరి నీటి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సహకార రంగాన్ని నిర్వీర్యం చేసిన వారికి పదవులు ఇచ్చిన ఘనత బాబుకే దక్కుతుందన్నారు. రైతులు మహానగరాలకు వలసలు వెళ్లి కూలీలుగా మారిపోయారని, రాష్ట్రం మొత్తం అవినీతి మాయం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్వోను ఏసీబీ అధికారులు పట్టుకుంటే రూ. 100 కోట్లు దొరకడం బాబు పాలనకు నిదర్శనం అని ఎద్దేవా చేశారు. అవినీతిలో పట్టుబడిన సొమ్ముతో ప్రాజెక్టులు పూర్తి చేయవచ్చన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు అందరికీ ఇల్లు, ఉద్యోగం ఇస్తామన్న హామీని బాబు తుంగలో తొక్కారని, సాంకేతిక కారణాలు చూపి రేషన్, పింఛన్‌లు ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ సహాయ కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుచరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. సీపీఎం నాయకులు కుమార్ రెడ్డి ధర్నాకు సంఘీభావం తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ఎస్.డి. రవి, లక్ష్మయ్య, ఎం.డి ప్రసాద్, జె వి చలపతి, శివ, శశి, చలపతి, రత్నమ్మ, నదియా, నాయకులు చంద్ర శేఖర్ నాయుడు, సూరి, శివ, తనికాచాలం, విక్రమ్, రామకృష్ణ, రామచంద్రయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

గవర్నరు ప్రసంగం 'అర్ధసత్యం' : పి.మధు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ఉభయ సభల్ని ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగం ఆత్మస్తుతి, అర్ధసత్యాలుగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు సోమవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. కీలకమైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఎలాంటి వైఖరి తీసుకుందో స్పష్టం చేయలేదన్నారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఒక శాసన సభ్యుడు భూకబ్జాలకు పాల్పడ్డారంటూ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం కొనసాగుతోందని, దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. రౌడీయిజాన్నీ పూర్తిగా అదుపులోకి తెచ్చామంటూ గవర్నర్ వ్యాఖ్యానించడం అసత్యమని, గవర్నరు ప్రసంగంలో సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు రెండు పేరాలు మాత్రమే కేటాయించడం బాధాకరమని పేర్కొన్నారు.

ప్రకాశంలో మరో 18 కరవు మండలాలు

9 మండలాల్లో తీవ్ర కరవు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఈ ఏడాది రబీ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదు చేసుకున్న మరో 18 కరవు మండలాలను ప్రకటించింది. ఫిబ్రవరి 21న రాష్ట్రంలోని 5 మండలాల్లో 80 కరవు మండలాలను ప్రకటించగా, తాజాగా ప్రకాశం జిల్లాలో మరో 18 కరవు మండలాలను ప్రకటించింది. దీంతో కరవు మండలాల సంఖ్య 98కి చేరింది. తాజాగా ప్రకటించిన మండలాల్లో తొమ్మిదింటిలో తీవ్ర కరవు, మరో తొమ్మిదింటిలో ఒక మోస్తరు కరవు ఉందని ప్రకటించింది.

ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్‌సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లాలో 56 మండలాలుండగా, గత నెలలో 34 మండలాల్లో తీవ్ర కరవు, మూడు మండలాల్లో ఒక మోస్తరు కరవు ఉన్నట్లు ప్రకటించగా, తాజాగా తొమ్మిదింటిలో తీవ్ర, మరో తొమ్మిదింటిలో ఒక మోస్తరు కరవు ఉన్నట్లు తెలిపింది. దీంతో ఆ జిల్లాలో మొత్తం 56కుగానూ 55 మండలాల్లో కరవు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. కొత్తగా ప్రకటించిన కరవు మండలాల్లోనూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)లో కార్మికులకు 150 రోజులపాటు పని కల్పించాల్సి ఉంటుంది. ఇదిలావుండగా, ప్రకాశం జిల్లాలో 2017-18 రబీ సీజన్‌లో అన్ని మండలాల్లో కరవు విలయతాండం చేస్తుంటే, 43 మండలాల్లో తీవ్ర కరవు ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించటంపై రైతు సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక మోస్తరు కరవు ఉన్నట్లుగా ప్రకటించిన 18 మండలాలతోపాటు మిగిలిన ఒక మండలాన్ని కూడా తీవ్ర కరవు మండలాలుగా ప్రకటించాలని నాయకులు డిమాండు చేస్తున్నారు.

తీవ్ర కరవు మండలాలు : కొత్తపట్నం, మద్దిపాడు, ఎన్‌జీ పాడు, ఒంగోలు, కొండెపి, ఉలవపాడు, జరుగుమల్లి, కందుకూరు, వై పాలెం.

మోస్తరు కరవు మండలాలు : చినగంజాం, ఇంకొల్లు, జె పంగలూరు, కారంచేడు, పర్చూర్, వేటపాలెం, యద్దనపూడి, పుల్లలచెరువు, టంగుటూరు.

కంది పంట మొత్తం కొనాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న కంది ఉత్పత్తులన్నింటినీ కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్‌లు సోమవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. కేంద్ర ప్రభుత్వం కందికి మద్దతు ధర రు.5,450లుగా నిర్ణయించగా, ప్రస్తుతం మార్కెట్‌లో రూ. 4 వేల రూపాయలు మాత్రమే ధర పలుకుతోందన్నారు. నిబంధనల పేరుతో మార్క్‌ఫెడ్ పండిన పంటనంతా కొనుగోలు చేయకుండా ఆటంకాలు కల్పించడం సరికాదన్నారు. పంటను రైతులు బయట మార్కెట్‌లో అమ్ముకుంటే క్వింటాకు రు.1,500లు నష్టం వస్తోందన్నారు. కరువు కాటకాలతో ఇబ్బందుల్లో ఉన్న రైతులను నిబంధనల పేరుతో నష్టపెట్టడం సరికాదన్నారు. కొంతమంది రైతులు ప్రధాన పంటలతోపాటు, ఇతర పంటల మధ్య కూడా కొంత పండించారని, అధికారులు దానిని గుర్తించకపోవడం సరైందికాదన్నారు. కర్నూలు జిల్లాలో ప్రభుత్వం మండలానికి 2,500 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధన విధించి, పూర్తిస్థాయిలో కొనుగోళ్లు జరిగాయని కేంద్రాలను నిలిపివేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రకాశం తదితర కరవు మండలాల్లో ఎకరాకు 2 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని పరిమితులు విధించడం సరైందికాదని వివరించారు. ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఏప్రిల్ నెలాఖరు వరకు వాటిని కొనసాగించాలని, సరుకు కొనుగోళ్లు జరిపిన వారంలోగా రైతు ఖాతాల్లో సొమ్ము జమచేయాలని వారు డిమాండు చేశారు. వీటిపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టనిపక్షంలో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.747.37 కోట్ల నిధులు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని గ్రామీణ, స్థానిక సంస్థలకు 20-7-18 ఆర్థిక సంవత్సరానికి14వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.747.37 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు, యుటిలైజేషన్ సర్టిఫికెట్‌లను సమర్పించి నిధులను డ్రా చేసుకోవచ్చని ప్రభుత్వం తెలియజేసింది. ఒకవేళ అదనంగా ఇంకా ఏమైనా పనులు చేపట్టాలనుకుంటే అందుకు సంబంధించిన ప్రణాళికను సమర్పించాలని ప్రభుత్వం సూచించింది.

అసెంబ్లీ సమావేశాలను తేలిగ్గా తీసుకోవద్దు : చంద్రబాబు

విశాలాంధ్ర అమరావతి: అసెంబ్లీ సమావేశాలను తేలికగా తీసుకోవద్దని ఎమ్మెల్యేలకు ,మంత్రులను ముఖ్య మంత్రి చంద్రబాబు తెలిపారు. సోమవారం అసెంబ్లీ వాయిదా అనంతరం మంత్రులు, వ్యూహ కమిటీ సభ్యుల తో తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలంతా ఖచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు ప్రైవేటు కార్యక్రమాలు పెట్టుకోవద్దని , సభలో ప్రతిపక్షం లేదని సమావేశాలను తేలికగా తీసుకోవద్దన్నారు. ఎమ్మెల్యేల హాజరు బాధ్యత ఇన్‌ఛార్జ్ మంత్రులదేనని, సభలో ఎమ్మెల్యేలు, మంత్రులు పూర్తి అవగాహనతో మాట్లాడాలని ముఖ్యమంత్రి సూచించారు.

పాదయాత్ర కంటే అసెంబ్లీ పవిత్రమైంది

19 అంశాలు కేంద్రం పరిష్కరించాలి : డొక్కా మాణిక్యవరప్రసాద్

విశాలాంధ్ర అమరావతి : నవ్యాంధ్ర ప్రజల మనోభావాలకు అనుగుణంగా కేంద్రం, రాష్ట్ర సంక్షేమానికి కృషి చేయాలని శాసనసమండలి సభ్యుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ డిమాండు చేశారు. శాసనసభ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర విభజన చట్టంలోని వాటితో పాటు హామీ ఇచ్చిన 19 అంశాలను కేంద్రం పరిష్కరించాలన్నారు. ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ వినూత్నరీతిలో ప్రసంగించారన్నారు. ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి మాట్లాడుతూ పాదయాత్ర కంటే శాసనసభ పవిత్రమైందన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షం పునరాలోచించుకోవాలని సూచించారు. ఫిరాయింపు శాసనసభ్యుల విషయంలో సుప్రీంకోర్టు, పార్లమెంటుల పరిధిలో ఉన్నాయని, అన్ని రాష్ట్రాల్లో ఈ ఇబ్బందులు కొనసాగుతున్నాయని త్వరగా దీనిపై కేంద్రం స్పష్టత ఇవ్వాలన్నారు. తానూ దళిత కులానికి చెందినవాడినేనని, ఉన్నత కులాలవారు ఎవరూ తనని ఎప్పుడు తక్కువగా చూడలేదని డొక్కా తెలిపారు. రాష్ట్ర సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని మాణిక్య వర ప్రసాద్ కొనియాడారు.

ఎంపీల ఆందోళనకు మద్దతు : కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పార్లమెంటు సాక్షిగా రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీతోపాటు రాష్ట్ర విభజన చట్టంలోని అన్ని అంశాల్ని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రానిదేనని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా రాష్ట్రాన్ని కేంద్రం విభజించిందని, కేంద్రమే రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన అవసరముందని తెలిపారు. ఢిల్లీలో ఎంపీలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు.

ఇది పెద్ద దెబ్బేమీ కాదు : బాలకృష్ణ



విశాలాంధ్ర అమరావతి: ఇటీవలే శస్త్ర చికిత్స చేసుకున్న బాలకృష్ణ, కట్టుతోనే సోమవారం అసెంబ్లీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ఎమ్మెల్యేలు పరామర్శించారు. జీవితంలో తగిలిన ఎన్నో దెబ్బలతో పోలిస్తే ఇది పెద్ద దెబ్బేమీ కాదని బాలయ్య వారికి సమాధానం ఇచ్చారు. మార్చి31 నుంచి ఏప్రిల్ 1 వరకూ లేపాక్షి ఉత్సవాలు నిర్వహిస్తా మని ప్రకటించారు. హంద్రీనీవా సుజల స్రవంతికి జలహారతి నిర్వహించి ఉత్సవాలను ప్రారంభిస్తామని తెలిపారు. గౌతమిపుత్ర శాతకర్ణి' సినిమా షూటింగ్‌లో బాలయ్య కుడిభుజానికి గాయమైంది. అప్పటి నుంచి విరామం లేకుండా సినిమాలు తీస్తున్నారు. అయితే నొప్పి తిరగతోడడంతో ఆయన ఇటీవల హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా బాలయ్య మీడియాతో మాట్లాడుతూ ఈనెల 29న ఎన్టీఆర్ సినిమా ప్రారంభిస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా తీసే సినిమా కాదిదని బాలకృష్ణ చెప్పారు. వచ్చే సంక్రాంతికి సినిమాను విడుదల చేస్తామని, ఈ సినిమాకు చాలా మంది చాలాపేర్లు సూచించారని తెలిపారు. ఎన్టీఆర్‌కు మించిన పేరు లేదని భావించి ఆపేరే ఖరారు చేశామని వెల్లడించారు. ఎన్టీఆర్‌ను పార్టీలకతీతంగా అందరూ అభిమానించారన్నారు.

సంపాదకీయం

త్రిపుర విజయం భవిష్య సూచికం కాబోదు

ధనబలంతో ఒకదాని తర్వాత మరో రాష్ట్రాన్ని హస్తగతం చేసుకోడానికి కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం వ్యూహరచన చేసినట్లు స్పష్టమవుతోంది. పెద్దనోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థ కుదేలయిన ప్రభావం ప్రజలపైన లేదని, అందుకే తాజాగా జరిగిన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తమపార్టీకి పట్టం కట్టారని బీజేపీ అధిష్టానం ఒక ప్రచారాన్ని సాగిస్తోంది. త్రిపుర ఎన్నికల ప్రభావం కర్నాటక, కేరళ రాష్ట్రాలపై వుంటుందని, ఈసారి ఆ రెండు రాష్ట్రాల్లో కూడా తమ పార్టీ విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా పగటి కలలు కంటున్నారు... 'ధనమదం'తో త్రిపురలో విజయం సాధించిన విషయాన్ని విస్మరించి, విషప్రచారానికి ఒడిగడుతున్నారు. బీజేపీ త్రిపురలో సాధించిన విజయాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాల్లో తమ విజయావకాశాలకు భవిష్యత్ సూచికంగా భావిస్తే అది పొరపాటే అవుతుంది. ప్రజాతీర్పుకు శిరసువంచి త్రిపుర ముఖ్యమంత్రి పదవికి మాణిక్ సర్కార్ ఆదివారం రాజీనామా చేశారు. రాష్ట్ర గవర్నర్‌కు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే వరకు మాణిక్ సర్కార్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. నిర్ధనుడైన మాణిక్ సర్కార్ ధనపూర్ నియోజక వర్గం నుండి విజయం సాధించారు. త్రిపురలో రెండుపార్టీల ఓట్లశాతం తారుమారు కావడం గమనించినట్లయితే, బీజేపీ అవకాశవాద రాజకీయాలకు పాల్పడి కాంగ్రెస్ ఓటర్ గణాలను స్వాధీనపర్చుకొన్నట్లు స్పష్టమవుతోంది. సీపీఐ(ఎం)కు గత శాసనసభ ఎన్నికల్లో వచ్చిన దాదాపు 50 శాతం ఓట్లకు ప్రతిరూపంగా గత మూడు శాసనసభ ఎన్నికల్లో వచ్చిన ఒక శాతం నుండి బీజేపీ ఓట్ల శాతం పెరగ్గా సంప్రదాయంగా త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లభిస్తున్న 30 ప్లస్ ఓట్ల శాతం ఏక అంకెకు పడిపోయింది. నాటకీయంగా ఈ విధంగా ఓట్ల బదిలీ జరగడం సాధారణ విషయం కాదు. అంటే దీనర్థం, కాంగ్రెస్ పునాది దాదాపు మొత్తంగా బీజేపీకి పోయింది. ఈ విధంగా కాంగ్రెస్ ఓటు శాతం టోకుగా బీజేపీకి పోవడానికి కారణాలు సుస్పష్టం. మొదటిది, కాంగ్రెస్ సంప్రదాయపు మద్దతుదారులు 1988లో అధికారాన్ని కోల్పోయినప్పటి మాదిరిగా పార్టీ పాలన సామర్థ్యం పట్ల విశ్వాసాన్ని కోల్పోయారు. అందుచేత సీపీఐ(ఎం)ను ఓడించడానికి బీజేపీయే శక్తివంతమైనదిగా కాంగ్రెస్ మద్దతుదారులు భావించినట్లు కనబడుతోంది. రెండవది, జాతుల పోరాటరహిత వాతావరణం కల్పించేటట్లు చూడకుండా గత కీర్తి ఆధారంగా సమయాన్ని గడుపుతూ ఒక దిశానిర్దేశ భావన లేకుండా మార్క్సిస్టులు కూడా కనిపించి వుండవచ్చు. దేశంలో ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి గురించి రాయడానికి, చెప్పుకోడానికి ఏమీ లేకపోయినప్పటికీ, ఓటర్లను ప్రేరేపించడానికి బీజేపీ చేసిన అభివృద్ధి వాగ్దానాలకు సీపీఎం నుండి కనీసం సమాధానం లేదు. బీజేపీ జపించే అభివృద్ధి మంత్రంతో సాధించింది ఏమీ లేని ఫలితంగానే రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఉపఎన్నికల్లో ముష్టిఘాతాలకు ఆ పార్టీ గురైంది. గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు స్వల్ప మెజారిటీతో గెలిచింది. అయితే, ఈశాన్య రాష్ట్రాల్లో దృశ్యం భిన్నం. అవి ప్రధాన కేంద్రం నుండి దూరంగా విసిరేసిన రాష్ట్రాలు. నిర్లక్ష్యానికి, అశ్రద్ధకు గురైనవి. దాంతో నాగా తిరుగుబాటుదారుల అపరిష్కృత సమస్యతో సహా ఉగ్రవాదానికి ఆజ్యం పోసినట్లయింది. మోడీ అభివృద్ధి మంత్రాన్ని ఈశాన్య రాష్ట్రాల ప్రజలు విశ్వసించారు. కేంద్రంలో అధికారంలో వున్న పార్టీని గెలిపిస్తే నిరుద్యోగిత, మౌలిక సౌకర్యాల లేమి వంటి సమస్యలు పరిష్కారమవుతాయని భావించారు. మోడీ గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు జరుగలేదన్న, నూతన ఉపాధి అవకాశాలు కల్పించలేదన్న వాస్తవాలను ఆ రాష్ట్రాల ప్రజలు విస్మరించడం దురదృష్టకరం. సీపీఐ(ఎం), కాంగ్రెస్ రెండు కూడా తమను ఛాలెంజ్ చేసిన వారి సవాలును తీవ్రంగా పరిగణనలోకి తీసుకోకపోవడం కూడా బీజేపీ విజయానికి దోహదం చేసింది. బహుశా బీజేపీ హిందీ అనుకూల నినాదాన్ని ముఖ్యంగా ఉపయోగించుకోవడంపైనే ఆ రెండు పార్టీలు ఆధారపడడంవల్ల కూడా ఆ పార్టీలకు నష్టం జరిగింది. బీజేపీ వివిధ ప్రాంతాల్లో విభిన్న పార్టీలను తమకు అనుకూలంగా మలచుకొనే కళను నేర్చుకొందన్న విషయాన్ని ఆ పార్టీలు గ్రహించినట్లు కనిపించడం లేదు. గొడ్డు మాంసం తినేవారిని పాకిస్తాన్ పంపించేస్తామని కేంద్ర మంత్రులు బెదిరించారు. ఈశాన్య రాష్ట్రాల్లోని బీజేపీ నాయకులు క్రైస్తవులను ఛార్జీరహితంగా జెరూసలేం పంపిస్తామని వాగ్దానం చేశారు. గొడ్డు మాంసాన్ని రద్దు చేస్తామని ఒక్క మాట అనలేదు. ఇది బీజేపీ కేంద్రమంత్రులు, ఆ పార్టీ నాయకుల ద్వంద్వ నీతిని పట్టిస్తోంది. ఈ విషయానికి సంబంధించి ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ ఉత్తర, పశ్చిమ భారత్‌లో గొప్ప బీజేపీకి "మమ్మీ", అయితే ఈశాన్య రాష్ట్రాల్లో గోవు దానికి "యుమ్మీ" (రుచికరమైనది) అన్న విషయాన్ని బీజేపీ ఆచరించినట్లు కనిపిస్తోంది. అయితే త్రిపురలో సాధించిన విజయం పట్ల బీజేపీ సంతృప్తి చెందినప్పటికీ, పార్టీలో చేరిన కాంగ్రెస్ వారి నుండి మరిన్ని సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని దానికి తెలిసివస్తుంది. పార్టీ ఫిరాయించిన వారిని అరుదుగా విశ్వసించవచ్చు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) పాత్రను పరిగణనలోకి తీసుకున్నట్లయితే, బీజేపీ-కాంగ్రెస్ రాజకీయ సంస్కృతి మధ్య పొంతనేలేదు. అదే విధంగా, తన భాగస్వామ్య పార్టీ అయిన ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) విషయాన్ని పరిగణనలోకి తీసకున్నట్లయితే బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వాన్ని గిరిజనుల ప్రశ్న వెంటాడుతుందన్నది నిస్సంశయం. ప్రత్యేక రాష్ట్ర డిమాండును తిరస్కరిస్తే ఐపీఎఫ్‌టీ గుడ్డిగా ఆమోదించే ప్రశ్నే వుండదు. ఏది ఏమైనా కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ధనప్రవాహ రాజకీయాలకు ప్రజలు అడ్డుకట్టవేసి, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పకపోతే భారత లౌకిక రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదం పొంచి వుంటుందని దేశ ప్రజలు గ్రహించాలి.

చురక

కేంద్రంలో థర్డ్ ఫ్రంటు
కొరకు కేసీఆర్ పిలుపు
కాగలదా దేశంలో
కొత్త రాజకీయ మలుపు

స్వంత రాష్ట్ర సమస్యలు
చక్కదిద్దలేని కీర్తి
ఫ్రంటు పెడితే అవుతుందా
ప్రజలకు ఆదర్శ స్ఫూర్తి

- వేల్పుల నారాయణ

సీమ ప్రాజెక్టులకు టీడీపీ, బీజేపీ ద్రోహం చేసిన వారే!

విశ్లేషణ



వి. శంకరయ్య

సీమకు సాగునీటి రంగంలో జరిగిన విద్రోహమంతా కాంగ్రెస్ హయాంతోపాటు ప్రధానంగా టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలోనే ఎక్కువగా జరిగింది. ఎన్టీఆర్ ప్రతిపాదించిన మిగులు జలాల ఆధారం గల ప్రాజెక్టులను కీలక సమయంలో 1995 నుండి 2004 వరకు దస్త్రాలకే పరిమితం చేశారు. ప్రస్తుతం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ పరిధి నాలుగు రాష్ట్రాల మధ్య జరిగివుంటే లేని నీళ్ళకోసం రెండు తెలుగు రాష్ట్రాలు పోట్లాడుకోవల్సి వచ్చేదికాదు. మిగులు జలాలతో నిర్మాణంలో వున్న సీమ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఓ మోస్తరుగానైనా కేటాయింపబడేవి. ప్రస్తుతం సీమ ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని ఆరోపించే బీజేపీ వాదనలో వాస్తవమున్నా ఈ ప్రాజెక్టుల నీటి కేటాయింపులకు కేంద్రం ఎసరు పెట్టిన సంఘటన గుర్తుచేసుకోవల్సివుంది. సీమకు కాంగ్రెస్ చేసిన ద్రోహానికి మట్టిగొట్టుకు పోయింది.

ప్రత్యేకహోదాతోపాటు చట్టబద్ధంగా రాష్ట్రానికి అందాల్సిన నిధులు, రాయితీల అంశంలో గత మూడున్నరేళ్ళుగా టీడీపీ, బీజేపీ ప్రదర్శించిన కపట నాటకంలో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇదిలా వుండగా దుర్భిక్ష ప్రాంతాలకు చెందిన కృష్ణా మిగులు జలాలతో నిర్మాణంలో వున్న సాగునీటి ప్రాజెక్టుల అంశంలో కూడా కేంద్రం తీరని ద్రోహం చేసింది. 1995 నుండి 2004 వరకు జరిగిన, నిర్లక్ష్యానికితోడు 2004 తర్వాత కూడా కీలక సమయంలో ముఖ్యమంత్రి మౌనందాల్చి సీమ ప్రాజెక్టుల నీటి కేటాయింపుల అంశం ప్రమాదంలో పడేశారు. 2004లో కృష్ణానదీ జలాల వివాద పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ (రెండవది) ను నియమించింది. దాదాపు 6 సంవత్సరాల తర్వాత 2010లో ట్రిబ్యునల్ తన మధ్యంతర తీర్పును ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టుకెక్కగా తమ అభ్యంతరాలను ట్రిబ్యునల్ ఎదుటే పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు ఇచ్చింది. తిరిగి 2013 నవంబరులో ట్రిబ్యునల్ తన తుది తీర్పును ప్రకటించింది. ఈ తీర్పుకూడా తమకు సమ్మతం కాదని తిరిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా ట్రిబ్యునల్ తీర్పును గెజిట్ నోటిఫికేషన్ చేయవద్దని కేంద్రం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒకవేళ ఈ తీర్పు గెజిట్ నోటిఫికేషన్ చేయబడివుంటే 2050 వరకు పునఃపరిశీలన జరిగే అవకాశముండేది కాదు. గమనార్హమైన అంశంమేమంటే కావేరి నదీజలాల వివాదాంశంలో ట్రిబ్యునల్ తీర్పును తాజాగా సుప్రీంకోర్టు సవరించింది. దీని పరిణామాలు ఎలా వుంటాయో భవిష్యత్తు తేల్చవల్సింది. ట్రిబ్యునల్ తీర్పు అంశంపై ఇప్పటికీ సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. రాష్ట్ర విభజన జరిగిన తదుపరి తెలంగాణా ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టుకెక్కింది.

రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89(ఎ) ప్రకారం కృష్ణానదిలో జలాల కేటాయింపులు జరిపివుండని పక్షంలో రెండు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు జరపాలి. సెక్షన్ 89(బి) కింద తక్కువ ప్రవాహం వున్న సందర్భంలో నీటి కేటాయింపులు ప్రోటోకాల్ నిర్ణయించాలని పేర్కొని వున్నందున వీటి పరిష్కారానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌ను కేంద్రం ప్రభుత్వం పొడిగించింది. అదే సమయంలో ట్రిబ్యునల్ తుది తీర్పు అంశంపై సుప్రీంకోర్టులో వున్న కేసు విచారణ సందర్భంగా 2015లో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కొన్ని వివరణలు కోరింది. ట్రిబ్యునల్ విచారణ పరిధి కృష్ణానది పరివాహక ప్రాంత రాష్ట్రాలైన నాల్గింటి మధ్య విచారణ సాగాలనా? లేక రెండు తెలుగు రాష్ట్రాల మధ్యనే విచారణ జరపాలనా? అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది. కానీ ఈ సందర్భంలో కొంతకాలంపాటు కేంద్రం స్పందించకపోవడంతో తుదకు సుప్రీంకోర్టు ఆగ్రహం ప్రకటించిన తర్వాత రెండు తెలుగురాష్ట్రాల మధ్యనే విచారణ జరగాలని అఫిడవిట్ దాఖలు చేసి తెలంగాణాతోపాటు ఏపీకి ప్రధానంగా మిగులు జలాల ఆధారంగా సీమలో వున్న ప్రాజెక్టులకు సరిదిద్దలేని అపకారం చేసింది. ఈ సందర్భంలో కొన్ని ప్రధానాంశాలు పరిశీలించవలసి వుంది. బచావత్ అవార్డును తెలంగాణా ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని వాదిస్తున్నందున కేంద్రం ప్రభుత్వం రెండు రాష్ట్రాల మధ్యనే విచారణ పరిధి వుండాలని నిర్ణయించడం వలన ఏపీకి లభించిన వాటాకు గండిపడే అవకాశముంది. అదే నాలుగు రాష్ట్రాల మధ్య విచారణ జరిగితే ఈ ప్రమాద ప్రభావం తగ్గిపోయి వుండేది. దీనికితోడు సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ జరుగుతున్న సందర్భంలో న్యాయపరంగానే కాకుండా రాజకీయంగా కూడా ఏపీ ప్రభుత్వం ఉలకలేదు పలకలేదు. ఆ సందర్భంలో టీడీపీ బీజేపీ మైత్రి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వున్నా రాజకీయంగా కేంద్రం వద్ద ముఖ్యమంత్రి ఎట్టి లాబీ చేయలేదు. ఆనాడు జరిగిన ఈ తప్పిదంతో మిగులు జలాల ఆధారంగా నిర్మింపబడే సీమ ప్రాజెక్టుల సంగతి దేవుడెరుగు? రాజధాని నిర్మిస్తున్నందున ఆ ప్రాంతంలో కృష్ణానదీ జలాల వినియోగం తగ్గుతున్నందున తమకు వాటా పెంచాలని ట్రిబ్యునల్ ముందు తెలంగాణా ప్రభుత్వం వాదిస్తోంది.

> కనీసం ఎగువ రాష్ట్రాలకు కేటాయింపులుపోగా మిగిలిన నీరునైనా సీమలోని ప్రాజెక్టులకు కేటాయిస్తానని రాష్ట్రప్రభుత్వం ట్రిబ్యునల్ ముందు అఫిడవిట్ దాఖలు చేయవలసివుంది. ఏది ఏమైనా అధికారికంగా కేటాయింపులు వుంటే తప్ప ప్రతియేడు ఏదో ఒక మేరకు సీమ ప్రాజెక్టులకు కొద్దిపాటి మిగులు లేక నికర జలాలు వస్తాయి. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరుగు పరిచి గోదావరి జలాలతో సీమను సశ్యశ్యామలం చేస్తానని చెబుతున్నారు. ఇవన్నీ నీటి మూటలే.


చాలామందికి నేడు గుర్తుండకపోవచ్చు. 2015 ప్రాంతంలో కృష్ణానదిలో నీటి ప్రవాహం తక్కువగానున్న సమయంలో దామాషా పద్దతిపై నీటి పంపకం జరగాలని మైకు ముందు నిలబడిన ప్రతి సందర్భంలో ముఖ్యమంత్రి వాదించారు. కానీ ఇటీవల కాలంలో ఈ అంశమే . ప్రస్తావనకు తీసుకురావడంలేదు. వాస్తవం చెప్పాలంటే ఇలాంటి అంశాలను నదీ జలాల వివాద పరిష్కారానికి నియమింపబడే ట్రిబ్యునల్స్ పరిష్కరించాలి. ఆ దశలోనే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణాంశంగా దామాషా పద్దతిపై నీటి పంపకాన్ని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసి వుంటే అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ఒప్పించివుంటే నీటి ప్రవాహం తక్కువగా వున్న రోజుల్లో దిగువ రాష్ట్రమైన ఏపీకి ఊరట కలిగేది. ఈ అంశాన్ని రాజకీయ నినాదంగానే ముఖ్యమంత్రి ముగించారు. పైగా 2015లోనే ట్రిబ్యునల్లో ఒక సభ్యుని స్థానం కాళీకాగా అందులోకూడా కర్ణాటకకు చెందిన అధికారిని నియమించడం జరిగింది. ఈ అంశంపై కూడా అప్పట్లో వివాదమేర్పడిన ఏపీ ప్రభుత్వం మౌనం పాటించింది. అంతేకాదు. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రెండు తెలుగు రాష్ట్రాలమధ్యనే విచారణ జరగాలని అఫిడవిట్ దాఖలు చేయడం వెనుక కర్ణాటక మహారాష్ట్ర లాబీలు పనిచేసినట్లు అప్పట్లో మీడియాలో వార్తలు వెల్లువెత్తాయి. ఈ సమయంలో కూడా ఏపీ రాజకీయంగా ఎట్టి లాబి జరుపనందున మిగులు జలాలు ఆధారంగా నిర్మింపబడే ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల సమస్య నేడు విషమంగావుంది. ట్రిబ్యునల్ ముందు నేడు వాదనలు సాగుతున్నాయి. రేపు ట్రిబ్యునల్ రెండు తెలుగురాష్ట్రాలకు తన తుది తీర్పులో వెలువరించినట్లు క్యారీఓవర్ క్రింద కేటాయించిన నీరు తప్ప పంపిణీ చేసేందుకు నీటి చుక్కలేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మిగులు జలాలతో సహా అన్ని రాష్ట్రాలకు తన తుది తీర్పులో పంపిణీ చేసింది. కేవలం 30+120=150 టీఎంసీల జలాలు క్యారీఓవర్ క్రింద మాత్రమే మిగిలి వున్నాయి. ప్రస్తుతం ట్రిబ్యునల్ తన తుది తీర్పు సవరించే అవకాశాలులేవు. ఒకవేళ సవరణ జరిగితే ఆ ప్రభావం కర్ణాటక, మహారాష్ట్రాలపై కూడా పడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు తెలుగురాష్ట్రాలే లేని నీళ్ళకోసం పోట్లాడుకోవలసి వస్తోంది. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2015లో సుప్రీంకోర్టులో వేసిన అఫిడవిట్లో ట్రిబ్యునల్ విచారణ పరిధి నాలుగు రాష్ట్రాల మధ్య జరగాలని పేర్కొని వుంటే రెండు తెలుగు రాష్ట్రాలకే కాదు. ప్రధానంగా మిగులు జలాల ఆధారంగా వున్న సీమ ప్రాజెక్టులకు మేలు జరిగేది.

మిగులు జలాల ఆధారంగా రెండు తెలుగు రాష్ట్రాలలో నిర్మాణంలో వున్న ప్రాజెక్టులకు ట్రిబ్యునల్ ఎక్కడనుండి నీరు తీసుకువచ్చి పంపణీ చేస్తుంది? అదే అన్ని రాష్ట్రాలమధ్య పునఃవిచారణ జరిగివుంటే ఈ దుస్థితి ఏర్పడేదికాదు. ఈరోజు రాయలసీమలో మిగులు జలాల ఆధారంగా నిర్మింపబడుతున్న హంద్రీనీవా (40 టీఎంసీలు) గాలేరు నగరి (38 టీఎంసీలు) వెలుగొండ (43.50 టీఎంసీలు) కేటాయింపులు ప్రమాదంలో పడ్డాయి. తెలుగుగంగకు మాత్రం ట్రిబ్యునల్ తన తుది తీర్పులో 25 టీఎంసీలు కేటాయించింది. రాజకీయాలు పక్కనబెట్టి వాస్తవం అంగీకరించాలంటే మిగులు జలాల ఆధారంగా

ప్రతిపాదించబడిన ప్రాజెక్టులను గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన తొమ్మిదేళ్ళ కాలంలో నిర్మించివుంటే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు నీటి కేటాయింపుకు ఆరోజుల్లో గట్టిగా వాదించేందుకు అవకాశముండేది. దీనికితోడు రాజశేఖర్ రెడ్డి హయాంలోమిగులు జలాల ఆధారంగా నిర్మింపబడే ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు కోరబోమని ట్రిబ్యునల్ ఎదుట వేయబడిన అఫిడవిట్. ఆ సమయంలో అడ్వకేట్లు అధికారులు నిర్లక్ష్యం సీమ ప్రాజెక్టులకు తీవ్రమైన అపకారం చేసింది. 11వ షెడ్యూల్‌లో పేర్కొనబడిన ఏపీ ప్రాజెక్టులకు 120 టీయంసీలు తెలంగాణా ప్రాజెక్టులకు 77 టీఎంసీలు దీనికితోడు తాజాగా తెలంగాణా ప్రభుత్వం చేపట్టిన పాలమూరు దిండి ఎత్తిపోతల పథకానికి మరొక 120 టీఎంసీలు కావల్సివుంది. ప్రస్తుతం ట్రిబ్యునల్ ఎదుట ఎవరు ఎంత అరచి గీపెట్టి వాదనలు చేసినా లేని నీళ్ళు ట్రిబ్యునల్ ఎక్కడినుండి తెచ్చి పంపిణీ చేస్తుంది? ఈ సందర్భంలో సుప్రీంకోర్టులో పెండింగ్‌లో వున్న కేసు దృష్టిలో పెట్టుకొని 2015లో కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్ విచారణ పరిధి నాలుగు రాష్ట్రాల మధ్య జరగాలని అఫిడవిట్ దాఖలు చేసివుంటే (ప్రస్తుతం బచావత్ ట్రిబ్యునల్ అవార్డు అమలులో వుంది) ప్రధానంగా సీమలో మిగులు జలాల ఆధారంగా నిర్మింపబడే ప్రాజెక్టులకు తగు న్యాయం జరిగివుండేది. కాకుంటే ప్రస్తుతం ముఖ్యమంత్రి ఇదంతా మభ్యపరచి గోదావరి జలాలు సీమకు తీసుకువస్తానని ప్రజల్ని మభ్యపరుస్తున్నారు. అటు బీజేపీ ఇటు టీడీపీ ఇద్దరు సీమకు అపకారం చేసినవారే. పైగా ముఖ్యమంత్రి పట్టిసీమ పథకం నిర్మాణంలో వెలువరించిన ఆదేశాలు కూడా అసంబద్ధంగా వున్నాయి. ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీరు ఎచ్చట ఉపయోగిస్తారో పరిపాలనా అనుమతి ఇచ్చిన జీఓలో లేదు. పైగా గోదావరినదిపై పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ప్రారంభం కాగానే కృష్ణానది నుండి సాగర్‌కు ఎగువ ప్రాంతానికి 80 టీఎంసీల కృష్ణా నికర జలాలు కేటాయించాలని ట్రిబ్యునల్ తీర్పు మెడమీద కత్తిలా వుంది. కనీసం ఎగువ రాష్ట్రాలకు కేటాయింపులుపోగా మిగిలిన నీరునైనా సీమలోని ప్రాజెక్టులకు కేటాయిస్తానని రాష్ట్రప్రభుత్వం ట్రిబ్యునల్ ముందు అఫిడవిట్ దాఖలు చేయవలసివుంది. ఏది ఏమైనా అధికారికంగా కేటాయింపులు వుంటే తప్ప ప్రతియేడు ఏదో ఒక మేరకు సీమ ప్రాజెక్టులకు కొద్దిపాటి మిగులు లేక నికర జలాలు వస్తాయి. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరుగు పరిచి గోదావరి జలాలతో సీమను సశ్యశ్యామలం చేస్తానని చెబుతున్నారు. ఇవన్నీ నీటి మూటలే.

వ్యాస రచయిత : విశ్రాంతపాత్రికేయుడు
సెల్ : 9848394013

సామాజిక సంబంధాల లైంగికీకరణ



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

లైంగికవివక్షత పిండదశ నుండే పీడిస్తున్నది. వాడికేం మగాడని సమర్థిస్తారు. ఆడపిల్ల ఆడపిల్లేనని వెటకరిస్తారు. పాతి వ్రత్య లక్షణాలను ఆదిశక్తి పార్వతి నోటేపలికించారు. ఆడు వారిని ఆడువారే ప్రశ్ని స్తారు. మృగా ళ్ళను సహిస్తారు. పురుష కవులు లైంగిక అసమానతను వర్ణిస్తూనే ఉన్నారు. పని ఆడుపని, మగ పనిగా విభజించబడింది. మహిళలకే కట్టుబాట్లు. మ ృగాళ్ళుదేవర దున్నపోతుల్లా తిరగచ్చు. సామాజిక సంబంధాలన్నీ లైంగికీకరించబడ్డాయి.

శ్రామిక లైంగికీకరణ: కార్మికులంటే మగాళ్ళే. శ్రామిక స్త్రీలను స్మరించరు. వనితలంటే వంటిల్లే.ఇంటిపని ఇంతులదే. మగాళ్ళు చేయరు. పనిమనుషులంతా పడతులే. పురుషు లుండరు. ఇంటా బయటా, పొలాల్లో, పరిశ్రమల్లో స్త్రీలే. ఐనా వీరి ప్రస్తావనెక్కడా రాదు. వేతనాల్లో వ్యత్యాసాలుంటాయి. పెట్టుబడిదారీ దేశాల్లో ఓటు హక్కు కోసం మహిళలు దశాబ్దాలు పోరాడారు. సామ్యవాద దేశాల్లో స్వాతంత్రం రాగానే స్త్రీలకు అన్ని హక్కులు ఇచ్చారు. భారత సమాజంలో సగమైన స్త్రీలకు,భారత కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటు పూర్వ సభ్యురాలు పార్వతీ కృష్ణన్,33% రాజకీయ రిజర్వేషన్ ప్రతిపాదించారు. కాంగ్రెస్, ముస్లిం మహిళలను "ఉద్ధరించిన" భాజపా దాన్ని పట్టించుకోలేదు. లైంగికవాదం మహిళలఅసమానతలు, అన్యాయాలకు మూలం. ఆర్థిక పరిభాషలో పనిచేయగల వ్యక్తులందరూ శ్రమశక్తిలో భాగస్వాములే. సమాజ గమనాలు, స్త్రీ పురుషుల పునరుత్పత్తి ప్రక్రియలు, సామాజిక వైరుధ్య గతిశీలత, లైంగికత, వర్గం సామాజిక సంబంధాలలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.ఇవి శ్రమ విభజన,సాంఘిక జీవనం, సామాజిక స్పందనలలోప్రతిబింబిస్తాయి. సామాజిక లైంగిక తకు హద్దులుండవు. శ్రమలో పురుషాధిపత్య ధోరణి అవ్యక్త నమూనాగా కొనసాగుతోంది. ఏ వయసువారైనా మగవారి పనికే విలువ. వనితల కార్యక్రమాలకు కుటుంబమే ప్రారంభ కార్యక్షేత్రం. ఇంటిపనులే కుటుంబ బాధ్యతలను స్త్రీలపై రుద్దుతున్నాయి. పురుష పక్షపాతాన్నిమతం సమర్థిస్తుంది. మార్క్సిజం తిరస్కరిస్తుంది. పిల్లలు అడ్డమని, మాతృత్వంతో మహిళా నైపుణ్యత తగ్గుతుందని అధికారులు అభాండిస్తారు. మగాళ్ళకు ఈ సూత్రం వర్తించదు. తండ్రులైనా బాధ్యతలు ఎగ్గొట్టి ఊరేగవచ్చు. తల్లులు సంతాన సంసార బాధ్యతలు మోస్తూ వ్యక్తిగత శ్రద్ధాసక్తులు మరిచి జీవించాలి. ఏ పనిలోనూమగువలు మగాళ్ళకు తీసిపోరని ప్రపంచం నిరూపించింది. లైంగికీకరణ వనితా "స్తబ్ధతను" సమర్థిస్తుంది. మతంలో, మార్కెట్లోమహిళలను నిరాయుధులను చేసింది. వ్యసనలోలుడు, అసమర్థుడైనా మగాడే కుటుంబ పెద్ద. మహిళల దుర్లక్ష్యం ఆర్థిక, సామాజిక, మానవ సంబంధ శాస్త్రాలలో వారి సామాజిక న్యూనతకు కారణం. మహిళలు, పుట్టినింటి నుండి మెట్టినింటికి వచ్చిన వలస జీవులుగా, విలువలేని పసులుచేసే వికలాంగులుగా, ప్రక్కకు నెట్టబడి పోటీకి పనికిరాని నిరర్థకులుగా వర్ణించబడ్డారు. గుర్తింపులేని కుటుంబ బాధ్యతల వలన ఆడువారు అడుగడునా అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. పని, విరామం, జీతభత్యాలలో స్త్రీలు రెండవ తరగతి పౌరులే. మగవారి పనితనాలు అధ్యయనంలో వారి వైవాహిక్‌స్థితి, కుటుంబ పరిమాణం, సంతాన సంఖ్య, భార్యల ప్రస్తావనలు ఉండవు. మహిళలు కుటుంబ బందీలు, ఉత్పత్తి క్రియా రహితులు. కుటుంబ బాధ్యతలులేని మగాళ్ళు పదోన్నతులకు అర్హులు.

ఉత్పత్తి, పునరుత్పత్తి సంబంధాలు: ఉత్పత్తి, పునరుత్పత్తి శ్రమలలో మహిళల ఉత్పాదక శక్తిని పురుషాధిక్య నమూనాగా అభివర్ణించారు. ఫలితంగా ఎంతటి ఉచ్ఛస్థితిలో ఉన్నా మహిళలు అన్ని రంగాలలోనూ ఆత్మహత్యలకు నెట్టబడు తున్నారు. హత్యలకు లోనవుతున్నారు. మతం, మార్కెట్లు దీనికి సహకరిస్తున్నాయి. సంప్రదాయ అర్థంలో ఉత్పత్తి, పునరుత్పత్తి కార్యక్రమాలన్నీ సామాజిక ఉత్పత్తిలో భాగమే. పునరుత్పత్తికి దోహదపడే వ్యవస్థలను కుటుంబం నుండి వేరు చేయలేము. ఇంటి పనుల మీద వృత్తి కార్యక్రమాల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. కుటుంబాన్ని స్త్రీపురుష సంబంధాలుగా కాక సామాజిక సంబంధాలుగా అధ్యయనం చేయాలి. ఆమేరకు శ్రమ విభజన జరగాలి.సామాజిక చైతన్యం పురుషాధిక్యతలో బంధించబడింది. స్త్రీ పురుషుల సామాజిక మార్గాలను గుర్తించడానికి చేసే సర్వేలు, మౌఖిక సమావేశాలు, ఆత్మకథలు, వంశవృక్షాల పద్దతులన్నీ పురుషాధిక్య నమూనాలే. ఉత్పత్తి, పునరుత్పత్తుల ఏకకాల అధ్యయనం నూతనవిధానాల రూపకల్పనకు దారితీస్తుంది. లైంగికీకరణతో పని విభజన సామాజిక విచ్ఛిన్నానికి దారితీస్తుంది. ఉత్పత్తి, పునరుత్పత్తి సంబంధాల చిక్కు ముడిని విప్పడానికి పలు ప్రయత్నాలు జరిగాయి. నిరంతర అధ్యయనంతో"సహజ క్రమం" సాకుతో ఆమోదించిన నిరసనరహిత అసమ్మతిని ఓడించాలి. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని బద్దలుకొట్టాలి. పునరుత్పత్తి కేంద్రంగా కొత్తపద్దతి అభివృద్ధిచెందాలి. రుద్దబడిన పద్దతుల్లో వ్యక్తీకరించబడే మహిళా విజ్ఞానశాస్త్రం అధీన శాస్త్రమే. అసలు అర్థంలో విజ్ఞానశాస్త్రం కాదు.

మహిళల చాకిరీ: జీతభత్యాలు లేని ఇంటిచాకిరీ కొనసాగినంత కాలం సామాజిక సేవలకు ప్రోత్సాహకాలు లభించవు. మహిళల చాకిరీ తగ్గదు. బలమైన మహిళా ఉద్యమాలు కొనసాగినప్పటికీ 70 వ దశకంలో రాయితీలతో నడిచే పిల్లల సంరక్షణా కేంద్రాలు తగ్గిపోయాయి. సామాజిక, తాత్విక, మేధో ప్రక్రియలలో మహిళా జీవితాలు సమగ్ర భాగాలు. ఇంటి చాకిరీని మగాళ్ళు ప్రేమ కార్యమంటారు. మహిళలు కూలీలేని కొలువు అంటారు. ప్రతి గర్భస్రావం పని ఒత్తిడి, పోషకాహార లోపాల ఫలితమే. శ్రామికుల ఉద్యమం సామాజిక చట్రంలో జీతాల మెరుగుదలకు. మహిళల ఉద్యమం సామాజిక పాత్రనే ఎదిరించడానికి. కార్మికులు జీతాల పెరుగుదలను పెట్టుబడిదారీ చట్రంలోనే అడుగుతారు. మహిళల పోరాటం సామాజిక చట్రంలో బానిసత్వ నిర్మూల నకు. మహిళల పనిని పనిగా, మహిళలను మనుషులుగా గుర్తించాలి. సామాజిక, ఆర్థిక విశ్లేషణలలో ఇంటి చాకిరీని ఎత్తిచూపి స్త్రీవాదులు ఒక నిర్ణయాత్మక అంశాన్ని ప్రస్తావించారు. ఇంటిపనులు, స్త్రీ పురుష సంబంధాల విశ్లేషణ, సామాజిక సంబంధాలలోమహిళా శ్రమ పట్ల అర్థవంతమైన విధానానికి దారితీశారు. స్త్రీపురుష సంబంధాలను కుటుంబ వ్యవహారాలకు పరిమితం చేయకుండా ఇంటి, వృత్తి పనుల ఆధారిత కార్యక్రమాలకు విస్తరించారు. విజ్ఞానశాస్త్రాల విమర్శనాత్మక విశ్లేషణ వివిధ విభాగాల అసమగ్రతలను, చీకటి కోణాలను వివరిస్తుంది.

స్త్రీ వాదుల కర్తవ్యం: ఆధిపత్యదోపిడీ విధానాలతో విలువ, జీతభత్యాల అవసరం లేనిదిగా పరిగణించబడి, పునరుత్పత్తిసహజంగా స్త్రీలకు ఆపాదించబడింది. విశాల దృక్పథంతో విలువలను నిర్ధారణ చేసి పునరాలోచింపజేసే ప్రక్రియఇది. వస్తూత్పత్తి శ్రమను నిర్దేశిస్తుంది. అప్పుడు ఇంగితజ్ఞానంతో పని వేళలు, విరామ సమయం, శాంతి, పర్యావరణం, నిరుద్యోగం, కరువు, పేదరికం మొదలగు అంశాల గురించి చర్చించుకుంటాము. పని కోసం పని అని భావించబడుతున్న ప్రపంచంలో మనం వ్యక్తిగత, సామాజిక పరిపూర్ణతలకుతపిస్తున్నాము. స్త్రీ పురుషులిద్దరికీ జీతాలు తగ్గుతున్నాయి. పని దొరకడం లేదు. మహిళా పరిష్కారాలు కొన్ని సార్లు ఎగతాళికి గురవుతున్నాయి. అయినా ఆలోచనా విధానాన్ని మార్చుకోడంలేదు.మహిళలను అణగదొక్కి అధీనంలో ఉంచుకునే సంప్రదాయ పద్దతులను ఎదిరించాలి. సామూహిక చర్చలను ప్రేరేపించే నూతన ఆలోచనలు వికసించాలి. మహిళలు, స్త్రీవాదులు, పరిశోధకులు ప్రభావ వంతమైన విధానాన్ని, నూతన సాధనాలను ఆవిష్కరించు కోవాలి. ప్రపంచ మహిళా కార్యకర్తలతో సంబంధాలు నెలకొల్పుకోవాలి. విశ్వ వనితల సారూప్యతలను, సామాజిక సంబంధాల ఏకత్వాన్ని గుర్తించి కలిసి పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకుండా భయం నీడలో నివసించే ప్రాణి విశ్వంలో మహిళ తప్ప మరొకటి లేదు. సామ్యవాద దేశాలలో లైంగిక అసమానతలు లేవు. మహిళా సమానత్వానికి సమసమాజం బీజాలు నాటింది. ఆధిపత్యరహిత కుటుంబ నిర్మాణం, ఉత్పాదక వ్యవస్థల ఉమ్మడి విధానం సామాజిక సంబంధాల లైంగికీ కరణను రూపుమాపుతుంది.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
జాతీయ కార్యదర్శి, సెల్ : 9490204545

వి-మెయిల్

వాటేన్ ఐడియా కేసీఆర్ జీ!

తెరాస అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక తెలివైన రాజకీయ వ్యూహం రచించారు. కాంగ్రెస్, బీజేపీ రహిత మూడో సమాఖ్య జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలతో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రధాని మోడీని, కాంగ్రెస్ పార్టీని ఒకే వ్యాఖ్యలో తెగనాడడం ద్వారా తన కొత్త వ్యూహానికి నాంది పలికారు. వాస్తవానికి గతంలో తెలంగాణ ఏర్పాటు కల సాకారం చేసినందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ని దేవత గా పొగిడారు. అలాగే రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో కోరక పోయినా మద్దతు ఇవ్వడమే కాకుండా మోడీని వీలయినంత మేరకు పొగుడుతూనే ఉన్నారు. జాతీయ పార్టీలతో ఇంతవరకూ సఖ్యతగానే ఉన్నారు తప్పితే విరుచుకుపడింది లేదింత వరకూ. అయితే పరిస్థితులు మారుతున్నాయి. మోడీ 'ఒకేసారి ఎన్నికల ఆలోచన' కి మొగ్గుచూపు తున్నారు. అది వాస్తవ రూపం దాల్చితే నష్టపోయేది ప్రాంతీయ పార్టీలే. జాతీయ స్థాయి భావోద్వేగాలు,సమస్యలు ముందుకు వచ్చి, స్థానిక సమస్యల్ని మింగేస్తాయి. పైగా మోడీ ఇమేజ్ పెద్దగా కనబడి బీజేపీకి లాభం తెస్తుంది. తెలంగాణలో స్థానిక భావోద్వేగాలేమీ లేవు.పైగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు అంశం అదనం. వెరసి తెరాస కు నష్టం. వీటిని అధిగమించాలంటే కేసీఆర్ గీత పెంచి మోడీ గీతకు సమం చెయ్యాలి. జాతీయ స్థాయిలో ఎలా ఉన్నా,రాష్ట్రంలో మిగతా ప్రతికూలతలను పక్కకు నెట్టొచ్చు. సో. వాటేన్ ఐడియా కేసీఆర్ జీ !

- డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.





చీమలను తరిమేయడానికి సులువైన మార్గాలు

చూడటానికి చిన్నగా కనిపించినా మన దైనందిన జీవితంలో చిన్న చిన్న పనులు చేసుకోవటానికి కూడా ఇబ్బంది కలిగించే జీవులు చీమలు. ఇవి మన వంటగదిలో తిరుగుతూ తెగ చికాకు పెడతాయి. చీమలు ఇంటి పునాదులను దెబ్బతీసిన సందర్భాలను కూడా మనం చూడొచ్చు. వందల కొద్ది చీమలు సైన్యంగా మనకు ఇష్టమైన ఆహార పదార్థాలపై దండెత్తి రావడం మనకు తెలిసినదే! చీమలను చంపటమనేది గొప్ప ఆలోచన కాదు కాని అవి కావలసినప్పుడల్లా మన ఇంటిలో షికార్లు కొట్టకుండా మన ఇంట్లో రోజు వాడుకునే చవకైన వస్తువులతో నివారించవచ్చు. అవి ఏమిటో తెలుసుకుందాం.

బొరాక్స్ : బొరాక్స్, పంచదార మిశ్రమాన్ని చీమలు ఎక్కువగా తిరుగాడే చోట్లలో పెట్టండి. బొరాక్స్ చీమల జీర్ణ వ్యవస్థ, బాహ్య కవచాన్ని దెబ్బతీస్తుంది. బొరాక్స్ విషపూరితమైనది కవటం వలన చిన్న పిల్లలు ఉన్న ఇంట్లో ఈ చిట్కాని పాటించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

నిమ్మ జాతి పండ్ల తొక్కలు : చీమలు ఎక్కువగా ఉన్న చొట్లలో నిమ్మ, నారింజ తొక్కలను ఉంచండి. ఈ పండ్ల తొక్కలలో ఉండే రసాయనాలు చీమలకు ఆహారంగా ఉపయోగపడే శిలీంధ్రాలను నాశనం చేస్తాయి. కనుక చీమలు వెంటనే ఆ ప్రదేశాన్ని వీడి వెళ్ళిపోతాయి.

'రాకేష్.. అడుగుతుంటే వినపడటం లేదా ! నిన్న సాయంత్రం ఎక్కడికి వెళ్లావురా ! నువ్వున్నావు కదా అని నేను ఆఫీసు నుంచి ఇంటికి త్వరగా వచ్చేశాను నిన్ను తీసుకుని బయటకు వెళ్దామని. నువ్వేమో నీ ఫ్రెండ్ లలిత్‌తో బయటకు వెళ్లిపోయావు. ఎంతసేపటికీ రావు' అని తండ్రి రాకేష్‌ని అడుగుతుంటే, సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా చూస్తూ వెళ్లిపోయాడు. దీనితో తండ్రికి కోపం ముంచుకువచ్చింది. వీడికింత పొగరేంటి ? పిలుస్తుంటే వినిపించుకోడు, అడిగినదానికి సమాధానం రాదు. వీడితో ఎలా మాట్లాడాలో ఎంటో ! అంటూ తండ్రి వాపోయాడు. ఇది రాకేష్ తండ్రి ఒక్కడి బాధే కాదు. ఇలాంటి తల్లిదండ్రులు ఎంతమంది ఉన్నారో !



పిల్లలతో ఆత్మీయ అనుబంధం అల్లుకోవాలి!

'బాల్యం మనిషికి మరిచిపోలేని తీపి జ్ఞాపకం. బాల్యాన్ని పిల్లలకు జీవితాంతం గుర్తుండేలా తల్లిదండ్రులు వారితో గడపాలి' అని వైద్యులు, విద్యావేత్తలు చెబుతున్నారు. పిల్లలతో పెద్దలు కలసి గడిపితే వారికి భవిష్యత్తులో మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఎంతమంది తల్లిదండ్రులు పిల్లలతో మనస్ఫూర్తిగా గడుపుతున్నారు. ఒక్కసారి ఆలోచించండి. ఎవరికి వారు ఆత్మావలోకనం చేసుకోవాలి. తల్లి తండ్రి పిల్లల వద్ద కూర్చున్నా, ఒకరేమో స్మార్ట్‌ఫోన్‌తో సమరం చేస్తుంటే మరొకరేమో ఇడియట్ బాక్స్ (టీవీ)ను చూస్తూ వాటిలోని దృశ్యాలతో మైమరచిపోతుంటారు. మేము పిల్లలతో గడుపుతున్నా వారేమో మాతోకన్నా స్నేహితులతో, ఫోన్‌లతోనే గడపడానికి ఇష్టపడుతున్నారు.. అని వాదించే తల్లిదండ్రులు ఉన్నారు. ఇది ఎంతమాత్రం వాస్తవం కాదు.

పిల్లల్ని ఆణిముత్యాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. బాల్యంలో పిల్లలకు తల్లిదండ్రులు ఏది చెబితే అది వింటారు. ఏం చేయించినా అది ఒంటబట్టించుకుంటారు. ఎవరికైనా బాల్యం తీపి గురుతుగా ఉండాలి కానీ, చేదు జ్ఞాపకంగా మిగలరాదు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి. వేలకువేలు ఫీజులు చెల్లిస్తున్నాము, పాఠశాలలో గురువులే పిల్లలని తీర్చిదిద్దుతారని భావించడం సరికాదు. జన్మనిచ్చిన తల్లిదండ్రులుగా మన పిల్లల గురించి మనకు లేని అవగాహన, వారికుంటుందని అనుకోకూడదు. వారు కేవలం కొద్ది గంటలు మాత్రమే పిల్లలతో గడుపుతారు.

ప్రస్తుతం ఉన్న పరిస్థితి బిజీ జీవితాల గందరగోళమే. కాదనలేం. కానీ, ఎంత బిజీగా ఉన్నా పిల్లలతో రోజులో ఏదోఒక సమయంలో కలిసి ఆహారం తీసుకోవాలి. పిల్లలతో ఆటలు ఆడాలి. మీ బాల్యాన్ని మీరు గుర్తుచేసుకోవాలి. వారితో పంచుకోవాలి. వారితో గడిపేటప్పుడు స్మార్ట్‌ఫోన్‌లను వాడకూడదు. ఇది కచ్చితంగా పాటించితీరాలి. ఏదైనా కథల పుస్తకాలను చదువుతూ, వారితో చదివించాలి. అందులో ఉన్న నీతిని వివరించాలి. సాధారణంగా పెద్దల మధ్య ఏవో పొరపొచ్చాలు ఉంటాయి. వాటిగురించి పిల్లల ముందు మాట్లాడకూడదు. మనకు వ్యతిరేకంగా ఉన్నవారిపై పిల్లలకు చెడుగా చెప్పకూడదు. వారి చిన్నప్పుడు చెప్పిన మాటల ప్రభావం కొంతమంది పిల్లలు పెద్దయ్యాక కూడా వారికి వ్యతిరేక భావనలు పోవు. మన పిల్లలను ఇతర పిల్లలతో పోల్చకూడదు. కొంతమంది పిల్లలు ఈ పోల్చడాన్ని తట్టుకోలేరు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏకైక సంతానంగా పిల్లలు



ఉంటున్నారు. వారితో కొన్ని సమస్యలను తల్లిదండ్రులు ఎదుర్కొంటున్నారు. అతి గారాబం దీనికి అసలు కారణం. ఏదైనా వారు ఒక వస్తువు కావాలని అడిగితే వెంటనే కొనిచ్చే తల్లిదండ్రులు ఉన్నారు. ఇది ఎంతమాత్రం సమంజసం కాదు. ఆ వస్తువు ఉపయోగం పిల్లలకు ఎంతుందో తెలుసుకోవాలి. దాని అవసరాన్ని బట్టి ఆ వస్తువు ఇప్పుడు కొనలేము అని వివరంగా తెలపాలి. కొంతమంది పిల్లలు మరీ మంకుపట్టు పడతారు. ఆ పిల్లల విషయంలో సంయమనంతో ఉండి ఓర్పుగా నచ్చజెప్పాలి.



కొంతమంది తల్లిదండ్రులు పిల్లలపై కోపతాపాలు చూపెడతారు. పిల్లలు చెప్పేది వినరు. వారి అభిప్రాయాలను చులకనగా చూస్తారు. తల్లిదండ్రులు పిల్లలు చెప్పేది జాగ్రత్తగా వినాలి. అప్పుడే పిల్లలకు తల్లిదండ్రులు మా అభిప్రాయాలకు గౌరవం ఇస్తున్నారనే భావం కలుగుతుంది. అలాగే పిల్లల విషయంలో ఆడ, మగ భేదం చూపడం, కొట్టడం, తిట్టడం వంటి పనులు చేయకూడదు. ఇలా చేస్తే వారిలో ఏకాగ్రత దెబ్బతింటుంది. చెడువైపునకు మళ్లే అవకాశం ఉంటుంది. వ్యతిరేక భావనలు పెంచుకుంటారు. ఇలా జరగకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులది.

పెద్దలు పిల్లలతో గడపడమంటే, వారితో ఇంట్లోనే ఉండిపోవడం కాదు. వారిని ఆత్మీయంగా దగ్గరకు తీసుకోవాలి. వారిని స్కూళ్లు, కాలేజీల వద్ద దించి రావాలి. కొన్ని సంస్థలకు కొంతమంది వ్యక్తుల వద్దకు తీసుకెళ్లి వారిలో ఉన్న మంచి లక్షణాలను తెలపాలి. వారు అంతటివారు ఎలా కాగలిగారో తెలియజేయాలి.

సెలవు దినాల్లో ట్యూషన్లు, ప్రైవేటు క్లాసులు అంటూ తరమకూడదు. వారికి మంచి విషయాలు తెలుపుతూ వారిలో ఉన్న ఆలోచనా నైపుణ్యాలను పెంచాలి.

మన దేశంకన్నా ఇతర దేశాల్లో తల్లిదండ్రులు పిల్లలపైన అధిక శ్రద్ధ చూపుతున్నారని సర్వేలో తేలింది. అమెరికా, జపాన్ వంటి దేశాలలో పిల్లల కంటే తల్లిదండ్రులకూ ఏదీ ఎక్కువ కాదు. ఇవి అభివృద్ధి చెందిన దేశాలుగా ఉండ టం వెనుక రహస్యం ఇదేనేమో! రోజులో ఉదయం, సాయంత్రం వారి నాణ్యమైన సమయాన్ని పిల్లలతో గడుపుతారు. వారితో ఆటలు ఆడి, వారు ఎందులో నైపుణ్యం ప్రదర్శిస్తున్నారో తెలుసుకొని వారిని ఆ దిశగా ప్రోత్సహిస్తారు. పిల్లల భావాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ మంచివైపునకు మళ్లిస్తుంటారు.

ప్రతివ్యక్తికీ బాల్యం ఎంతో ముఖ్యమైనది. చిన్నప్పుడే బలమైన పునాది తల్లిదండ్రులు వేయాలి. పిల్లలకు ఇవ్వాల్సింది ఆస్తులు, అంతస్తులు కాదు. మంచి ప్రవర్తన, నైతిక విలువలు ఇవ్వాలి. డబ్బుంటే చాలు మిగతావి అవే వస్తాయి అనుకునేవారు ఉన్నారు. డబ్బు అవసరమే కానీ అదే జీవితం కాకూడదు. డబ్బుతో ఎవరినైనా శాసించవచ్చేమోకానీ, జీవితాలను శాసించలేము. ఈ విషయాలను పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత పెద్దలది. ఇలా చేసే పిల్లలు మంచి ఆలోచనలతో పయనిస్తూ, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తయారవుతారు.

– టి. యోగిత

మేకప్‌ను తొలగించే చిట్కాలు



మీరు ప్రతి రోజూ మేకప్ వేసుకుంటారా! మార్కెట్‌లో దొరికే ప్రతి మేకప్ కిట్‌ని మీ ముఖంపై రాస్తున్నారా? ఆ మేకప్‌ని తొలగించడానికి ఇబ్బంది పడుతున్నారా? చర్మం చాలా సున్నితంగా వున్న వారు తరచూ మేకప్ వేసుకోవడం వల్ల తొందరగా చర్మంపైన రంధ్రాలు ముసుకుపోతాయి. దీంతో చర్మం ముడతలు పడుతుంది. వృద్ధాప్య లక్షణాలు త్వరగా వస్తాయి. ఆడవారు మేకప్‌ను తొలగించడానికి మార్కెట్‌లో అనేక క్రీమ్‌లు వున్నాయి. వాటిలో వేటిని ఎంచుకోవాలనే సమస్య ప్రతి ఒక్కరికి వస్తుంది. అందుకే మీ మేకప్ రిమూవల్‌ను మీరే తయారు చేసుకోండి. ఇంట్లో తయారు చేసిన ప్రతీది కూడా మనకు మేలే చేస్తుంది. ఎందుకంటే వీటిలో ఎటువంటి కెమికల్స్ వుండవు. అందుకనే ఎటువంటి చర్మం వారైనా వీటిని ఉపయోగించవచ్చు. ఇవి ఉపయోగించి మీ ఖర్చును తగ్గించొచ్చు. మరి అవేంటో చూద్దామా!

రోజ్ వాటర్

మేకప్‌ను తొలగించడానికి రోజ్ వాటర్ ఉత్తమమైనదని పరిశోధనలో వెల్లడయింది. రోజ్ వాటర్‌ని మాత్రమే ఉపయోగించుకొని మేకప్‌ని తొలగించుకోవచ్చు. లేదంటే దీనికి కొన్ని ఇతర పదార్థాలు కలిపి మీరు ఇంటి వద్ద ఆ జల్ క్రీము తయారు చేసుకోవచ్చు. దీనికి కోసం 1కప్పు రోజ్ వాటర్, 1/4 కప్పు కలబంద గుజ్జు, 2టేబుల్ స్పూన్‌ల గ్లిజరిన్, 1 టీ స్పూన్ ఆలివ్ ఆయిల్ వున్న సబ్బును తీసుకోండి. వీటన్నింటిని కలిపి ఒక జార్‌లో గాలి చొరబడకుండా వుంచండి. కొంచెం ఈ జల్ క్రీము మొదటగా మీ చేతులకు రాయండి ఆ తర్వాత మీ ముఖం పై 3నుండి 4 నిముషాల పాటు మసాజ్ చేయండి. తర్వాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి.

తేనె

తేనెలోని యాంటి మైక్రోబయాల్ లక్షణాలు ముఖంపై మొటిమలతో పోరాడతాయి. అంతేకాక పొడిబారిన చర్మానికి తేమని అందిస్తాయి. తేనె చర్మం పైన దుమ్ము, ధూళి చేరనివ్వదు. 1టేబుల్ స్పూన్ తేనెని తీసుకొని మీ ముఖానికి పట్టించండి. 5నుంచి 10 నిముషాల తర్వాత వేడి నీటిలో ముంచిన బట్టతో ముఖాన్ని తుడవండి. ఈ పద్ధతి అన్ని రకాల చర్మాల వారు ఉపయోగించవచ్చు.

బ్రౌన్ రైస్‌తో ప్రయోజనాలు



మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటున్నారా? బరువు తగ్గాలనుకుంటున్నారా? అయితే వైట్ రైస్ నుండి బ్రౌన్ రైస్‌కు మారాల్సిందేనంటున్నారు డాక్టర్లు. ఎందుకంటే వైట్ రైస్ కంటే బ్రౌన్ రైస్‌లో ఎక్కువ కార్బొహైడ్రేట్లు ఉన్నాయి. దీని వల్ల బరువు తగ్గుతారు. బ్రౌన్ రైస్ అంటే వడ్లులోని పై పొట్టును మాత్రమే తొలగిస్తారు. వైట్ రైస్ అంటే పొట్టుతో పాటు దానిలోని పోషక విలువల్ని కూడా తొలగిస్తారు. అందుకనే బ్రౌన్ రైస్ ఆరోగ్య పరిరక్షణతో పాటు బరువు తగ్గుదలకు సహకరిస్తుంది. ఈ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని డాక్టర్లు బ్రౌన్ రైస్‌ను తీసుకోమంటున్నారు. బ్రౌన్ రైస్ మధుమేహాన్ని నియంత్రిస్తుంది. శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల శరీరంలో అవాంఛిత ప్రభావాలు పెరుగుతాయి. బ్రౌన్ రైస్‌లో ఫైబర్, ఫైటిక్ యాసిడ్ న్యూట్రియంట్స్ పుష్కలంగా ఉంటాయి.ఇవి రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రిస్తుంది. అందువల్ల చక్కెర వ్యాధి వల్ల కలిగే దుష్ప్ర భావాలు తగ్గుతాయి. బ్రౌన్ రైస్ గుండె వ్యాధులు రాకుండా నివారిస్తుంది. ఈ రోజుల్లో గుండె జబ్బులతో ప్రాణాల కోల్పొయే వారి సంఖ్య అధికమవుతుంది. బ్రౌన్ రైస్ తీసుకోవడం వల్ల దీనిలోని ఫైబర్, యాంటిఆక్సిడెంట్స్ గుండె జబ్బులు రాకుండా నియంత్రిస్తుంది. అప్పుడే ప్రసవించిన తల్లులో పాల ఉత్పత్తిని పెంచడానికి ఉపయోగపడుతుంది. బ్రౌన్ రైస్ జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. రక్తంలో హై కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గిస్తుంది. డిప్రెషన్‌ను తగ్గిస్తుంది. బ్రౌన్ రైస్ క్యాన్సర్ వ్యాధిని అరికడుతుంది.

విహార యాత్రల కోసం

విదేశాలకు వెళుతున్నారా...



విహార యాత్రలకు విదేశాలకు వెళ్లడం ఇప్పుడు సాధారణ విషయమే.. ఇలాంటప్పుడు అక్కడ ఖర్చు పెట్టేందుకు కావాల్సిన డబ్బు కార్డు రూపంలోనే తీసుకెళ్తాం. అయితే, చిల్లర ఖర్చుల కోసం చేతిలో కొంత ఆ దేశ కరెన్సీ ఉండాల్సిందే కదా.. మరి ఇలాంటప్పుడు ఇబ్బంది రాకుండా ఉండాలంటే..

మీరు ఏ దేశానికి వెళ్తున్నారో అక్కడ వినియోగించే కరెన్సీ పేరు, మన దేశ కరెన్సీతో దాని మారకపు విలువ ఎంతో తెలుసుకోండి. ఆన్‌లైన్‌లో ఈ విషయాలు సులువుగానే తెలుస్తాయి. నగదు మార్పిడి కేంద్రాల్లో సంప్రదించినా సరిపోతుంది. ఒక వ్యక్తి ఎంత విదేశీ ద్రవ్యాన్ని తీసుకోవచ్చు అనే విషయంలో ఆర్‌బీఐ నిబంధనలు ఉన్నాయి. దేశాలను బట్టి ఇది మారుతూ ఉంటుంది.

మన నగదును విదేశీ ద్రవ్యంగా మార్చుకోవాలన్నా.. అక్కడి డబ్బును మన కరెన్సీలోకి మార్చుకోవాలన్నా.. అధీకృత నగదు మార్పిడి కేంద్రాలు, బ్యాంకులను సంప్రదించండి. అక్కడ మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి (కేవైసీ) నిబంధనలు పూర్తి చేయాల్సి ఉంటుంది. నగదు మార్పిడికి కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. దీని గురించి ముందుగానే తెలుసుకోండి. తక్కువ రుసుము వసూలు చేసే కేంద్రానికి వెళ్లండి. అయితే, అనధికార కేంద్రాల్లో నగదు మార్పిడి చేసుకునేందుకు ప్రయత్నించవద్దు. దీనివల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

విదేశీ ప్రయాణాల్లో వీలైనంత వరకూ కార్డులను వాడటమే ఉత్తమం. ప్రస్తుతం చాలా బ్యాంకులు ట్రావెల్ కార్డులను అందిస్తున్నాయి. వీటిలో మన అవసరాన్ని బట్టి నగదును నింపించుకునేందుకు వీలుంది. ట్రావెల్ కార్డు అందించే ప్రయోజనాలు, దాన్ని నిర్వహణ, రుసుముల గురించి పూర్తి వివరాలు తెలుసుకోండి. ఈ కార్డును ఉపయోగించి, అక్కడి ఏటీఎంలలో నగదు డ్రా చేస్తే ఏమైనా రుసుము లుంటాయా చూసుకోండి.. చివరగా.. విదేశీ ప్రయాణానికి సిద్ధం అయినప్పుడు తప్పనిసరిగా.. ప్రయాణ బీమా తీసుకోవాలి.



బ్రీతింగ్ వ్యాయామంతో ఉపయోగాలు

శ్వాస అనేది మనకు మనమే తెలియకుండా చేసే ప్రక్రియ. శ్వాస అనే ప్రక్రియ జరుగుతుందనే విషయాన్ని సమస్య వచ్చేదాకా పట్టించుకోం. తెలియకుండా తీసుకుంటున్న శ్వాస వలన శరీరానికి కావలసిన ప్రాణవాయువుని అందించలేము. కాని శ్వాస, మనకే తెలీకుండా శరీర జీవక్రియలను నిరంతరం జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. కాని శ్వాస మీద రోజులో కొంత సమయం వెచ్చించి అభ్యాసం చేయడం మూలంగా శరీర జీవక్రియలకు కావలసినంత ప్రాణవాయువుని అందించగలుగుతాము. శ్వాసపై ధ్యాస ఉంచి ఊపిరి తీసుకోవడం మూలంగా శరీరానికి కావలసిన ప్రాణవాయువుని ఎక్కువ మోతాదులో తీసుకుని జీవక్రియలు ఉత్తేజితమవుతాయి. లోతుగా శ్వాసని తీసుకోవడంవలన ఆక్సిజన్ మరింత సరఫరా అవుతుంది. ఇలా శ్వాసను లోతుగా తీసుకుని వదలడం (డీప్ బ్రీత్) వలన మానసిక ప్రశాంతతతో పాటు దీర్ఘాయువు కలిగేలా చేస్తుంది. డీప్ బ్రీత్ వలన కలిగే మరికొన్ని ఉపయోగాలు ఇలా ఉన్నాయి.

– అధికమోతాదులో తీసుకునే ఆక్సిజన్, శరీరంలోని విషపదార్థాలను మూత్రవిసర్జన, చమటల రూపాన బయటకు వెళ్లగొడుతుంది. అదేవిధంగా నిశ్వాసంలో వదలివేసే కార్బన్ డై ఆక్సైడ్ ద్వారా కూడా విషపదార్థాలు తొలగిపోతాయి. అందువల్ల ఎంత ప్రాణవాయువుని ఇవ్వగలుగుతామో, అన్ని విషకారకాలను తొలగించగలుగుతాము. ఆవిధంగా మనం ఎంత ప్రాణవాయువుని పొందుతామో అంతకు మించి కార్బన్ డై ఆక్సైడ్‌ని పంపగలుగుతాము. – డీప్ బ్రీత్ ఒత్తిడిని తగ్గిస్తుంది. ప్రశాంతతని పెంచడం ద్వారా వ్యక్తి ఆలోచన స్థాయిలను పెంచడంలో సహకరిస్తుంది. ఒత్తిడిలో ఉన్నప్పుడు తీసుకునే శ్వాస శరీరంలోని కండరాలకు సైతం సహకరించక చాల ఇబ్బందికి గురిచేస్తుంది, ఇలాంటి సమయాల్లో తీసుకునే డీప్ బ్రీథ్ శరీరాన్ని సడలించి కండరాలకు కొత్తశక్తిని ఇవ్వడంలో తోడ్పడుతాయి.



– డీప్ బ్రీత్, ప్రోస్టేట్ గ్రంధికి రక్తసరఫరాను పెంచడం మూలంగా, స్కలన సమస్యలు లేకుండా చూస్తుంది. శరీరంలో అత్యధిక స్థాయిలో రక్తం సరఫరా జరుగుతుంది. దీని ద్వారా జీవక్రియలు పెరుగుతాయి.

– డీప్ బ్రీత్ శక్తిని పెంచడంలో సహాయం చేస్తుంది, తద్వారా శారీరిక శ్రమ చేయనప్పుడు లేదా పరుగెత్తునప్పుడు ఊపిరితిత్తులపై భారం పడకుండా చూసి విషకారకాలను చెమట రూపంలో బయటకు పారద్రోలడంలో సహాయం చేస్తుంది. మీకు డీప్ బ్రీత్ అలవాటు ఉన్నట్లయితే, ఊపిరితిత్తులు వాటికవే ఆక్సిజన్ ఎక్కువ సరఫరా అయ్యేలా శిక్షణనిచ్చుకుంటాయి. తద్వారా మీరు శారీరక శ్రమ చేయునప్పుడు, అలసిపోకుండా సహాయం చేస్తుంది.



– కొందరు యోగా గురువులు చెప్పిన మాటలను అనుసరించి, 6 నెలలు డీప్ బ్రీత్‌కు అలవాటుపడిన శరీరం ధూమపానాన్ని సైతం దూరం చెయ్యగలదు. – ప్రతిరోజూ ఖచ్చితంగా డీప్ బ్రీత్ చెయ్యడం వలన ఊపిరితిత్తులకు ఒక వ్యాయామంలా ఉంటుంది. తద్వారా గుండె పనితీరు మెరుగవుతుంది. జలుబు, ఉబ్బసం వంటి రోగాలు నెమ్మదిగా తగ్గుముఖం పడుతాయి.

– డీప్ బ్రీత్ రక్తం నాణ్యతను పెంచుతుంది. రక్తకణాలు ఆక్సిజన్‌ను తీసుకుని శరీరానికి సరఫరా చేస్తాయి, డీప్ బ్రీత్ తీసుకున్నప్పుడు ఎక్కువ మోతాదులో ప్రాణవాయువుని శరీరానికి అందించవచ్చు.

అతడు-ఆమె

93

జరిగిన కథ

నాన్న ఎంత చెప్పారో సరిగ్గా అందుకు వ్యతిరేకం అయింది. బ్యూక్ కారుడ్రైవరు వడివేలు 'పెళ్ళానికి పురుడొచ్చి ప్రాణంమీదికి కొచ్చింది. ఆస్పత్రికి తీసుకువెళ్ళాను. నాలుగు రోజులు సెలవు కావా'లంటూ ఆస్పత్రి నుంచి అర్ధరాత్రి టెలిఫోను చేశాడు. ఓఢ్ర మంగలాడు వాళ్ళ వూళ్ళో అమ్మవారు పండుగలని, వద్దురా అంటూంటే మొండికేసి వెళ్ళిపోయాడు. ఇంకేం చేసేది? అమృతరావుని అడుగుతేనే కాని వీలులేకపోయింది. 'అజానుబాహు అరవింద దళాయతాక్షం' అన్నట్టు అమృతరావు అందమైన మనిషి. తెల్లటి తెలుపు. ఆ తెలుపుకి మించిన కాంతి కళ్ళల్లో. ఆ కాంతిని మించిన మెరుపు. ఆ ధగధగమని ప్రకాశిస్తూ తమ్మెట్లు! అతని పిలిచి అడిగేను ఇంగ్లీషులో..

(నిన్నటి సంచిక తరువాయి)

"మిస్టర్ అమృతరావు! మీవల్ల రేపు నాకొక ఉపకారం జరగాల్సి వుంది. రేపు ఉదయం కారుమీద రాయవేలూరు వెళుతున్నాను. అక్కడ తోటలో అవకాయ కోసం మామిడికాయలు దింపించాలి. తరువాత యింటి కొచ్చాక, మడత కత్తిపీటతో కాయలు కోసిపెట్టాలి. ఈ పనులు మీవల్ల కావాలి" అన్నాను.

"డ్రైవరు పనులన్నింటినీ విధిగా చేస్తాను మిస్ సుభగారూ! మీరు వురమాయిస్తూన్న మిగతా పనులన్నిటికీ - నా నవుకరీకి యేమీ సంబంధం లేదు. అటువంటి చాకిరీని నేను చెయ్యను" అన్నాడు.

"యజమానికీ నౌకరుకూ అంతేనా సంబంధం?" అన్నాను నాకు కోపం వచ్చి.

"తోడేలుకీ, మేకకీ ఉన్న సంబంధం. అంతే!" అన్నాడు కొంచెం బిగ్గరగా.

"మా నాన్న, అమ్మ మీ యజమానులు. నేనుకాదు సుమండీ!" అన్నాను. అతని తమ్మెట్ల కాంతికి చూపులని కిందకి వాల్చి "స్నేహితుల్లా అడగకూడదా?" అన్నాను మెల్లిగా.

"మీరు యజమానులు కాకపోయినా ఆ వర్గంలో చేరిన వారే. గుర్రానికీ, గడ్డికీ స్నేహమేమిటి?" అన్నాడు. అతని చేత యెలాగేనా పని చేయించి తీరాలని మనసులో నిశ్చయించుకున్నాను.

"తప్పు తప్పు! ఆత్మగౌరవంవున్న ఏ మనిషీ మరొకరిని బతిమాలుకోకూడదు. సరేలెండి! మీరు అంత ప్రాధేయపడుతున్నారు కనుక నేను చేస్తాను. రేపు ఆరుగంటలకే వస్తాను" అన్నాడు కఠినంగా ఇది మాత్రం నాన్నకి తెలియకూడదు! ముందు అమ్మతో చెబితే, తరువాత నాన్నకి తెలిసినా అమ్మ సర్దేస్తుంది.

.......ఆవకాయ పెట్టడాన్ని కారం గోళ్ళల్లోకి వెళ్ళిపోయి వేళ్ళు వొకటే మంటలు. రెండు రోజులూ కలం పట్టుకోలేకపోయాను. ఈవేళ కాస్తనయం. పత్రిక తీశాను చదువుదాం అని. పత్రికంతా ఊహాగానమే. ఊకదంపే. విసుగేసింది. చిన్నకునుకు పడుతూంది. "సుభక్కా! నీ కోసం ఫోనే. ఎవరో అడగమన్నావా? నాన్న అడగమన్నారుగా!" అంది పాపాయి. "నాన్న చెప్పిన పాఠం నాన్నకి వప్ప జెప్పాలి! నాన్న ఇక్కడలేరుగా! నేను వస్తున్నానులే" అని వెళ్ళి ఫోను అందుకున్నా...



టెలిఫోను చేసింది సీతారాం. ఈమధ్య నాలుగైదు నలభై ఇతని ఐపూ జాడా లేదు. అంచేత గొంతుక చప్పున ఆనవాలు పట్టలేకపోయాను. నెలరోజులై చెన్నపట్నంలో వుంటున్నాడట. మీరింట్లో వుంటే సాయంకాలం ఐదు గంటలకి వస్తానులెండి అన్నాడు. మేం ఇంగ్లండులో వున్నప్పుడు ఇతడు అక్కడ ఇంజనీరింగు చదువుకోనేవాడు తరుచు కలుసుకనే వాళ్ళం. ఆరోజుల్లోనే కారువేషమున్నూ. ఎర్రగా బుర్రగా వుంటాడు. చలాకీ మనిషి! నాకు మొదట డాన్సింగు ఇతనే నేర్పించాడు. చెన్నపట్నంలో రెండు మూడుసార్లు కనిపించాడు. వాళ్ళకి కొత్తవలస డాబాలు దగ్గిర రెండు మూడు గ్రామాలున్నాయట. రైతులతో తగాయిదాలుంటే నాన్నదగ్గిర సలహాకోసం అని వచ్చాడు. తరువాత మళ్ళీ కనిపించలేదు. నాన్నదగ్గిర కొచ్చినప్పుడల్లా రాత్రి అందరినీ సినిమాకు తీసుకువెళ్ళి కన్నిమేలో విందు. ఎందుచేతో మరి మొదటినుంచి సీతారాం అంటే అమ్మకి అంత నచ్చేది కాదు. ఒకనాడు యేదో సందర్భంలో నాన్న సీతారాం గురించి వూరికే పొగడుతుంటే, అమ్మంది: "సీతారాం మంచివాడే, కాని డబ్బూ గడుసుదనం రెండూ వున్నవాళ్ళంటే నాకు ఎంచేతో భయమే సుభా!" అంది నాతో. నాన్న ఆ మాట అందుకుని "ప్రపంచంలో ఐశ్వర్యం, తెలివితేటలూ వున్నవాడిని యెవడిని చూచినా నీకు భయమే. కుర్రదాని బుర్రలోకి అక్కరకు రాని పాతకాలపు చాదస్తాలన్నీ ఎక్కించి పాడుచెయ్యకు. సీతారాంకి రెండు కార్లున్నాయి! తండ్రికి ఒక్కడే కొడుకు. ప్రొప్రయిటరు. గ్రామాలు రెండున్నాయి. అంతా తండ్రి స్వార్జితం. బర్మాలో ఐదారు లక్షలు సంపాదించి, జపాను వాడొచ్చేలోగా వ్యాపారాన్ని అమ్మేసి నగదు మూటకట్టుకుని



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

దేశానికి వచ్చేశాడు. బర్మానుంచి పారిపోయి వచ్చేసిన వాళ్ళకోసం లక్షరూపాయిలిచ్చి గౌహతిలో ధర్మసత్రమూ దేవుడిగుడీ కట్టిస్తున్నాడు. దానం - ధర్మం - దాంతోపాటు కాస్తో కూస్తో వ్యాపారం చేసుకుంటూ అస్సాంలోనే వుండిపోయాడు. ఇదే సమయంలో జపానువాడొచ్చేలోపుగా చవగ్గా రెండు మూడు తేయాకుతోటలుకొని పారేయమని సలహా యిచ్చాను. నా క్లయింటు సంగతి నాకు బాగా తెలుసుగా! సీతారాం దేహి అని ఒకడి దగ్గిరికి వెళ్ళక్కరలేదు. ఒకడికింద ఉద్యోగం చెయ్యనక్కరలేదు. ఇక కావలసినదేముంది? ఎటొచ్చి బ్రాహ్మడు కాదని. ఏమిటో, ఈ రోజుల్లో మనలాంటి వాళ్ళు కూడా అలాంటి చాదస్తాలు పెట్టుకుంటే జరుగుతుందా? అందులోకీ మనం కాంగ్రెస్‌వాళ్ళం. దేశసేవకి మనం కంకణం కట్టుకున్నాం కూడానూ. సుబ్బుదూ! నే వొక్కటి చెబుతున్నాను విను. నువ్వు యెవడిని చేసుకున్నా నా కిష్టమే. డబ్బూ రెండు కార్లూ ఇళ్ళూ వాకిళ్ళూ వున్నవాడిని చేసుకుంటే నువ్వు సుఖపడతావు, వాడిని సుఖపెడతావు. బ్రాహ్మడు అవుతే ఉత్తమం. బ్రాహ్మడు కాకపోయినా హిందువుడవుతే మధ్యమం. ఇక యేదీలేకుండా ఏ దూదేకులాడో, సోషలిస్టో అవుతే నీ యిష్టం - నీ అమ్మ యిష్టం. నా ఇష్టం చెల్లుతుంది కనకనా?" అన్నారు నాన్న.

"నాన్న! మరి పెద్దనాన్నగారు దొరసాన్ని చేసుకున్నారు?!" అన్నా.

"పెద్దనాన్నగారు మొగాడు. అయినా అడదిడ్డం అంటే పెడదిడ్డం నీకు బాగా అలవాటైంది. మొన్న వదినెకి తెలీకుండా కుర్రాడితోనూ, కుర్రదానితోనూ ఏమన్నాడో తెలుసునా? దొరనికాని, దొరసాన్నికాని చేసుకుంటే, దమ్మిడీలేకుండా డబ్బంతా తిరుపతి వెంకటేశ్వరుల దేవస్థానానికి వీలురాసి ఇచ్చేస్తానన్నాడు - ఏమనుకున్నావో! డబ్బు దనకం వున్నవాడిని చూసుకుని నీ యిష్టం వచ్చినవాడిని చేసుకో. ఎవడితోనేనా మాట ఇచ్చే ముందు, ఆ మొగాడి జాతకాన్ని మాత్రం నా మోహాన్ని పారేయి. చంద్రబలం, తారాబలం చూసి అనుకూలమైన సంబంధమో, కాదో నేను చెబుతాను."

"ఏం చంద్రబలం, ఏం తారాబలం? మాలతి ఖర్మమేమైందో చూశారా?"

"బాగుందే మరి! ప్రపంచంలో పుట్టుకలు లేకుండా చావులు లేకుండా వుంటుందంటే? ఇంతకీ అన్నీ చూసుకోబట్టే పార్వతీశంగారి ఒంట్లో చల్ల కదలకుండా పదిలక్షలొచ్చిపడ్డాయా! దానికేం చెబుతావు?" అన్నారు ఒక సవాలు పారేసి.

...సీతారాం వచ్చాడు. "సుభగారూ! మీరీమధ్య వూళ్ళో లేరాయేమిటి?" అని అడిగేడు. "అవునండీ - స్నేహితురాల్ని చూడాలని విశాఖపట్నం వెళితే ఆ బాంబింగులో చిక్కుపడి వుండిపోయాను" అన్నా. "అంతా వుత్త హంగామాలేగాని జననష్టం ఆస్తినష్టం ఏం కలుగలేదుటగా! అయినా జపాను వాడికి మనం అంటే కిట్టదా యేమిటి?" అన్నాడు. "అదేమిటి అలా అంటారు? బర్మాలో మనవాళ్ళని యమయాతనలను పెడుతున్నాడటగా" అన్నాను ఆశ్చర్యంతో., "మనవాళ్ళని బర్మాలో మరి స్థానబలిమి లేకపోతే జపానువాడేం చేస్తాడు? "నీళ్ళలోన మొసలి యేనుగును బట్టు బైట కుక్కచేత భంగపడును' అన్నాడు వేమన. మనవాళ్ళు బర్మావాళ్ళతో సఖ్యంగా వుంటే యేగొడవా లేకపోను. సింగపూరులో చూడండి. మన వాళ్ళని నెత్తిమీద పెట్టుకుని పూజిస్తున్నారు" అన్నాడు.

"సీతారాంగారూ! చెన్నపట్నంలో ఏం చేస్తున్నారండీ? ఆ మధ్య కనిపించినపుడు కలకత్తాలో వుంటున్నానన్నారు" అని కుశలప్రశ్న వేశాను.

"అవునండీ! 'ఫాదరు' అస్సాంలో తను చేస్తూన్న ధర్మ కార్యాలకి ధర్మకర్తగా వుండిపోమంటారు. నేను ఎంత గుండె నిబ్బరం చేసుకున్నా ఆ బర్మాకాందిశీకుల యేదుపులూ, మొరలూ చూస్తే నాకు తిన్న తిండి వంటలబట్టేది కాదంటే నమ్మండి. అందులోకి ఆడపిల్లలూ స్త్రీలు పట్టపగలు పడే అవమానాలనీ ఆగచాట్లనీ చూస్తే యీ రెండు కళ్ళూ పొడి చేసుకుందామా అనిపించింది. అంచేత 'ఫాదరు' వుండమని శతపోరు పెట్టినా కాందిశీకులనిలాగు నేనే పారిపోయి వచ్చేశాను. ఆ దేవుడి గుడిన్నీ, సత్తరువూ అనాధ శరణాలయం కట్టించేసి - ఇంజనీరునికదా మరియెంతేనా! ఆ దృశ్యాలన్నీ మర్చిపోవడానికనీ వేళంబనగా వుంటుందనీ, ఉద్యోగం పురుష లక్షణం అనిన్నీ, ఇక్కడ ఒక ఇంజనీరింగు కంపెనీలో చేరాను. పదిహేను రోజులై. అరంబాకంలో అమెరికన్లకోసం నేవల్ డిపో ఒకటి కడుతున్నాయి. పని సరదాగా వుందిలెండి. పనిచేస్తే అమెరికన్లతో కలిసి పని చెయ్యాలండీ! ఎందుకండీ మన చదువులన్నీ - 'కదసి తామరందు కప్ప కూర్చున్నట్లు' అని వేమన అన్నట్టు - మన ఇంజినీర్లూ చదువుకున్నారు చదువులు" అన్నాడు.

"సీతారాంగారూ! మీరు మహా చమత్కారంగా మాట్లాడుతారండీ. అరంబాకం కబుర్లు చెప్పండి" అన్నాను. "ఏం చెప్పమన్నారు? అక్కడ చిత్రమైన మనిషి వొకాయన వున్నాడు" అన్నారు. "ఎవరండోయ్?" అన్నాను. "నక్క పుట్టి నాలుగు వారాలు కాలేదు - ఇంత గాలివాన యెప్పుడూ చూడలేదందిట. అలాగ్గా అతను చెన్నపట్నం వదిలి వెళ్లలేదు జన్మలో. అన్నీ అతనికి తెలుసునంటాడు. మహాయాతన పెట్టేస్తున్నాడండీ మమ్మలిని!" అన్నాడు విసుక్కుంటూ. "ఏం? లంచాలు తెమ్మంటాడా?" అన్నాను చకితనై.

- ఇంకా వుంది.

ఆర్‌ఆర్‌బీ ఏఎల్‌పీ, టెక్నీషియన్ పరీక్ష సన్నద్ధానికి చిట్కాలు

ఇండియన్ రైల్వేలో కెరీర్‌ను సుస్థిరం చేసుకునే దిశగా ఆలోచిస్తున్న వారికి ఓ మంచి అవకాశం. దేశవ్యాప్తంగా 26,502 అసిస్టెంట్ లోకో పైలట్ (ఏఎల్‌పీ), టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది.

పదో తరగతితో పాటు ఐటీఐ/ ట్రేడ్ అప్రెంటీస్‌షిప్/ ఇంజనీరింగ్ డిప్లొమా/ ఇంజనీరింగ్ డిగ్రీ/ ఇంటర్మీడియెట్ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్) అర్హతతో ఈ ఉద్యోగాలను చేజిక్కించుకోవచ్చు. ఈ నేపథ్యంలో పరీక్ష విధానం, అందులో విజయానికి సూచనలు..



పరీక్ష విధానం :

ఏఎల్‌పీ/టెక్నీషియన్ పోస్టులకు ఉమ్మడిగా రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఉంటుంది. ఏఎల్‌పీ పోస్టుకు పోటీపడుతూ, రెండో దశ సీబీటీలో అర్హత సాధించిన వారికి అదనంగా కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏటీ) నిర్వహిస్తారు.

తొలిదశ సీబీటీ ప్రశ్నపత్రంలో 75 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి గంట. మ్యాథమెటిక్స్; జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్; జనరల్ సైన్స్; జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. తొలిదశలో అర్హత సాధించిన వారికి రెండోదశ సీబీటీ నిర్వహిస్తారు.

రెండోదశ పరీక్షలో పార్ట్-ఏ (100 ప్రశ్నలు, 90 నిమిషాలు), పార్ట్-బీ (75 ప్రశ్నలు, 60 నిమిషాలు) ఉంటాయి.

పార్ట్-ఏలో మ్యాథమెటిక్స్; జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్; బేసిక్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్; జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-బీ (అర్హత పరీక్ష మాత్రమే)లో సంబంధిత ట్రేడ్‌కు సంబం ధించిన ప్రశ్నలు ఇస్తారు.

సన్నద్ధత..

మ్యాథమెటిక్స్ : మ్యాథమెటిక్స్ సిలబస్‌లో నంబర్ సిస్టమ్, బాడ్‌మాస్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎఫ్; రేషియో అండ్ ప్రపోర్షన్; పర్సంటేజెస్, మెన్సురేషన్‌బీ టైం అండ్ వర్క్ టైం అండ్ డిస్టెన్స్; ఇంట్రస్ట్‌బీ ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీ, జామెట్రీ, కేలండర్ అండ్ క్లాక్ తదితర అంశాలున్నాయి.

తొలుత పాఠశాల స్థాయి పాఠ్యపుస్తకాల్లో ఉన్న సిలబస్‌లోని అంశాలకు సంబంధించిన ప్రాథమిక భావనలపై అవగాహన పెంపొందించుకోవాలి. ఉదాహరణ, అభ్యాసాల్లోని సమస్యలను ప్రాక్టీస్ చేయాలి.

ఆర్.ఎస్.అగర్వాల్, అరిహంత్ పుస్తకాల్లోని సమస్యలను ప్రాక్టీస్ చేయాలి. బ్యాంకు, ఎస్ఎస్‌సీ, రైల్వే పరీక్షలకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది. మ్యాథ్ లో అధిక మార్కుల సాధనకు ప్రాక్టీస్‌కు మించిన మార్గం లేదని గుర్తించాలి.

జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ :

సిలబస్‌లో అనాలజీస్, ఆల్ఫాబెటికల్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, జంబ్లింగ్, వెన్‌డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, సఫీషియెన్సీ; కన్‌క్లూజన్ అండ్ డెసిషన్ మేకింగ్; సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్; అనలిటికల్ రీజనింగ్; క్లాసిఫికేషన్; డైరెక్షన్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

బ్యాంకు, ఎస్ఎస్‌సీ తదితర పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలించి, ఈ విభాగం నుంచి వాటిలో ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయో అర్థం చేసుకోవాలి. ఆపై ప్రామాణిక పుస్తకాల్లోని సమస్యలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది. తార్కిక సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ఇందులో ప్రశ్నలుంటాయి. షార్ట్‌కట్స్ ద్వారా త్వరగా సమాధానాలు గుర్తించేలా రోజూ 20–30 ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ సైన్స్ :

పదో తరగతి స్థాయిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రిపరేషన్‌కు ఎన్‌సీఈఆర్‌టీ/ ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకాలను ఉపయోగించుకోవాలి.

ఫిజిక్స్‌లో యూనిట్స్, ఫోర్స్, ప్రెజర్‌బీ మెకానిక్స్, సౌండ్, హీట్, లైట్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, మోడర్న్ ఫిజిక్స్ తదితర అంశాల్లోని బేసిక్ కాన్సెప్టులు, సూత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

కెమిస్ట్రీలో ఆటమ్స్, మాలిక్యూల్స్, యాసిడ్స్, బేసెస్, సాల్ట్స్; మెటల్స్ అండ్ నాన్ మెటల్స్; కార్బన్ కాంపౌండ్స్, మెటలర్జీ తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

లైఫ్ సైన్సెస్‌కు సంబంధించి హ్యూమన్ బాడీ, విటమిన్లు, న్యూట్రిషన్, నెర్వస్ సిస్టమ్, హార్మోన్లు, ఎంజైమ్‌లు, సూక్ష్మజీవులు, వ్యాధులు, టీకాలు, పర్యావరణం తదితర అంశాలను అధ్యయనం చేయాలి.

జనరల్ సైన్స్‌కు సంబంధించి రోజువారీ జీవితంలోని అనువర్తనాలు, స్పేస్ సైన్స్, కంప్యూటర్స్ తదితరాలపై అవగాహన తప్పనిసరి.

జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ :

రోజూ తనచుట్టూ సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహనను పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ, ఎకనామిక్స్, పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర సబ్జెక్టులకు సంబంధించిన ముఖ్యాంశాలను తెలుసుకోవాలి. భారత జాతీయోద్యమంలోని ముఖ్య పరిణామాలపై అవగాహన అవసరం. పాలిటీలో రాజ్యాంగం ముఖ్యాంశాలపై దృష్టిసారించాలి.

కరెంట్ అఫైర్స్‌లో జాతీయ, అంతర్జాతీయ ముఖ్య సంఘటనలను తెలుసుకోవాలి. సదస్సులు, క్రీడలు, వార్తల్లో వ్యక్తులు, నియామకాలు, అంతరిక్ష ప్రయోగాలు, పుస్తకాలు-రచయితలు, అవార్డులు తదితరాలపై దృష్టిసారించాలి. దినపత్రికలను చదువుతూ ముఖ్య సంఘటనలను ప్రత్యేకంగా నోట్స్‌లో పొందుపరచుకోవడం మంచిది.

బేసిక్ సైన్స్, ఇంజనీరింగ్ :

ఇంజనీరింగ్ డ్రాయింగ్ (ప్రొజెక్షన్స్, వ్యూస్, డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, లైన్స్, జామెట్రిక్ ఫిగర్స్, సింబాలిక్ రిప్రెజెంటేషన్స్), యూనిట్స్, మెజర్‌మెంట్స్; మాస్ వెయిట్ అండ్ డెన్సిటీ; వర్క్ పవర్ అండ్ ఎనర్జీ; స్పీడ్ అండ్ వెలాసిటీ; హీట్ అండ్ టెంపరేచర్; బేసిక్ ఎలక్ట్రిసిటీ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

టిప్స్..

సిలబస్‌ను అనుసరించి ప్రామాణిక మెటీరియల్‌ను సేకరించుకోవాలి. రోజుకు 8–10 గంటలను ప్రిపరేషన్‌కు కేటాయించాలి. అన్ని సబ్జెక్టులను చదివేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.

ప్రిపరేషన్ సమయంలో ముఖ్యమైన అంశాలు, సూత్రాలను ప్రత్యేకంగా నోట్ చేసుకోవాలి. వీటిని ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకోవాలి.

ఒక్కో అంశానికి సంబంధించి 100–200 ప్రశ్నలు ప్రాక్టీస్ చేయడం మంచిది.

ప్రిపరేషన్ సమయంలో ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు స్నేహితులు, ఫ్యాకల్టీ సహాయంతో నివృత్తి చేసుకోవాలి.

మోడల్ పేపర్లు, పాత ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలకు నిర్దేశిత సమయంలో సమాధానాలు గుర్తించేలా ప్రాక్టీస్ చేయాలి.



స్కాలర్‌షిప్‌లు

నేషనల్ అట్మాస్ఫియరిక్ లేబొరేటరీలో 18 ఫెలోషిప్స్

చిత్తూరు జిల్లా గాదంకిలో ఉన్న నేషనల్ అట్మాస్ఫియరిక్ లేబొరేటరీ (ఎన్ఏఆర్ఎల్)... 18 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు :** రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ)/ పోస్ట్ డాక్టోరల్ ఫెలో (పీడీఎఫ్)-3; జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-15.
- **ఫెలోషిప్ :** ఆర్ఏ/ పీడీఎఫ్-రూ.36,000; జేఆర్ఎఫ్-రూ.25,000.
- **అర్హతలు :** సంబంధిత పోస్టులను బట్టి పీహెచ్‌డీ/ ఎంఈ/ ఎంటెక్/ పీజీ. అలాగే నిబంధనల మేర సంబంధిత రంగంలో ఉద్యోగానుభవం, మార్కుల శాతం ఉండాలి. జేఆర్ఎఫ్‌కు అదనంగా సీఎస్ఐఆర్-యూజీసీ నెట్/గేట్/ జామ్/ జెస్ట్ క్వాలిఫై అయి ఉండాలి.
- **వయసు :** జేఆర్ఎఫ్‌కు 30 ఏళ్ల లోపు, ఆర్ఏ/ పీడీఎఫ్‌కు 35 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి ఎన్ఆర్ఎల్ చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ :** మార్చి 25, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ :** మార్చి 30, 2018.
- **వెబ్‌సైట్ :** www.narl.gov.in

నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీలో ఫెలోషిప్స్

న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (ఎన్‌సీఎస్).. 10 రీసెర్చ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖకు చెందింది.

- **పోస్టు-ఖాళీలు :** రీసెర్చ్ అసోసియేట్ (ఆర్ఏ)-5; రీసెర్చ్ ఫెలో (ఆర్ఎఫ్)-5.
- **స్టైపెండ్ :** ఆర్ఏ-రూ.36,000; ఆర్ఎఫ్-రూ.25,000. దీంతోపాటు డీఎస్‌టీ/ ఎంవోఈఎస్ నిబంధనల ప్రకారం హెచ్‌ఆర్ఏ, మెడికల్ అలవెన్సులు ఉంటాయి.
- **అర్హతలు :** జియాలజీ/ జియోఫిజిక్స్/ సిస్మాలజీ/ ఫిజిక్స్/ కంప్యూటర్స్‌లో మాస్టర్స్ డిగ్రీ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్/ కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీఈ/ బీటెక్ లేదా తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. నెట్/ గేట్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. అలాగే రీసెర్చ్ అసోసియేట్స్‌కు ఏదైనా అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్/ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆర్గనైజేషన్‌లోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు విధానం :** ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 15 రోజుల్లోపు.

- **వెబ్‌సైట్:** www.moes.gov.in

సైన్స్, టెక్నాలజీ రంగాల్లో విజయానికి నైపుణ్యాలు అవసరం

శాస్త్ర సాంకేతికరంగాల్లో సరికొత్త ఆవిష్కరణల ఫలితంగా పరిశ్రమల ముఖచిత్రం శరవేగంగా మారిపోతోంది. ఇదే క్రమంలో జాబ్ మార్కెట్ కూడా కొత్తధోరణులకు వేదికవుతోంది.



'డిజిటల్ విప్లవ' దశ తీసుకొస్తున్న పెనుమార్పులకు తగ్గట్లు అత్యాధునిక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడమే ఉద్యోగార్థుల కర్తవ్యం. ప్రధాన రంగాలైన మ్యానుఫ్యాక్చరింగ్, టెలికాం, ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, బీఎఫ్ఎస్ఐ విభాగాల్లో కెరీర్‌ను సుస్థిరం చేసుకునేందుకు పెంపొందించుకోవాల్సిన

నైపుణ్యాలకు సంబంధించిన వివరాలు..

మ్యానుఫ్యాక్చరింగ్ : మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ప్రాసెస్‌పై పరిజ్ఞానం.

పూర్తిస్థాయి కంప్యూటరైజ్డ్ వాతావరణంలో పనిచేయడం.

మెషీన్ ప్రోగ్రామింగ్ కోడ్‌ను చదివి అర్థం చేసుకోవడం.

మ్యానుఫ్యాక్చరింగ్ బ్లూప్రింట్‌లను అర్థం చేసుకోవడం.

ఆటోమేటెడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సిస్టమ్స్‌ని ఆపరేట్ చేయడం.

హైడ్రాలిక్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్‌పై అవగాహన.

కొద్దిపాటి డిజిటల్ నైపుణ్యం అవసరం.

తాజా మార్కెట్ పరిస్థితులపై అవగాహన.

రీసెర్చ్, ఇన్నోవేషన్, డెవలప్‌మెంట్ అంశాలపై దృష్టిసారించాలి.

మ్యానుఫ్యాక్చరింగ్ లోపాలను పసిగట్టగలగాలి.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్‌పై అవగాహన.

టెలికాం :

టెక్నలాజికల్ (ఐఓటీ, బిగ్‌డేటా, అనలిటిక్స్, క్లౌడ్, ఏఐ) స్కిల్స్.

రూటర్స్, గేట్ వేస్, వాన్, లాన్ తదితరాలపై అవగాహన.

కేబ్లింగ్‌బీ నెట్‌వర్క్ డిజైన్ అండ్ డిస్ప్లాయిడ్ స్కిల్స్.

ట్రబుల్ షూటింగ్ స్కిల్స్.

దాక్యుమెంటేషన్ స్కిల్స్.

కమ్యూనికేషన్ స్కిల్స్.

క్రాస్-ప్లాట్‌ఫామ్ టెలికాం సిస్టమ్స్ (VOIP, Telephony Networks, Cellular Services) స్కిల్స్.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ :

మల్టిపుల్ ప్రోగ్రామింగ్ స్కిల్స్.

లాజికల్ అండ్ స్ట్రక్చరల్ స్కిల్స్.

మల్టిపుల్ కోడింగ్ లాంగ్వేజెస్.

లెర్నింగ్ న్యూ టెక్నాలజీస్.

అనలైజ్ కాంప్లెక్స్ టెక్నికల్ ఇన్ఫర్మేషన్.

కంప్యూటర్ ఆర్కిటెక్చర్, ఆపరేటింగ్ సిస్టమ్స్, డేటా స్ట్రక్చర్స్‌పై అవగాహన.

టీం వర్క్ స్కిల్స్.

ఇన్నోవేటివ్ మైండ్‌సెట్.

కమ్యూనికేషన్ స్కిల్స్.

అప్‌కమింగ్ టెక్నాలజీస్ (ఫిన్‌టెక్, సోషల్ అండ్ డిజిటల్ మీడియా)పై అవగాహన.

పీఆర్ (పర్సనల్ రిలేషన్స్) స్కిల్స్.

ఎఫ్ఎంసీజీ :

క్రాస్ ఫంక్షనల్ స్కిల్స్.

రియల్ కమర్షియల్ ఎక్స్‌పోజర్.

వెర్బల్ కమ్యూనికేషన్.

ప్రొడక్ట్ నాలెడ్జ్.

ఆర్గనైజింగ్ స్కిల్స్.

టైం మేనేజ్‌మెంట్ స్కిల్స్.

స్ట్రాంగ్ కస్టమర్ ఫోకస్.

ఎఫెక్టివ్ ఇన్‌ఫ్లుయెన్సింగ్ అండ్ నెగోసియేషన్ స్కిల్స్.

కంప్యూటర్, న్యూమరికల్ స్కిల్స్.

క్రియేటివిటీ.

లోగోస్ క్రియేషన్ అండ్ డిజైనింగ్.

సోషల్ మీడియా స్ట్రాటజీ.

ఫైనాన్షియల్ అనాలసిస్.

ప్రొడక్ట్ ప్రమోషనల్ స్కిల్స్.

ఫార్మా :

బల్క్ డ్రగ్ ఫార్ములేషన్.

క్లినికల్ ట్రయల్స్.

డ్రగ్ ప్రొడక్షన్ ప్రాసెస్.

కెమికల్ ఫార్ములేషన్.

స్ట్రాంగ్ అనలిటికల్ స్కిల్స్.

మల్టీటాస్కింగ్.

కమ్యూనికేషన్ స్కిల్స్

ప్రొడక్ట్ నాలెడ్జ్

డేటా అనలిటికల్ స్కిల్స్.

ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ స్కిల్స్.

అడాప్ట్ టెక్నాలజీ.

క్వాలిటీ మైండ్‌సెట్.

ప్రాబ్లమ్ రికగ్నేషన్.

ప్రాబ్లమ్ సాల్వింగ్ స్ట్రాటజీస్.

బీఎఫ్ఎస్ఐ :

ఫైనాన్స్ అండ్ ఇండస్ట్రీ నాలెడ్జ్.

ఎంట్రప్రెన్యూవల్ స్పిరిట్.

అనలిటికల్ థింకింగ్.

పీపుల్ మేనేజ్‌మెంట్.

సాఫ్ట్‌వేర్ (వీఆర్, ఏఆర్, మెషీన్ లెర్నింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా, అడ్వాన్స్ అనలిటిక్స్, డిజిటల్ మార్కెటింగ్, ఐఓటీ, ప్రాసెస్ ఆటోమేషన్) నాలెడ్జ్.

గ్లోబల్ అవుట్‌లుక్.

కస్టమర్ సర్వీస్.

న్యూమరికల్ స్కిల్స్.

టీం వర్క్.

క్విక్ లెర్నింగ్- న్యూస్కిల్స్.

స్మార్ట్‌నెస్.

ఎఫెక్టివ్ కమ్యూనికేషన్.

అలర్ట్ అండ్ అవేర్‌నెస్.

రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్.

రిస్క్ మేనేజ్‌మెంట్.

డిజిటల్ టెక్నాలజీ అవేర్‌నెస్.

విశాలాంధ్ర బిజినెస్

-300.16 ▼	-99.50 ▼	◀◀	బంగారం (విశాఖపట్నం)	100 ▲	వెండి (విశాఖపట్నం)	డాలరు
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	29,180	వెండి (విజయవాడ)	41,700	Vs
33,746.78	10,358.85	29,300	ప్రొద్దుటూరు 28,210	39,700	ప్రొద్దుటూరు 41,535	రూపాయి
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	64.37

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
సన్‌ఫార్మా	547.85	2.50
టీసీఎస్	3,104.30	2.21
ఎం&ఎం	738.95	0.81
ఎస్‌బీఐ	268.00	0.48
కోటక్ మహీంద్ర	1,104.00	0.25

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టాటా మోటార్స్	352.15	-5.04
టాటా మోటార్స్(డి)	199.70	-3.92
టాటా స్టీల్	655.35	-2.95
బజాజ్ ఆటో	3,025.00	-2.74
రిలయన్స్	949.00	-2.48

విదేశీమారకం విలువ (ఫారెక్స్)


కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.17	65.11
యూరో	80.35	80.04
పౌండ్	90.02	89.92
ఆస్ట్రేలియా డాలర్	50.55	50.39
సింగపూర్ డాలర్	49.38	49.34

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,180	31,208
చెన్నై	29,180	31,208
బెంగళూరు	28,600	30,588
ముంబై	29,760	31,828
విజయవాడ	29,300	31,550
విశాఖపట్నం	29,180	31,832
ప్రొద్దుటూరు	28,210	31,090
ముడి చమురు		64.37

సోలార్ పంప్‌సెట్లు భేష్

రాష్ట్రంలో 8,375 సోలార్ పంప్ సెట్ల ఏర్పాటు



విశాలాంధ్ర-అమరావతి : విద్యుత్ పొదుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ వరకు 8,375 సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేశారు. ఈ పంప్ సెట్లకు రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సోలార్ పంప్ సెట్లతో విద్యుత్ ఆదా కావడమే కాకుండా రైతులకు ఎంతో ఉపయోగకర రంగా ఉంటుంది. దాంతో ప్రభుత్వం ఈ పంప్ సెట్లను ఏర్పాటు చేస్తోంది. పరికరాలతో కలిపి సోలార్ పంప్ సెట్ ఏర్పాటుకు రూ.4.20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇందులో రైతు రూ.55 వేలు మాత్రమే చెల్లిస్తారు. కేంద్ర ప్రభుత్వం 33 శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన మొత్తం దిస్కం పెట్టుబడి పెడుతుంది. ఐదేళ్ల వరకు ప్రభుత్వ పర్య వేక్షణ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వంలోని ఎంఎన్‌ఆర్‌ఈ (మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రిన్యూవబుల్ ఎనర్జీ) మన రాష్ట్రానికి మొదటి దశ కింద 6,725 సోలార్ పంప్ సెట్లను మంజూరు చేసింది. వాటన్నింటిని అమర్చడంతో మొదటిదశ పూర్తయ్యింది. రెండవ దశ కింద పది వేల పంప్ సెట్లను మంజూరు చేసింది. వాటిలో డిసెంబర్ వరకు 1,650 పంప్ సెట్లను బిగించారు. మిగిలిన వాటిని మార్చి నెలాఖరు లోపల పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ తరువాత మరో పది వేల పంపు సెట్లను కేంద్రం మంజూరు చేస్తుంది. ప్రభుత్వ భవనాలపై సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

ఈ పనులను పర్యవేక్షించే బాధ్యతలను ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవడంలో భాగంగా మేజర్ పంచాయతీలలో కూడా లెడ్ బల్బులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు బొగ్గు, గ్యాస్, చమురు వంటి సాంప్రదాయ వనరుల ద్వారా తయారయ్యే విద్యుత్ ఉత్పత్తి సరిపోదు. దాంతో అందరి దృష్టి సౌరశక్తి, గాలి వంటి సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిపై పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సౌరవిద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. సూర్యశక్తితో అతిచౌకగా విద్యుత్‌ని తయారు చేయవచ్చు. అంతే కాకుండా వాతావరణ కాలుష్యం కూడా చాలావరకు తగ్గుతుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో సోలార్, పవన ప్రాజెక్టుల ద్వారా మరింత విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు.

పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ఏపీ ప్రభుత్వం రాయితీలు, మినహాయింపులు ఇస్తామని ప్రకటించింది. సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియ వేగవంతం చేసింది. దాంతో పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. 4 వేల మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తికి సంబంధించి ఒప్పందాలు జరిగాయి. ఎండలు ఎక్కువగా ఉండే రాయలసీమలో సౌర విద్యుత్ ప్రాజెక్టులకు ఎంతో అనుకూలం. అనంతపురం, కడప, కర్నూలులో 4 మెగా సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తారు. 2018 ఆఖరి నాటికి పూర్తయ్యే ఈ ప్రాజెక్టుల ద్వారా 16 వేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని అంచనా. అనంతపురం జిల్లా ఎన్.పి.కుంటలో 250 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంట్‌ను నెలకొల్పారు. కర్నూలు జిల్లా గనిలో వెయ్యి మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ప్రాజెక్టు పనులు పూర్తి కావచ్చాయి. మిగిలిన ప్రాజెక్టులకు టెండర్లు పిలవడం పూర్తయ్యింది. వీటికి కావలసిన ప్రభుత్వ, ప్రైవేటు భూములను ఆయా జిల్లా కలెక్టర్లు పరిశీలిస్తున్నారు. సోలార్ విద్యుత్‌కు సంబంధించి నూతన సంప్రదాయేతర ఇంధనవనరుల అభివృద్ధి సంస్థ నిర్వహణలో వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. రాయలసీమలోనే సౌర, పవన విద్యుత్ రెండిటినీ ఒకే చోట ఉత్పత్తి చేసే ప్రణాళికను ప్రభుత్వం రూపొందించింది. 200 మెగావాట్ల మిశ్రమ (సౌర, పవన) విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. పవన విద్యుత్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ భూములను ఎంపిక చేసే పనిలో జిల్లా కలెక్టర్లు ఉన్నారు. 615 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తితోపాటు సౌర ఫలకాల యూనిట్‌ను నెలకొల్పేందుకు విక్రమ్ సోలార్ సంస్థ ఆసక్తి చూపింది. సుజలాన్ సంస్థ పవన విద్యుత్‌కు అవసరమైన టర్బైన్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అనంతపురంలో ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో విద్యుత్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్ రంగంలో పరిశోధనలు, అధ్యయనాలు చేయడానికి ఇది ఉపయోగపడుతుంది.

వ్యర్థాలతో ఇంధన ఉత్పత్తి

పట్టణ ప్రాంతాల్లో పేరుకుపోతున్న టన్నుల కొద్దీ చెత్తా చెదారం వంటి వ్యర్థాల నుంచి ఇంధనాన్ని ఉత్పత్తి చేసే ప్లాంట్లను నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఘన వ్యర్థాల నిర్వహణ పక్కాగా చేయాలని, మున్సిపాలిటీల్లో వ్యర్థాల నుంచి ఇంధన తయారీ ప్రాజెక్టులు నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం 12 జిల్లాల్లో 10 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్‌లో 6 నుంచి 8 మునిసిపాలిటీలు ఉంటాయి.

విజ్ఞానం

బ్రిస్క్‌వాక్‌తో గుండె వ్యాధులు దూరం



బ్రిస్క్‌వాక్‌తో మహిళల్లో గుండె వ్యాధులను నివారించ వచ్చునని తెలుస్తోంది. శారీరకవ్యాయామం గుండె వ్యాధులను అరికట్టేందుకు మంచిదే అయినప్పటికీ, సింపుల్‌గా ఉండే సాధారణ వాకింగ్ వలన మాత్రం ప్రయోజనం ఉండదనేది స్పష్టమవుతోంది. 60ఏళ్లకు పైబడిన మహిళల్లో మూడురెట్లు గుండె వ్యాధులు పెరిగే అవకాశం ఉంది. వీరిలో హార్ట్ బీట్ నిదానించడంతో శరీరానికి కావలసిన రక్తం సరఫరా చేయకపోవడంతో గుండె వ్యాధులు పెరిగే అవకాశం ఉంది. పోస్ట్ మెనోపాజల్ సమయంలో మహిళలు కనీసం రోజుకు 40నిమిషాలు బ్రిస్క్‌వాక్ చేయడంతో 21 నుండి 25 శాతం గుండె వ్యాధులు తగ్గే అవకాశం ఉందని తాజాగా జరిగిన 67వ వార్షిక సైంటిఫిక్ సమావేశంలో వెల్లడైంది. 59 నుండి 70ఏళ్ల వయసు కలిగిన 89,000 మంది మహిళలపై చేపట్టిన ప్రయోగంలో 10ఏళ్ల పాటు వారి జీవనవిధానం, వాకింగ్ ఫ్రీక్వెన్సీ, స్పీడ్‌ని లెక్కించడంతో 25 శాతం మహిళల్లో గుండె వ్యాధులు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది.

స్కిన్‌పై ఉండే బాక్టీరియాతో

చర్మకేన్సర్ నియంత్రణ



చర్మంపైన ఉండే కొన్ని రకాల బాక్టీరియా స్కిన్ కేన్సర్ రాకుండా కాపాడుతాయని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా వెల్లడించింది. స్కిన్ పైన ఉండే బాక్టీరియా విడుదల చేసే రసాయనాలు కొన్ని రకాల బాక్టీరియాలను నిర్వీర్యం చేస్తాయని తెలుస్తోంది. ఎస్. ఎపిడెర్మిడిస్ స్ట్రెయిన్ అనే బాక్టీరియా ఉత్పత్తిచేసే కెమికల్ కాంపౌండ్ 6-ఎన్-హైడ్రాక్సి అమైనో ప్యూరిన్ (6-హెచ్‌ఏపి). 6-హెచ్‌ఏపి అనే ఈ మాలిక్యూల్ ట్యూమర్ సెల్స్ వ్యాప్తిని నిరోధిస్తాయి. అంతేకాకుండా యువి-ఇండ్యూస్‌డ్ స్కిన్ కణితులను వృద్ధి చెందకుండా నిర్వీర్యం చేస్తాయి. ఎలుకలపై వీరు చేపట్టిన ప్రయోగంలో, ఎలుకలపైచేపట్టినప్రయోగంలో రుజువైనట్లు తెలుస్తోంది.

దేశీయ మార్కెట్లు ఢమాల్...

300పాయింట్ల భారీ నష్టంతో సెన్సెక్స్



ముంబై: ఆసియన్ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో బెంచ్ మార్కు సూచీలు వరుసగా నాలుగవ సెషన్‌లోనూ నష్టాల్లో నమోదయ్యాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు వారం ఆరంభంలో నష్టాలతో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ సుమారు 200 పాయింట్లు నష్ట పోయింది. ముగింపులో 300.16 పాయింట్ల నష్టంతో 0.88శాతంతో 33,746.78 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 50 పాయింట్ల నష్టంలో 99.50 పాయింట్ల నష్టంతో 0.95శాతంతో 10,400 వద్ద ముగిసింది. మిడ్‌కాప్, స్మాల్‌కాప్ సూచీలు 0.95, 1.09శాతం నష్టపోయాయి. బిఎస్‌ఇలో సెక్టరల్ సూచీలన్నీ ఐటి, టెక్, కన్సూమర్ డ్యూరబుల్స్ తప్ప అన్ని రంగాల షేర్లు ముఖ్యంగా మెటల్స్ 3.30శాతం ఎనర్జీ 2.16శాతం, బేసిస్ మెటీరియల్స్ 2.14 శాతం దిగజారాయి. సన్‌ఫార్మా, టిసి ఎస్, ఎమ్ అండ్ ఎమ్, ఎస్‌బీఐ ప్రధాన లబ్దిదారులుగా నమోదయ్యాయి. టాటా మోటార్స్, టాటాస్టీల్,బజాజ్ ఆటో, ఆర్‌ఐఎల్ ప్రధానంగా నష్టపోయారు. భారతీయ రూపాయి డాలర్ మారకంతో 65.10 వద్ద ట్రేడ్ అవుతోంది.నవంబర్ 16నాటి నుండి ఇది కనిష్టసాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉక్కు దిగుమతులపై సుంకాన్ని మరింత పెంచినట్లు ప్రకటించడంతో ఆసియా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. యూరప్ ఎన్నికలు, మూడు ఈశాన్య రాష్ట్రాల ఫలితాలు మార్కెట్లో మదుపరుల సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. గత వారం లాంగ్ వీకెండ్ కావడంతో మార్కెట్లపై ప్రభావం చూపాయి. సేవలరంగం గణాంకాలు విడుదల సోమవారం విడుదలకానున్న నేపథ్యంలో మదుపరులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. సెక్టరల్ సూచీల్లో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 2శాతం పైగా ట్రేడ్ అయింది. జిందాల్ స్టీల్ అండ్ పవర్, జిందాల్ స్టెయిన్‌లెస్ అండ్ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వీటిలో ముఖ్యమైనవి. టాటా మోటార్స్, మదర్సన సుమి సిస్టమ్స్ నష్టాల్లో నమోదు కావడంతో, నిఫ్టీ ఆటో ఇండెక్స్ మరింత దిగజారి 1శాతం పైగా నష్టాల్లో నమోదైంది. ఆర్థిక గణాంకాల నేపథ్యంలో ఫిబ్రవరిలో బిజినెస్ కండిషన్స్ భారత్‌లోని సర్వీసురంగంలో మరింత దిగజారినట్లు కనిపిస్తోంది. నవంబరు తరువాత యాక్టివిటీ రంగం మొదటిసారి దిగజారింది. నిక్కీ ఇండియా బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ జనవరిలో 51.7 కాగా ఫిబ్రవరిలో 47.8గా నమోదైంది.

అంతర్జాతీయ మార్కెట్లు: ఆసియా షేర్లు నష్టాల్లో ముగిసాయి. ఎమ్‌ఎస్‌సిఐ బ్రాడెస్ట్ ఇండెక్స్ జపాన్ వెలుపల ఆసియా పసిఫిక్ షేర్లు మరింతగా నష్టాల్లోకి దిగజారాయి. గత వారం 2శాతానికిపైగా దిగజారాయి. జపాన్ నిక్కీ 0.4శాతం కాగా సౌత్ కొరియా కాస్పి 0.3శాతం దిగజారాయి.

ముడిచమురు సరఫరాలో ఇరాక్ ముందంజ



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ ముడిచమురు అవస రాలు తీర్చేందుకుగాను భారతదేశానికి అత్యు త్తమ క్రూడాయిల్ సరఫరాదారుల్లో సౌదీ అరేబియాను అధిగ మించి ఇరాక్ నమో దైంది. ఇప్పటివరకు భారత్‌కు ముడిచమురు సరఫరాదారుల్లో ప్రధానమైనదిగా సౌదీ అరేబియా ఉండేది. 2017-18 సంవత్సరంలో ఏప్రిల్-జనవరి కాలంలో భారతదేశ ప్రధాన ముడి చమురు సరఫరా చేసేదిగా ఇరాక్ 38.9 మిలియన్ టన్నుల చమురు దిగుమతిచేసి సౌదీ అరేబియాను అధిగమించినట్లు ఆయిల్ మినిస్టర్ ధర్మేంద్రప్రధాన్ వెల్లడించారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానిమిస్తూ ప్రధాన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 10నెలలకాలంలో సౌదీ అరేబియా 30.9 ఎంటిల చమురు సర ఫరా చేయగా, 2016-17 సంవత్సరంలో 184.4 ఎంటిల చమురు, 2016-17 కాలంలో 213.9 ఎంటిల చమురు. 2015- 16 కాలంలో 202.8 ఎంటీలు నమోదైంది. గ్యాస్ క్షేత్రాలను అభివృద్ధి చేసుకునే క్రమంలో భారత్ ఇరాన్ నుండి దిగుమతుల్లో మూడవ అతిపెద్ద సరఫరాదారుగా ఏప్రిల్-జనవరి కాలా నికి 18.4 ఎంటీలు నమోదుచేసింది. ఇరాన్ మూడవ స్థానాన్ని ఆక్రమించి రెండవ సంవత్సరంలోకి చేరింది.సౌదీ అరేబియా తరువాత ఇరాన్ భారత్‌కు రెండవ అతిపెద్ద సరఫరాదారుగా నమోదైంది. ఏప్రిల్-జనవరి కాలానికి 15.5 ఎంటీల ముడి చమురు సరఫరాతో వెనిజులా భారత్‌కి నాలుగవ అతిపెద్ద సరఫరాదారుగా నమోదైంది. నైజీరియా 14.9 ఎంటీలు సరఫరా చేసింది. భారతదేశం చమురు అవసరాల నిమిత్తం 80శాతం దిగుమతులపై ఆధారపడింది. 2015లో పాశ్చాత్య ఆంక్షలు సడలించడంతో ముఖ్యంగా ఇరాన్ నుండి చమురుకొనుగోలు చేయడం ప్రారంభించింది. 2013-14కాలానికి కువైట్ మూడవ అతిపెద్ద సరఫరాదారుగా కేవలం 10.2 ఎంటీలు సరఫరా చేసింది. 2014-15కాలంలో 17.9 ఎంటీలు, 2015-16కాలంలో కొంత తగ్గి 11 ఎంటీలు కాగా 2016-17కాలంలో 9.8 ఎంటీలు సరఫరా చేసింది. 2014-15 సంవత్సరంలో భారత్ మధ్యప్రాశ్చ దేశాల నుండి ముడిచమురు దిగుమతలను 58 శాతం నుండి ప్రస్తుత ఆర్థికసంవత్సరం ఏప్రిల్-జనవరి కాలానికి 63.7 శాతానికి పెంచింది. 2014-15సంవత్సరంలో మొత్తం ముడి చమురు దిగుమతులు 189.4 ఎంటీలు కాగా దీనిలో 109.9 ఎంటీలు మధ్య ప్రాశ్చాలనుండే దిగుమతి చేసుకుంది.

ఆధార్ అనుసంధానం వేగవంతం



న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాలు, మొబైల్ ఫోన్ కనెక్షన్లతో ఆధార్ అనుసంధాన ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఫిబ్రవరి నెలాఖరు నాటికి 80 శాతం బ్యాంకు ఖాతా లు, 60 శాతం మొబైల్ ఫోన్ కనెక్షన్లు ఆధార్‌తో అనుసంధానమైనట్లు భారత విశిష్ట ప్రాధికార సంస్థ అధికారి ఒకరు చెప్పారు. ఈ నెలాఖరులోగా ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతాలను, మొబైల్ ఫోన్ కనెక్షన్లను ఆధార్‌తో అను సంధానం చేయించుకోవాలని ప్రభుత్వం గడువు విధించింది. ఆదాయ పన్ను చెల్లింపుదారులు ఈ గడువులోపే తమ ఆధార్-పాన్ నంబర్లు అనుసంధానం చేసుకోవాలి. బ్యాంక్ ఖాతాలను ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయడం వల్ల తప్పుడు గుర్తింపు పత్రాలతో జరిగే బ్యాంకు మోసాలకు తెరపడుతుందని యూఐడీఏఐ సీఈఓ అజయ్ భూషణ్ పాండే చెప్పారు.

దేశ పారిశ్రామిక, వాణిజ్య సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అసోచామ్... ఆధార్‌తో అనుసంధాన గడువును మరింత పొడిగించాలని కోరింది. కనీసం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాతాలున్న వారికైనా ఈ విషయంలో వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ఇప్పుడు సిబ్బందిలో ఎక్కువ మంది యుద్ధ ప్రాతిపదికన రుణ ఖాతాల పరిశీలనలో ఉన్నందున, ఆధార్ అనుసంధాన గడువు పొడిగించాలని కోరింది. చాలినంత మంది సిబ్బంది లేకపోవడంతో ఇప్పటికే ఆధార్ సంఖ్య అనుసంధానం కోసం అవసరమైన పత్రాలు సమర్పించిన ఖాతాదారులకూ కేవైసీ కోసం వివరాలు సమర్పించాలని సందేశాలు వస్తున్న విషయాన్ని అసోచామ్ గుర్తు చేసింది.

9పైసలు లాభపడిన రూపాయి



ముంబై: డాలర్‌తో రూపాయి మారకపు విలువ 9పైసలు నిలదొక్కుకుని 65.08 వద్ద నిలిచింది. ట్రంప్ తాజాగా స్టీల్ దిగుమతులపై సుంకం పెంచిన నేపథ్యంలో అంతర్జాతీయ ట్రేడ్ వార్ చోటుచేసుకుందని చెప్పవచ్చు. ట్రంప్ నిర్ణయం అంతర్జాతీయ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. డొమెస్టిక్ ఈక్విటీ మార్కెట్‌లో రూపాయికి అను కూలంగా విదేశీ నిధుల ప్రవాహం చోటు చేసుకోవడంతో ఇతర దేశాల కరెన్సీలతో పోల్చి చూసుకుంటే డాలర్ విలువ తగ్గిందని చెప్పవచ్చు.ప్రొవిజనల్ గణాంకాల నేపథ్యంలో విదేశీ మదుపరులు సుమారు రూ.241. 85 కోట్లు విలువగల షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది.

టాటా మోటార్స్ కొత్త జెస్ట్ ప్రీమియో



ముంబై: ఆటో మొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ తన కాంపాక్ట్ సెడాన్ జెస్ట్‌లో ప్రత్యేక ఎడిషన్‌ను సోమవారం విడుదల చేసింది. 1.3 లీటర్ డీజిల్ ఇంజిన్ 'జెస్ట్ ప్రీమియో' పేరుతో లాంచ్ అయిన ఈ కొత్త కారులో 13 అదనపు ఫీచర్లను జోడించింది. రూ.7.53 లక్షలు (ఎక్స్-షోరూమ్ ఢిల్లీ) ప్రారంభ ధరగా కంపెనీ నిర్ణయిం చింది. దేశంలోని అన్ని టాటా మోటార్స్ రీటైల్ దుకాణాలలో మార్చి 1నుంచి అందు బాటులో ఉంచినట్టు తెలిపింది. టాటా మోటార్స్ 2014 ఆగస్టులో విడుదల చేసినప్పటినుంచీ ఇప్పటివరకు 85వేల యూనిట్లను విక్రయించింది. కస్టమర్ ప్రాధాన్యతలకను గుణంగా తీసుకొచ్చిన తమ స్పెషల్ ఎడిషన్ తప్పకుండా వినియోగదారులను ఆకట్టుకుంటుందనే విశ్వాసాన్ని టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహ నం బిజినెస్ యూనిట్ ప్రెసి డెంట్ మయాంక్ పరీక్ వ్యక్తం చేశారు. డ్యుయల్ టోన్ రూఫ్, ఎక్స్‌టీరియర్ మిర్రర్స్, డాష్‌బోర్డ్ లాంటి కొత్త ప్రీమి యం ఫీచర్లతో పాటు నాలుగు సిలిండర్ డీ 1.3 లీటర్ జిల్ ఇంజిన్, 74 బీహెచ్‌పీ, 190 ఎన్‌ఎం టార్క్, 5-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ ప్రధాన ఫీచర్లుగా ఉన్నాయి. ఇక మార్కెట్‌లో పోటీ విషయానికి వస్తే కొత్త మారుతి డిజైర్, ఫోక్స్‌వ్యాగన్ అమేయో, రాబోయే కొత్త హోండా అమేజ్, ఫోర్డ్ యాస్పైర్ లాంటి గట్టిపోటీ ఇవ్వనుందని అంచనా.

బీజేపీకి పరాభవం తప్పదు : కాంగ్రెస్

న్యూఢిల్లీ: కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీల ఎన్నికల్లో బీజేపీకి ఘోర పరాభవం తప్పదని కాంగ్రెస్ ధీమా వ్యక్తంచేసింది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని కాంగ్రెస్ ఎంపీ రాజీవ్ సతవ్ విశ్వాసం వెలిబుచ్చారు. ఎంత మెజారిటీతో విజయం సాధిస్తామనే అంశంపైనే తాము చర్చలు జరుపుతున్నామని ఆయన ఏఎన్‌ఐతో మాట్లాడుతూ చెప్పారు. ఎంపీ, రాజస్థాన్ సహా కర్ణాటకలోనూ బీజేపీకి పరాజయమేనని అన్నారు. రెండు నెలల్లో కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. మే 28న ఆ అసెంబ్లీ పదవీకాలం పూర్తవుతుంది. మార్చి 20 నుంచి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మూడోవిడత ప్రచారం చేపట్టనున్నారు.

వింగ్స్ ఇండియా 2018లో రోల్స్‌రాయిల్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వింగ్స్ ఇండియా 2018లో రాల్స్ రాయిస్ ట్రెంట్ ఏరో ఇంజన్‌లయిన ట్రెంట్ 7000, ట్రెంట్ 1000, ట్రెంట్ ఎక్స్‌డబ్ల్యూబీ తదితరాలను ప్రదర్శించింది. ఈ సందర్భంగా సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఈవెన్ మెక్ డొనాల్డ్ మాట్లాడుతూ ఇండియాలో పౌరవిమానయాన రంగం శరవేగంగా వృద్ధి వృద్ధి చెందుతున్నదని తెలిపారు. పెరుగుతున్న డిమాండుకు తగ్గట్టుగా తమ ఉత్పత్తులను విడుదల చేస్తామన్నారు. ఈ రంగంలో సాధ్యమైనంత ఎక్కువ మార్కెట్ వాటాను నమోదు చేయడమే లక్ష్యంగా విస్తరణ ప్రణాళికలను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మరింత ఇంధన ఆదాకు ఉపకరించే ఇంజన్‌ల తయారీకి కట్టుబడి ఉన్నామన్నారు.

ఎఫ్‌బీబీ ఉగాది కలెక్షన్ల ఆవిష్కరణ



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలకు సంబంధించి స్థానిక అమీర్‌పేటలోని బిగ్‌బజార్‌లో ఎఫ్‌బీబీ ఒక ఫ్యాషన్ షో ద్వారా "ఉగాది కలెక్షన్"ను ప్రవేశపెట్టింది. ప్రముఖ బాలీవుడ్ నటి అదితి రావ్ హైదరి ఈ కలెక్షన్‌ను ఆవిష్కరించారు. తాజాగా అందిస్తున్న ఎఫ్‌బీబీ ఉగాది కలెక్షన్ ద్వారా ఈ పండుగను మరింత సంతోషంగా జరుపుకునే సందర్భానికి అవసరమైన దుస్తులు, ఉపకరణాలను అందిస్తుందని ఎఫ్‌బీబీ జోనల్ సీఈఓ కేవీ రావు తెలిపారు. ప్రముఖ నటి అదితి రావ్ హైదరి ఎఫ్‌బీబీకి చెందిన సరికొత్త కలెక్షన్‌తో ఎంతో స్టయిలిష్‌గా, అందంగా కనిపిస్తూ, ఈ ఫ్యాషన్ ఈవెంట్‌లో ఎంతో ప్రత్యేకంగా నిలిచారని, అభిమానుల ఆనందాన్ని రెట్టింపుచేస్తూ, అదితి రావ్ హైదరి ఎత్నిక్ వేర్ విభాగంలో ర్యాంప్ వాక్ చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారని తెలిపారు. ఎఫ్‌బీబీ అందిస్తున్న ఉగాది పండుగ కలెక్షన్ ఎంతో అనువుగా, ఘనమైన రంగులతో అందమైన రూపాన్ని అందిస్తూ, ఏ పండుగ సందర్భానికైనా మరింత మెరుపును జోడిస్తుందని వివరించారు. 2008 నుండి ఎఫ్‌బీబీ అందుబాటు ధరలతో భారతదేశంలో ఫ్యాషన్ దుస్తులను అందిస్తున్నదని, భారత్‌ను "థోడా బెర్ స్టయిలిష్'గా మలిచే లక్ష్యంతో, ఎఫ్‌బీబీతో స్టయిలిష్‌గా ఉండడానికి పెద్ద ఖర్చు కాదు అనే తత్వాన్ని పునరుద్ధరించామని చెప్పారు.

షియోమీ నుంచి మరో స్మార్ట్ టీవీ



న్యూఢిల్లీ : తక్కువ ధరకు నాణ్యమైన మొబైల్స్‌ను అందిస్తూ భారత మార్కెట్లో మంచి స్థానం సంపాదించుకున్న షియోమీ... ఇటీవల స్మార్ట్ టీవీల విభాగంలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా ఎంఐ టీవీ 4 మోడల్ స్మార్ట్ టీవీని విడుదల చేసింది. 55 అంగుళాల ఈ స్మార్ట్ టీవీ ధర రూ.39వేలు. తాజాగా ఈ సిరీస్‌లో మరో కొత్త మోడల్‌ను భారత్‌లో విడుదల చేయబోతోంది. ఇటీవల షియోమీ ఇండియా తన ట్విటర్ ఖాతాలో త్వరలో మరో కొత్త మోడల్ రాబోతోందని ప్రకటించింది. తాజాగా ఎంఐ ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీ 4సీ మోడల్‌ను ఈనెల 7న మార్కెట్లోకి ప్రవేశపెట్టబోతున్నట్లు సమాచారం. కంపెనీ వెబ్‌సైట్ ఎంఐ.కామ్‌లో దీని ధర రూ.27,999గా పేర్కొన్నారు. 43 అంగుళాల స్క్రీన్ సైజుతో .. అత్యంత సన్నని ఫుల్ హెచ్‌డీ ప్యానెల్‌తో ఈ స్మార్ట్‌టీవీని రూపొందించారు. 1జీబీ ర్యామ్, 8 జీబీ అంతర్గత మెమెరీ ఉన్నాయి. క్వాడ్ కోర్ టీ 962 64 బిట్ ప్రాసెసర్‌ను అమర్చారు. ఈ టీవీ వైఫై, బ్లూటూత్ 42ను సపోర్ట్ చేస్తుంది. మరోవైపు ఇదే సిరీస్‌లో ఎంఐ టీవీ 4ఏ మోడల్ (40అంగుళాలు)ను విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. మొత్తం మీద భారత్ మార్కెట్లో స్మార్ట్ టీవీ విభాగంలోనూ తనదైన ముద్ర వేసేందుకు షియోమీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా తక్కువ ధరలో స్మార్ట్ టీవీలను విడుదలకు ప్రయత్నిస్తోంది.

బాల్‌ప్లాంట్





ప్రకృతిలో ఎన్నో వింతలు చోటుచేసుకుంటాయి. మన చుట్టూ ఉన్న మొక్కలని గమనిస్తే, ఎన్నో రకాల మొక్కలు కనిపిస్తాయి. కొన్ని చెయ్యి తగలగానే ముడుచుకుపోతాయి. వాటిని టచ్‌మీనాట్ (లేక) అత్తపత్తి మొక్కలు అని పిలుస్తారు. ఇంకొన్ని మొక్కలు చూడటానికి ఎండిపోయిన బంతిలా ఉంటాయి. కానీ ఇవి మొక్కలలా అనిపించవు. ఎండిన మొక్కలన్నింటిని ఒక ఉండ చుడితే ఎలా ఉంటుందో అలా ఉండలా కనబడుతుంది. దీన్ని మొక్కంటే ఎవరూ నమ్మరు. కానీ నీటిని చిలకరించగానే పచ్చగా మారుతుంది. అయితే ఈ మొక్కలు ప్రకృతిలో అక్కడక్కడా కనిపిస్తూనే ఉంటాయి. మనం ఎప్పుడైనా బజారుకు వెళ్ళినపుడు మొక్కల నర్సరీల దగ్గర ఈ మొక్కలు కనిపిస్తుంటాయి.

చూడటానికి ఎండుటాకుల బంతిలా ఉండి, నీరు తగలగానే పచ్చగా మారే మొక్క గురించి తెలుసుకుందాం. ఇది బ్రాసికేసియా కుటుంబానికి చెందినది. అనాస్టాటికా దీని శాస్త్రీయనామం. సహారా ఎడారి, ఈజిప్ట్, పాలస్తీనా, ఇరాక్, జోర్డాన్, సిరియా, ఇజ్రాయిల్‌లో కనిపిస్తుంది. మన ప్రాంతాలలో కూడా పొడి ప్రదేశాలలో అక్కడక్కడా కనబడుతుంది. ఈ మొక్క చూడటానికి గుల్మంలా పెరుగుతుంది. దీన్ని 'రోజ్ ఆఫ్ జెరిచో' అని పిలుస్తారు. పొడినేలల్లో ఎక్కువగా పెరుగుతుంది. చాలాసార్లు నీళ్ళు దొరకక పోవటం వలన దీని ఆకులన్నీ ఎండినట్లుగా ఉండి గుండ్రటి బంతిలా చుట్టుకుపోతుంది. అయితే ఇది ముడుచుకోవటానికి కారణం ఉంది. దీనిలోని జీవాన్ని దాచుకునేందుకే ఇదిలా నిద్రాణ స్థితిలోకి చేరుకుంటుంది. దీనికి కావాల్సిన తేమ తగలగానే ఈ బంతి అంచెలంచెలుగా విప్పారుతుంది. చక్కగా పచ్చని ఆకుల్ని విచ్చుకుని గుండ్రటి పువ్వులా అందంగా మారి పోతుంది. ఇది అడుగు పొడవు మాత్రమే పెరుగుతుంది. దీనికి ఎన్నో పేర్లున్నాయి. ట్రూరోజ్ ఆఫ్ జెరిచో, వైట్‌మస్టర్డ్, ఫ్లవర్ ఆఫ్ సెయింట్ మేరీ, మార్యమ్స్ ఫ్లవర్ అని ఇలా ఎన్నెన్నో పేర్లున్నాయి.

అమెరికా, మెక్సికోల్లోని ఎడారులు ఈ మొక్కల జన్మస్థానాలు. ఎండిన బంతుల్లా ఉండే వీటిని బజారుల్లో అమ్ముతుంటారు. వీటికి వేళ్ళు బాగా ఉండాలి. లేకపోతే పూర్తిగా పచ్చగా కనబడవు. సగం ఎండిపోయినట్లే ఉంటాయి. వీటిని అలంకరణ కోసం పెంచుకుంటారు. ఇండోర్ ప్లాంట్స్‌గా కూడా పెంచుతారు. ఎక్కువ స్థలాన్ని ఆక్రమించవు. చిన్నచిన్న కుండీలలో పెంచి ఇంటిలో పచ్చదనాన్ని చూసుకోవచ్చు.

ఎందుకంటే కంటికి పచ్చని వర్ణం మంచిది. అంతేకాదు ఈ మొక్కలను పెంచటం వలన మన ఇంటి పరిసరాలలో ఉండే బొగ్గుపులుసు వాయువు లాంటి చెడువాయువుల శాతం తగ్గు తుంది. నీటి ఖర్చు కూడా తక్కువే. కనుక ఈ మొక్కలను తేలికగా పెంచుకోవచ్చు. కాలుష్యాన్ని కొంత వరకు తగ్గించటానికి మన వంతు కృషి చేసిన వారమవుతాము.

రెడ్ షిఫ్ట్, వయొలెట్ షిఫ్ట్ అంటే....



మన ప్రకృతి చాలా అందంగా వుంటుంది. కొంతమంది కవులు ప్రకృతి వర్ణనను చాలా అద్భుతంగా వర్ణించారు కూడా. ప్రకృతిలో అనేక రకాల వింతలు, విడ్డూరాలు చాలా వున్నాయి. అలాగే విశ్వంలో కూడా చాలా విచిత్రాలు జరుగుతూవుంటాయి. విశ్వంలో కూడా మానవుడు ఎన్నో విషయాలను కనుగొన్నాడు. కొంతమంది శాస్త్రవేత్తలు ఖగోళ విషయాలను చాలా చక్కగా తమ పరిశోధనల ద్వారా చెప్పారు.మనం చీకటి రాత్రులందు ఆకాశంలోకి చూస్తే మినుకు మినుకు మంటూ నక్షత్రాలు కన్పిస్తాయి. ఆ నక్షత్రాలు భూమి వైపు కొన్ని వస్తున్నట్లు వుంటే, మరికొన్ని దూరంగా జరిగిపోతున్నట్లు వుంటాయి. మన వైపు వచ్చే వాటి వేగాన్ని, దూరంగా పోయేవాటి వేగాన్ని కనిపెట్టటానికి " రెడ్ షిఫ్ట్, వయొలెట్ షిఫ్ట్" లు తోడ్పడతాయి. నక్షత్రాల బరువును, నక్షత్రాలు భూమి నుండి వున్న దూరాన్ని కూడా కనిపెట్టవచ్చు. అలాగే నక్షత్రాలలోని ఉష్ణాన్ని కనిపెడతారు. దీనికి సహాయపడేది " స్పెక్ట్రోగ్రాఫ్ " అనే పరికరం. ఈ పరికరం తయారీకి మూలం న్యూటన్ కనిపెట్టిన వర్ణమాల (స్పెక్ట్రమ్). మనకు కనిపించే సూర్యుని తెల్లని కాంతిలో ఏడురంగులున్నాయని 1667లో న్యూటన్ కనుగొన్నాడు. ఈ పనికి ఆయన 'పట్టకం' (ప్రిజమ్) వాడాడు. పట్టకంలో నుండి చూసినప్పుడు సూర్యుని కాంతి ఏడురంగులుగా విడిపోతుందనుకున్నాం. పట్టకం పీఠం వైపు ముందుగా "ఊదా" (వైలెట్) రంగు వస్తుంది. తరువాత వరుసగా నీలం, (ఇండిగో), ఆకాశరంగు (బ్లూ), ఆకుపచ్చ (గ్రీన్), పసుపు పచ్చ (ఎల్లో), నారింజ (ఆరెంజ్) ఎరుపు (రెడ్) రంగులు వస్తాయి. కాంతి తరంగాల రూపంలో ప్రయాణం చేస్తుంది. వాటినే "ఎలక్ట్రోమేగ్నటిక్ తరంగాలు" అంటారు. అన్నింటిలోకి వయొలెట్ రంగుకాంతి తరంగం పొట్టిగా వుంటుంది. అంటే ఎక్కువ వక్రీభవనం చెందుతుందన్నమాట.వీటి తరంగాలు వరుసగా ఒక్క దాని కన్నా ఒక్కటి పొడవుగా వుంటాయి. చివరనున్న ఎరుపు తరంగాలు అన్నిటికంటే పొడవుగా వుంటాయి.స్పెక్ట్రోగ్రాఫ్ ఉపయోగించి నక్షత్రాల కాంతిని వేరు వేరు రంగుల కాంతిగా విడదీసి ఫోటో తీస్తారు. దానిని బట్టి నక్షత్రం వేగాన్ని, బరువును, ఉష్ణోగ్రతను కనిపెడతారు. నక్షత్రం భూమి వైపు వస్తున్నదనుకోండి. దాని కాంతి స్పెక్ట్రమ్‌లోని తరంగాలన్నీ వయొలెట్ వైపు జరిగి వుంటాయి. అవి అంతకంతకూ పొట్టివవుతూవుంటాయన్నమాట. ఇలా నక్షత్రం సమీపించటాన్ని వయొలెట్ రంగు తెలుపుతుంది. దీనినే "వయొలెట్ షిఫ్ట్" అంటారు. నక్షత్రం భూమి నుండి దూరంగా పోతుందనుకోండి. అప్పుడు దాని కాంతి తరంగాలు పొడవుగా వుంటాయి. అవి ఎరుపు వైపు తిరిగి వుంటాయి. దీనినే "రెడ్ షిఫ్ట్" అంటారు.

ఫ్రాన్స్ హోఫర్ రేఖలు అంటే.....



మన ఖగోళ శాస్త్రవేత్తలు నక్షత్రాల గురించీ, అలాగే సూర్యుడి గురించీ ఎన్నెన్నో విషయాలను ప్రపంచానికి తెలియజేసారు. ఇంకా మరికొన్ని విషయాలు తెలుసుకోవటానికి పరిశోధనలు కొనసాగిస్తున్నారు. అలా తెలుసుకోవటానికి రకరకాల సాధనాలు ఉపయోగపడుతున్నాయి. మన భూమి మీద ఉన్నట్లే అక్కడా "ధాతువులు" (ఎలిమెంట్స్) వాయువులు వున్నట్లు కనుగొన్నారు. ఆ ధాతువులు, వాయువులు ఎంతెంత శాతంలో వున్నాయోకూడా కనిపెడుతున్నారు. ఇలా వాటి ఉనికి తెలుసుకోవటానికి "స్పెక్ట్రమ్"లోని నల్లని రేఖలు ఉపయోగిస్తున్నారు. ఈ నల్లని రేఖల ఉనికిని కనిపెట్టినవాడు జర్మన్ శాస్రవేత్త జోసఫ్ వాన్ ఫ్రాన్ హోఫర్. అందుకే ఆయన పేరు మీదుగా ఆ రేఖలు "ఫ్రాన్స్ హోఫర్ రేఖలు" అని పిలవబడుతున్నాయి. తెల్లని సూర్యకాంతి వుంది. అది ప్రిజమ్ ద్వారా ప్రసరిస్తుందనుకోండి. ఆ కాంతి ఏడు రంగులుగా విడిపోతుంది. ఈ విషయం న్యూటన్ కనుగొన్నాడు. ఆ కాలంలో తగిన సాధన సంపత్తి లేదు. కాలం గడుస్తున్న కొద్ది సున్నితమైన పరికరాలు రూపుదిద్దుకున్నాయి. వాటితో ఎన్నెన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయి. అటువంటి పరికరం సహాయంతో ఫ్రాన్స్ హోఫర్ సూర్యకాంతి స్పెక్ట్రమ్‌ను పరిశీలించాడు. అప్పుడు ఆయన మధ్యమధ్యలో వున్న నల్లని రేఖలను కనుగొన్నాడు. స్పెక్ట్రమ్‌లో ఏడురంగులు వున్నాయి. ఆ రంగుకు సంబంధించిన ప్రకాశవంతమైన రేఖలు వుండాలి. కాని, నల్లని రేఖలు వున్నాయి. ఇలా ఎందుకు వుంటున్నాయి? అని వీటి మీద పరిశోధనలు చేసి కొన్ని జవాబులు కనుగొన్నారు శాస్త్రవేత్తలు. సూర్యుని ఉపరితలం నుండి సూర్యకాంతి ప్రయాణించి వస్తుంది. దారిలో సూర్య వాతావరణంలో వివిధ వాయువులు వుంటాయి. వాటినుండి కాంతి కిరణాలు దూసుకు వస్తాయి. ఆ వాయువులు ఎన్నో ధాతువులకు చెందినవి. ఒక్కొక్క రకం ధాతువుకు చెందిన వాయువులు ఒక్కొక్క తరంగ దైర్ఘ్యత్వం కలిగిన కాంతిని విలీనం చేసుకోగలవు. ఇలా రంగు సూర్యకాంతిలో విలీనమైనప్పుడు స్పెక్ట్రమ్‌లో ఆస్థానంలో నల్లని రేఖలు ఏర్పడతాయి. ధాతువులకు రంగు వుంటుంది. నల్లని రేఖలు ఏరంగు స్థానంలో వున్నాయో కనుక్కొని ఆ వాయువులు సూర్యుని వాతావరణంలో వున్నాయని తెలుసుకుంటారు. రేఖల సాంద్రతను బట్టి వాయువులు ఎంతెంత వుంటాయో కూడా తెలుసుకుంటారు.



30న రంగస్థలం

రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవెయిటింగ్ మూవీ రంగస్థలం. సమంత హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. దాదాపు ఏడాదిగా షూటింగ్ జరుపుకున్న రంగస్థలం సినిమా షూటింగ్ పూర్తిచేసుకుంది. సారథి స్టుడియోస్, బూత్ బంగ్లా వద్ద షూట్ చేసిన కొంత ప్యాచ్ వర్క్‌తో ఈ సినిమా టోటల్ షూటింగ్ పూర్తయింది. రంగస్థలంలో రామ్ చరణ్ డిఫరెంట్ గా కనిపించబోతున్నాడు. చిట్టిబాబు అనే పాత్రలో చెవిటివాడిగా నటిస్తున్నాడు. చరణ్ లుక్, అతడి క్యారెక్టర్‌ను రివీల్ చేస్తూ ఇప్పటికే టీజర్ వచ్చింది. ఇక సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్న సమంత లుక్ ను కూడా మరో టీజర్ ద్వారా రివీల్ చేశారు. రామలక్ష్మి పాత్రలో పల్లెటూరి పిల్లగా సమంత నేచురల్‌గా ఉంది. హీరోహీరోయిన్ల లుక్స్‌తో పాటు త్వరలోనే మరింతమంది నటీనటుల లుక్స్, క్యారెక్టర్లను రివీల్ చేయబోతున్నారు. 1980ల నాటి కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అప్పటి వాతావరణాన్ని ప్రతిబింబించేలా పల్లెటూరి సెట్ వేశారు. మార్చి 18న రంగస్థలం ప్రీ-రిలీజ్ ఫంక్షన్‌ను వైజాగ్‌లో నిర్వహించనున్నారు. ఇక మూవీని మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా భారీఎత్తున విడుదల చేస్తున్నారు.

విజయ్ దేవరకొండ హీరోగా
జ్ఞానవేల్ రాజా స్టూడియో గ్రీన్ చిత్రం ప్రారంభం



'పెళ్లిచూపులు' చిత్రంతో ఒక్కసారిగా లైమ్ లైట్‌లోకి వచ్చిన విజయ్ దేవరకొండ మలి చిత్రం 'అర్జున్‌రెడ్డి'తో వరల్డ్‌వైడ్‌గా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఈ చిత్రం సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ అవడంతో విజయ్ దేవరకొండకి యూత్‌లో విశేషమైన క్రేజ్ ఏర్పడింది. కేవలం రెండు చిత్రాలతో ఇంతటి క్రేజ్‌ని, ఖ్యాతిని సంపాదించుకున్న విజయ్ దేవర కొండ నిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ హీరో అయ్యారు. తాజాగా విజయ్ దేవరకొండ హీరోగా మెహరీన్ హీరోయిన్‌గా 'ఇంకొక్కడు' ఫేమ్ ఆనంద్ శంకర్ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ పతాకంపై కె.ఇ. జ్ఞానవేల్ రాజా తెలుగు, తమిళ్‌లో నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం. 14 చిత్రం మార్చి 5న హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, కె.ఎస్.రామారావు, బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, మైత్రి మూవీస్ అధినేతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, స్వప్న దత్, ప్రముఖ దర్శకులు వంశీ పైడిపల్లి, మెహర్ రమేష్, సందీప్ రెడ్డి వంగ పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మెహరీన్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, సందీప్ రెడ్డి వంగ కెమెరా స్విచాన్ చేశారు. అనంతరం ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మెహరీన్ దర్శకుడు ఆనంద్ శంకర్, నిర్మాత కె.ఇ. జ్ఞానవేల్ రాజా, కెమెరామెన్ శాంత, ఆర్ట్ డైరెక్టర్ కిరణ్, డిజైనర్ శ్రావ్య పాల్గొన్నారు.

హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ - "రోజులు చాలా ఫాస్ట్‌గా గడిచిపోతున్నాయి. ఇప్పుడిప్పుడే యాక్టింగ్ నేర్చుకుంటున్నాను. స్టూడియో గ్రీన్ కె.ఇ. జ్ఞానవేల్ రాజాగారి బేనర్‌లో సినిమా చేస్తున్నందుకు చాలా ప్రౌడ్‌గా ఫీలవుతున్నాను. స్క్రిప్ట్ వినగానే చాలా ఎగ్జైట్ అయ్యాను. ఫస్ట్‌టైమ్ తెలుగు, తమిళ్‌లో సినిమా చేస్తున్నాను. సినిమా ఎప్పుడెప్పుడు చెయ్యాలా అని యాంగ్జైటింగ్‌గా వుంది. బోర్డ్ ఎగ్జామ్స్ రాస్తున్నప్పుడు ఎంత టెన్షన్ పడ్డానో అంతే టెన్షన్‌గా అనిపిస్తుంది. డేట్స్ లేకపోయినప్పటికీ స్క్రిప్ట్ నచ్చడంతో.. ఎలాగైనా సినిమా చేయాలని డేట్స్ అడ్జస్ట్ చేసి సినిమాకి ఓకే చెప్పాను. స్క్రిప్ట్ ఖతర్నాక్‌గా వుంది. యంగ్ టాలెంటెడ్ టీమ్‌తో వర్క్ చేస్తున్నందుకు చాలా హ్యాపీగా వుంది" అన్నారు.

నిర్మాత కె.ఇ. జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ 'అర్జున్‌రెడ్డి' మూవీ ఐదుసార్లు థియేటర్‌లో చూశాను. విజయ్ దేవరకొండ అమేజింగ్ యాక్టర్. స్టూడియో గ్రీన్ బేనర్‌లో ఫస్ట్‌టైమ్ డైరెక్ట్ తెలుగు సినిమా విజయ్ దేవరకొండతో చేస్తున్నందుకు చాలా హ్యాపీగా వుంది. మా ఫస్ట్ ఫిలిం హీరో విజయ్. ఆనంద్ శంకర్ బిగ్ మూవీస్ చేశారు. స్క్రిప్ట్ విని చాలా ఇంప్రెస్ అయ్యాను. ఈ కథకి విజయ్ అయితే కరెక్ట్ యాప్ట్ అని నమ్మి సినిమా తీస్తున్నా. శాంత కెమెరా, సి.ఎస్. శ్యాం మ్యూజిక్, ఆర్ట్ కిరణ్ అంతా బిగ్ మూవీస్‌కి వర్క్ చేసిన టెక్నీషియన్స్ ఈ సినిమాకి వర్క్ చేస్తున్నారు. మార్చి 8 నుండి ఫస్ట్ షెడ్యూల్ హైదరాబాద్‌లో చేసి సెకండ్ షెడ్యూల్ చెన్నైలో చేస్తాం" అన్నారు. దర్శకుడు ఆనంద్ శంకర్ మాట్లాడుతూ - 'విక్ర మ్‌తో 'ఇంకొక్కడు' సినిమా తర్వాత తెలుగు ప్రేక్షకులను మరోసారి పలకరించబోతున్నాను. చెన్నైలో 'అర్జున్‌రెడ్డి' మూవీ చూశాను. బాగా నచ్చింది. ఆ సినిమా అన్ని భాషల్లో మంచి హిట్ అయ్యింది. విజయ్ దేవరకొండ పెర్‌ఫార్మెన్స్‌కు గ్రేట్ అప్రిషియేషన్ వచ్చింది. తను ఈ స్క్రిప్ట్ విని ఎగ్జైట్ అయ్యాడు. తమిళ్ నేర్చుకొని డైలాగ్స్ చెబుతా అన్నాడు. అది తన కమిట్‌మెంట్ ఏంటో చెబుతుంది. చాలా ప్యాషనేట్ హీరో. జ్ఞానవేల్ రాజా బిగ్ ప్రొడ్యూసర్. రవి కె.చంద్రన్ సన్ శాంత ఈ సినిమాకి డి.ఓ.పి చేస్తున్నాడు. సత్యరాజ్, నాజర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు, తమిళ్ ప్రేక్షకులకు నచ్చేవిధంగా ఈ చిత్రం వుంటుంది'' అన్నారు.

హీరోయిన్ మెహరీన్ మాట్లాడుతూ - 'విజయ్ దేవరకొండతో ఇటీవల ఒక హోలి సాంగ్‌లో నటించాను. వెంటనే ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్ హీరోయిన్‌గా ఈ చిత్రంలో నటిస్తున్నాను. వెరీ డెడికేటెడ్ యాక్టర్. ఆనంద్ శంకర్ స్క్రిప్ట్ నేరేట్ చేయగానే చాలా ఎగ్జైట్ అయ్యాను. స్టూడియో గ్రీన్‌లో ఈ సినిమా చేస్తున్నందుకు చాలా హ్యాపీగా వుంది" అన్నారు. విజయ్ దేవరకొండ, మెహరీన్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, నాజర్ ముఖ్య పాత్రలు పోషిస్తుండగా ఈ చిత్రానికి సంగీతం: సి.ఎస్. శ్యాం, కెమెరా: శాంత, ఆర్ట్: కిరణ్, కాస్ట్యూమ్ డిజైనర్: శ్రావ్య, దర్శకత్వం: ఆనంద్ శంకర్, నిర్మాత: కె.ఇ. జ్ఞానవేల్ రాజా.

అల్లు అర్జున్ సినిమాలో నదియా



మలయాళ నటి నదియా 'మిర్చి' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో రీ-ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక అదే సంవత్సరంలో విడుదలైన పవన్ కళ్యాణ్ 'అత్తారింటికి దారేది' చిత్రంలో పవన్‌కు మేనత్త పాత్రలో నటించారు. రెండేళ్ల తర్వాత మరో మెగా హీరో మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్‌తో 'బ్రూస్ లీ' చిత్రంలో కూడా ఆమె ముఖ్య భూమికను పోషించారు. కట్ చేస్తే.. మూడు సంవత్సరాల తర్వాత మరో మెగా హీరో చిత్రంలో నదియా సందడి చేయనున్నారు. ఆ హీరో అల్లు అర్జున్ కాగా.. ఆ చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. ఇందులో కూడా నదియా ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. వక్కంతం వంశీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 4న విడుదల కానుంది.

ఎన్టీఆర్ తల్లిగా ఒకప్పటి హీరోయిన్

యంగ్ టైగర్ ఎన్టీఆర్, త్రివిక్రమ్ దర్శకత్వంలో సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో కొత్త లుక్ కోసం ఎన్టీఆర్ తెగ కసరత్తులు చేసేస్తున్నాడు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్.రాధాకృష్ణ నిర్మాణంలో ఈ సినిమా రూపొందనుంది. ఈ సినిమాలో హీరో తల్లిపాత్ర కోసం పలువురు సీనియర్ హీరోయిన్స్ పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఇప్పుడు యూనిట్ వర్గాల ఒకప్పుడు హీరోయిన్‌గా సినిమాల్లో నటించిన లయను సంప్రదించారని అంటున్నారు. త్వరలోనే దీనిపై ఓ క్లారిటీ రానుంది.

విశాలాంధ్ర సినిమా



నిఖిల్ సరసన హన్సిక

యువ కథానాయకుడు నిఖిల్ హీరోగా తమిళ చిత్రం కణిదన్ ను తెలుగులో రీమేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. తమిళ కణిదన్‌ను తెరకెక్కించిన సంతోశ్ తెలుగులో కూడా తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ సినిమాలో నిఖిల్ సరసన నటించబోయే హీరోయిన్ విషయంలో యూనిట్ చాలా ప్రయత్నాలే చేసింది. నిఖిల్ పక్కన నటించబోయే హీరోయిన్ ఎవరనే దానిపై పలువురి పేర్లు ప్రస్తావనలోకి వచ్చాయి. ఇలాంటి నేపథ్యంలో నిఖిల్ జోడిగా హన్సిక నటించనుందట.

శ్రీకాంత్ స్థానంలో ప్రకాశ్ రాజ్

సీనియర్ హీరో శ్రీకాంత్ స్థానంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ నటించబోతున్నాడని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇంతకు ఆ సినిమా ఏంటనే వివరాల్లోకి వెళితే.. నితిన్ హీరోగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో శ్రీనివాస కల్యాణం సినిమా రూపొందనున్న సంగతి తెలి సిందే. దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబం ధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో నితిన్ జోడిగా రాశీఖన్నా నటించనుంది. రాశీ ఖన్నా తండ్రి పాత్రలో నటించమని ముందు శ్రీకాంత్‌ను యూనిట్ వర్గాలు సంప్రదించాయి. అయితే శ్రీకాంత్‌కి కుదరకపోవడంతో.. సింపుల్‌గా నో చెప్పేశాడట. దాంతో ఇప్పుడు ఆ స్థానంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ నటించబోతున్నాడట..

నారా రోహిత్ భార్య పాత్రలో ఇషా రెబ్బ

తేజ దర్శకత్వంలో వెంకటేష్ నటించబోతున్న సినిమాకు ఆటా నాదే వేటా నాదే అనే టైటిల్ పరిశీలనలో ఉంది. వెంకటేష్‌తో జోడిగా శ్రియ ఈ సినిమాలో నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజా సమాచారం మేరకు హీరోయిన్ ఇషా రెబ్బ ఈ సినిమాలో నటించబోతోందని తెలుస్తోంది. నారారోహిత్ కు భార్య పాత్రలో ఇషా కనిపించబోతుందట. ఈ నెల 12నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమాకు అనుప్ రూబెన్స్ సంగీతం అందిస్తుండగా, రామానుజం సినిమాటోగ్రఫి అందిస్తున్నాడు. అనుకున్న షెడ్యూల్ ప్రకారం షూటింగ్ ఫినిష్ చేసి ఈ ఏడాది చివర్లో చిత్రాన్ని విడుదల చేసే ఆలోచనలో నిర్మాతలు ఉన్నారు . సురేష్ బాబు, అనిల్ సుంకర సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించబోతున్నారు



శర్వానంద్ 'పడిపడి లేచె మనసు'

హను రాఘవపూడి దర్శకత్వంలో శర్వానంద్ నటిస్తోన్న సినిమా ఇటీవల పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. ఈ సినిమాలో శర్వానంద్ ఆర్మీ ఆఫీసర్‌గా కనిపించనున్నాడని సమాచారం. ఈ సినిమాకు పడిపడిలేచె మనసు టైటిల్ పరిశీలనలో ఉందని గతంలో వార్తలు వచ్చాయి. తాజా సమాచారం మేరకు పడిపడి లేచె మనసు టైటిల్ ఖరారు చేశారు చిత్ర యూనిట్. అదే టైటిల్‌ను విడుదల చెయ్యబోతున్నారు దర్శక నిర్మాతలు. విశాల్ చంద్ర శేఖర్ ఈ సినిమాకు సంగీతం అందించబోతున్నాడు. రెండు విభిన్న పాత్రల్లో శర్వానంద్ ఈ మూవీలో కనిపించబోతున్నాడు. శర్వానంద్ సరసన సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.

రాజస్థాన్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల వాకౌట్

జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ సభ్యులు వాకౌట్‌చేశారు. రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తున్నందుకు నిరసనగా వారు వాక్ అవుట్ చేశారు. చేతికి వచ్చిన పైరు అకాల వర్షాలు, వడగళ్లవానలతో నాశనం అయ్యాయని కాంగ్రెస్ చీవ్‌విప్ గోవింద్‌సింగ్ ప్రశ్నోత్తర సమయంలో ప్రస్తావించారు. అయితే సభా కార్యక్రమాలు సరిగా జరిపించాలని స్పీకర్ కైలాష్ మేఘ్వాల్ కాంగ్రెస్ సభ్యులను కోరడంతో వారు వెల్‌లోకి దూకి సభాకార్యక్రమాలకు అంతరాయం కలిగించారు. రైతుల సమస్యలను కాంగ్రెస్ స్వప్రయోజనాల కోసం వాడుకుంటుందని హోంమంత్రి గులాబ్ చంద్ కటారియా విమర్శిస్తూ ముఖ్యమంత్రి వసుంధరారాజె సింధియా పంటనష్టంపై నివేదిక ఇవ్వాలని కోరారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సభాముఖంగా తెలిపారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే వాయిదా తీర్మానంలో ఈ విషయాన్ని లేవనెత్తాలని, ప్రభుత్వం రైతు సమస్యలపై చర్చించడానికి సిద్ధంగా ఉందని కాంగ్రెస్ సభ్యులు దీనిపై సిగ్గుపడాలని కటారియా విమర్శించారు.

ఎస్ఎస్‌సీ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు

న్యూఢిల్లీ : స్టాఫ్ సెలక్షన్ కమిటీ (ఎస్ఎస్‌సీ) పేపర్ లీక్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తో విచారణకు కేంద్రం అనుమతించింది. ఎస్ఎస్‌సీ అభ్యర్థులు ఆందోళన నిర్వహించడంలో లీక్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అభ్యర్థుల కోరికను మన్నించి సీబీఐ విచారణకు అనుమతించినందున ఆందోళనను విరమించాలని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కోరారు. కాంగ్రెస్ సభ్యుడు శశిథరూర్ కూడా విద్యార్థులు ఆందోళనను విరమించాలని ట్విటర్‌లో కోరారు. మార్చి 12న ఎస్ఎస్‌సీ పేపర్ లీక్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఢిల్లీ వీధుల్లో ఎస్ఎస్‌సీ అభ్యర్థులు బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27 నుంచి నిరసన ఆందోళనలు చేపట్టారు. ఫిబ్రవరి 21న నిర్వహించాల్సిన పరీక్షను సాంకేతిక కారణాలతో మార్చి 9న నిర్వహిస్తామని ఫిబ్రవరి 24న ఎస్ఎస్‌సీ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే.

పీఎన్‌బీ అక్రమాలపై

దద్దరిల్లిన పార్లమెంట్

- ఉభయ సభలు నేటికి వాయిదా
- రాజ్యసభ వెల్ వద్దకు దూసుకువచ్చిన సభ్యులు
- కావేరీ జల నిర్వహణ బోర్డుకు తమిళ ఎంపీల డిమాండు



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో వెలుగుచూసిన రూ. 12,700 కోట్ల కుంభకోణంపై ప్రతి పక్షాలు, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ఎన్డీయే మిత్రపక్షం టీడీపీ డిమాండు చేయడంతో పార్లమెంట్ ఉభయ సభల్లో నేడు తీవ్ర గందరగోళ దృశ్యాలు నెలకొన్నాయి. దానితో ఉభయ సభలు మంగళవారానికి వాయిదాపడ్డాయి. పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి.

ఉదయం లోక్‌సభ ప్రారంభమైన తరువాత బ్యాంకిం గ్ కుంభకోణంపై చర్చ జరగాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండు చేయడంతో అనేక సార్లు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. దానితో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదావేశారు.

ఈ రోజు సభ మొదటి సెషన్‌లో అనేక వాయిదాలు పడినా పరిస్థితి మారలేదు. వాయిదా అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభంకాగా ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాల్సిందేనంటూ ఏపీ ఎంపీలు సభలో ఆందోళన చేపట్టారు. ఛైరన్మన్ వెల్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. డిప్యూటీ ఛైర్మన్ కురియన్ ఎంతగా వారించినా సభ్యులు వినిపించుకోలేదు. ఇదే సమయంలో కావేరీ జల వివాదంపై అన్నాడీఎంకే సభ్యులు సైతం ఆందోళన చేపట్టడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ ఛైర్మన్ కురియన్ ప్రకటించారు. సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లి రూ. 12,700 కోట్ల మేర పీఎన్‌బీ కుంభకోణం అంశాన్ని ప్రస్తావించారు. ఈ కుంభకోణానికి ప్రధాన సూత్రధారి అయిన వజ్రాల వ్యాపారి నిరవ్ మోడీని వెంటనే శిక్షించాలని డిమాండు చేశారు. కావేరి జల నిర్వహణ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. "నిరవ్ మోడీని వెనుకకు తీసుకురావాలి" వంటి నినాదాలు చేశారు. దానితో సభాధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ శాంతించవలసిందిగా సభ్యులను కోరారు. సభా కార్యక్ర మాలు జరగనివ్వాలని అన్నారు. "మీరంతా చేర్వేరు అంశాలపై ఆందోళన చేస్తున్నారు. ఒక్కొక్క అంశం చాలా ముఖ్యమైనదన్న విషయం నాకు తెలుసు" అని కురియన్ వ్యాఖ్యానించినప్పటికీ సభ్యులు ఆందోళన కొనసాగించారు. సభ్యులు కనుక అనుమతిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని అక్రమాలపై స్వల్పకాలిక చర్చ నిర్వహించుకోవచ్చు, ఆ తరువాత వివిధ అంశాలను ఒకదాని తరువాత ఒకటి చర్చించుకోవచ్చునని కురియన్ అన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో అక్రమాలపై చర్చకు ఈ రోజు అనుమతి స్తానని చెప్పారు. అయినప్పటికీ సభ్యులు "కావేరి నిర్వహణ బోర్డును తక్షణం నియ మించాలి", "మీ హామీలను నెరవేర్చండి", "ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కేటగిరి హోదా కల్పించాలి.." అని సభ్యులు ప్లకార్డులను చేబూని అవిశ్రాంతంగా నినాదాలు చేశారు. ఇది 'క్రమశిక్షణా రాహిత్యం"గా కురియన్ పేర్కొన్నారు. చర్చకు కాంగ్రెస్ పార్టీ అనుమతిస్తుందా? అని ప్రతిపక్ష నాయకుడు గులాంనబీ ఆజాద్‌ను కురియన్ ప్రశ్నించారు. ఇతర పార్టీలు సిద్ధమైతే మాకేమి అభ్యంతరం లేదని ఆజాద్ సమాధానమిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ప్రభుత్వం విఫలమయ్యాయి, బ్యాంకుల్లో డబ్బులేదు, నిరవ్ మోడీ వంటి వారు తప్పించుకుతిరుగుతున్నారని ఆయన అన్నారు. ఆ తరువాత కురియన్ సభను వాయిదావేశారు.

అంతకుముందు సభా కార్యక్రమాలకు రెండుసార్లు అంతరాయం కలిగింది. మొదటి సారి పది నిముషాలు, రెండో సారి మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదాపడింది. తృణమూల్ కాంగ్రెస్, ఇతర పార్టీలు దేశంలోనే అత్యంత పెద్దదైన బ్యాంకు కుంభకోణం అంశాన్ని ప్రస్తావించాయి. ఏఐఏడీఎంకే, డీఎంకే కావేరి జల నిర్వహణ బోర్డును ఏర్పాటు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండు చేశారు. విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీడీపీ, కాంగ్రెస్ సభ్యులు డిమాండు చేశారు.

అక్రమాలపై చర్చిద్దాం

బ్యాంకుల్లో అక్రమాలపై మంగళవారం లోక్‌సభలో చర్చించాలని ప్రధాన ప్రతిపక్షాలు నేడు ప్రభుత్వాన్ని డిమాండు చేశాయి. ఆ తరువాతనే ఇతర అంశాలను చర్చించాలని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. లోక్‌సభ సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీజేడీ సభ్యులు 'బ్యాంకుల అక్రమాల'పై చర్చించాలని పట్టుబట్టారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ అంశంపై చర్చ చేపట్టాలని నాలుగు గంటలపాటు చర్చ జరగాలని, ఆ తరువాతే ఇతర అంశాలు చర్చించాలని అన్నారు. ఈ సమావేశానికి హాజరైన ఒక ప్రతిపక్ష సభ్యుడు మాట్లాడుతూ, అన్ని అంశాలపై చర్చ జరగాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ స్పష్టం చేశారని, రేపు ప్రశ్నోత్తరాల సమయం తరువాత బ్యాంకింగ్ కుంభకోణంపై చర్చ జరుగుతుందా? లేదా? అన్న విషయాన్ని స్పష్టం చేయలేదని చెప్పారు.

6కు పెరిగిన షోపియాన్ మృతులు

శ్రీనగర్ : దక్షిణ కాశ్మీర్‌లోని షోపియాన్‌లో మృతుల సంఖ్య 6కు పెరిగింది. సోమవారం మరో ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకోవడంతో మృతుల సంఖ్య పెరిగిందని పోలీసు అధికార ప్రతినిధి తెలిపారు. లష్కర్-ఇ- తోయిబాకు చెందిన అశిఖ్ హుస్సేన్ భట్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మొబైల్ చెక్ పోస్టు వద్ద రెండు వాహనాలు ఆపకుండా పారిపోవడంతో వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. భట్, రఖ్ కార్పాన్‌కు చెందినవాడు కాగ, మృతదేహం ప్రక్కన షోపియాన్‌లోని చిత్రాగమ్‌లో గౌహర్ అహ్మద్ అనే సాధారణ పౌరుడి మృతదేహం కూడా కనుగొన్నారు. భద్రతాదళాలకు చెందిన మొబైల్ చెక్‌పాయింట్ వద్ద ఒక మిలిటెంటుతోపాటు మరో ఇద్దరు సాధారణ పౌరులు మృతి చెందారన్నారు. మృతి చెందిన మరో ఉగ్రవాదిని అమిర్ అహ్మద్ మాలిక్‌గా గుర్తించారు. అతడు జూలైలో మిలిటెంటు గ్రూపులో చేరాడని, మిగతా మృతదేహాలను సమీప బంధువులకు అప్పగించామన్నారు. వారి నుంచి ఆయుధాలను స్వాధీనంచేసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఉగ్రవాదుల ప్రాంతమైన షోపియాన్‌లో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. దీంతో వేర్పాటు వాద సంస్థలు సోమవారం బంద్‌కు పిలుపు నిచ్చాయి. రెండు నెలల శీతాకాల సెలవుల తర్వాత పాఠశాలలు, విద్యాలయాలు సోమవారం ప్రారంభం కాగ, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మూసివేశారు.

పౌరుల మృతి కలచివేసింది : మెహబూబా

పోలీసులకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదు రెదురు కాల్పుల్లో సాధారణ పౌరులు మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ వెల్లడించారు. ఇద్దరు మిలిటెంట్లతో సహా ఆరుగురు వ్యక్తులు షోపియాన్‌లో మృతి చెందారు. ఈ విషయంలో తీవ్రంగా కలత చెందుతున్నట్లు ఆమె ట్విటర్‌లో తెలిపుతూ మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

ఐఎన్ఎక్స్ మీడియా కేసు

కార్తీ పిటిషన్ విచారణ నేడు



న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా కేసులో తనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) జారీ చేసిన సమన్లను రద్దు చేయాలని కోరుతూ మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం కుమారుడు, కార్తీ దాఖలు చేసిన తాజా పిటీషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం విచారించనున్నది. సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా అటువంటి నోటీసులు జారీ చేసే ఎటువంటి అధికారమూ ఈడీకి లేదంటూ సమన్లు జారీని కార్తీ తన తాజా పిటిషన్‌లో సవాల్ చేశారు. ఈ కేసుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను మంగళవారం విచారించేందుకు అంగీకరించిన ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తులు ఎ.ఎం.ఖన్‌విల్కర్, డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ముందు కార్తీ తరఫు న్యాయవాది ఈ పిటిషన్ దాఖలు చేశారు. కాగా ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఉన్న కార్తీ చిదంబరం ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కూడా అత్యున్నత న్యాయస్థానం మంగళవారం విచారించే అవకాశం ఉంది. ఇదిలాఉండగా, ఈడీ జారీ చేసిన సమన్లను నిలుపుదల చేసేందుకు సుప్రీంకోర్టు తొలుత తిరస్కరిస్తూ, ఇందుకు సంబంధించి చట్టపరమైన అధికారానికి సంబంధించి ఒక అభ్యర్థన చేసుకోవచ్చని స్పష్టం చేసింది. కాగా కేంద్ర ఆర్థిక మంత్రిగా చిదంబరం ఉన్నపుడు 2007లో రూ.305 కోట్ల మొత్తం విదేశీ నిధులు పొందేందుకు ఐఎన్ఎక్స్ మీడియాకు అనుమతి ఇచ్చేందుకు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎఫ్ఐపీబీ)లో అవకతవకల ఆరోపణలపై గత ఏడాది మే 15న ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. అయితే తమపై వచ్చిన ఆరోపణలన్నింటినీ చిదంబరం తోసిపుచ్చారు.

ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించారు

ఎన్‌పీపీ చీఫ్ కన్రాడ్ సంగ్మా



షిల్లాంగ్ : రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు మేఘాలయ గవర్నర్ గంగా ప్రసాద్ తనను ఆహ్వానించారని ఎన్‌పీపీ అధ్యక్షుడు కన్రాడ్ సంగ్మా సోమవారం తెలిపారు. మంగళవారం కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. 'తగినంత మంది సభ్యుల సంఖ్యాబలం కలిగిన తమను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించారు' అని సంగ్మా తెలిపారు. మణిపూర్‌లో, కేంద్రంలో బీజేపీకి మిత్రపక్షం నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) కన్నా అధికంగా 21 సీట్లతో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే కేవలం 19 సీట్లు మాత్రమే పొందిన ఎన్‌పీపీతో రెండు స్థానాలే దక్కించుకున్న బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నిస్తోంది. ఇదిలాఉండగా, గత 10 ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 21 స్థానాలు దక్కించుకున్నప్పటికీ అధికారం 10 సీట్లు తక్కువయ్యాయి. సంగ్మా గత సాయంత్రం గవర్నర్‌ను కలుసుకుని తనకు 34 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ 'గవర్నర్‌ను కలిసి 34 మంది ఎమ్మెల్యేల మద్దతు లేఖను సమర్పించాం. వీరిలో ఎన్‌పీపీ 19, యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ(యూడీపీ) ఆరు, పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) నాలుగు, హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(హెచ్ఎస్‌పీడీపీ), బీజేపీ నుంచి ఇద్దరేసి చొప్పున, స్వతంత్రులు ఒకరు ఉన్నారు' అని తెలిపారు. 2016లో మరణించిన లోక్‌సభ స్పీకర్ పి.ఎ.సంగ్మా కుమారుడు కన్రాడ్ సంగ్మా(40). తండ్రి మరణం తర్వాత తురా నియోజకవర్గం నుంచి ఉప ఎన్నికల్లో పార్లమెంటు సభ్యుడిగా ఆయన ఎన్నికయ్యారు.

నవ్వుతూ పరీక్షలు రాయండి : మోడీ

న్యూఢిల్లీ : 10, 12వ తరగతి బోర్డు పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు అత్యంత ఆత్మవిశ్వాసంతో, నవ్వుతూ తమ పేపర్‌పై పరీక్ష రాయాలన్నారు. 'సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న నా యువ స్నేహితులకు బెస్ట్ ఆఫ్ లక్. అత్యంత ఆత్మ విశ్వాసంతో, నవ్వుతూ ఈ పరీక్షలు రాయండి' అని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహించే ఈ పరీక్షలకు 28 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరవుతున్నారు.

లెఫ్ట్ పతనం దేశానికి మంచిది కాదు : జైరామ్ రమేష్

తిరువనంతపురం : వామపక్షాల పతనం దేశానికి ఏమాత్రం మంచిది కాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేష్ వ్యాఖ్యానించారు. త్రిపుర శాసనసభ ఎన్నికల్లో వామపక్ష ప్రభుత్వం ఓటమి చెందడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వామ పక్షాల పతనం భారతదేశానికి పెను విపత్తుగా ఆయన అభివర్ణించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ లారీ బేకర్ శత జయంత్యుత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జైరామ్ కీలకోపన్యాసం ఇచ్చారు. వామపక్షాలు కూడా మారాలన్నారు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిం చాలన్నారు. వామపక్షాల పతనాన్ని భారతదేశం భరించ జాలదన్నారు. దేశంలో వామపక్షాలు బలపడాలని ఆకాంక్షించారు.

ఈశాన్య ప్రజల విశ్వాసం తిరిగి పొందుతాం

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : మూడు ఈశాన్య రాష్ట్రాలలో పార్టీ ఓటమిపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పెదవి విప్పారు. ఈశాన్య ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, తిరిగి వారి విశ్వాసం పొందుతామని ఆయన తెలిపారు. శనివారం త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో అసెంబ్లీ ఫలితాలు వెలువడిన రెండు రోజుల తర్వాత రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మేఘాలయలో కాంగ్రెస్ ఓటమి పాలుకాగా, త్రిపుర, నాగాలాండ్‌లలో ఒక్క సీటు కూడా గెలవలేక పోయింది. అధికారంలో ఉన్న మేఘాలయలో కాంగ్రెస్ 21 స్థానాలు గెలిచినప్పటికీ, సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రాంతీయ పార్టీల మద్దతును కూడగట్టలేకపోయింది. ప్రాంతీయ పార్టీలతో చర్చించేందుకు పార్టీ నాయకులు అహ్మద్ పటేల్, కమల్‌నాథ్‌లను షిల్లాంగ్ పంపించినప్పటికీ ఫలితం దక్కలేదు. కాగా 'ఈశాన్యం వ్యాప్తంగా ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు, మా పార్టీని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. పార్టీ కోసం నిరంతరం కష్టించి పని చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు నా ప్రత్యేక కృతజ్ఞతలు' అని రాహుల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ఈశాన్యాన్ని అస్థిర పరిచేలా బీజేపీ ప్రమాదకర ఆటలు : సూర్జేవాలా

ఈశాన్యంలో బీజేపీ, దాని సంకీర్ణ భాగస్వామ్యపక్షాల మధ్య విభేదాలు వెలుగులోకి వచ్చాయని కాంగ్రెస్ పార్టీ సోమవారం తెలిపింది. 'బీజేపీ అధికారం కోసం గుడ్డిగా చేస్తున్న వెతుకులాట ద్వారా ఈ ప్రాంతంలో అస్థిరపరిచే ఒక ప్రమాదకర ఆటను ఆడుతుంది' అని ఆరోపించింది.



త్రిపుర, మేఘాలయకు సంబంధించి విభజన వంటి కీలక అంశాలపై ఏర్పడ్డ వైరుధ్యాల గురించి కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి రణదీప్ సూర్జేవాలా మాట్లాడుతూ 'ఈశాన్యంలో అధికార దుర్వినియోగం, కూలదోయడం, అస్థిరపరిచే ఒక ప్రమాదకర ఆటను బీజేపీ ఆడుతుంది. స్థిరత్వం, భద్రత, శాంతి, పురోగతి గురించి ఆలోచించదు. అస్సాం, మిజో ఒప్పందాల ద్వారా ఈ ప్రాంతానికి శాంతి తీసుకువచ్చిన, 'నేషన్ ఫస్ట్' అని రాజీవ్ గాంధీ ఇచ్చిన సందేశాన్ని మోడీ తెలుసుకుంటారని ఆశిస్తున్నా' అని సూర్జేవాలా పేర్కొన్నారు.

ఈ ప్రాంత అధికార స్థిరత్వాన్ని అధిగమించేందుకు బీజేపీ గుడ్డిగా వెతుకలాడుతున్న సంకేతాలున్నాయి. ప్రజాస్వామ్య ప్రచారం, వేర్పాటువాద ధోరణులు, ప్రధాన సమస్యలను విస్మరించడం ఈ ప్రాంతంలో ఇప్పటికే కనిపిస్తున్నాయని ఆయన చెప్పారు. త్రిపురలో బీజేపీ పొత్తు పెట్టుకున్న ఐపీఎఫ్‌టీ ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర విభజన ప్రధాన ప్రచారాంశంగా చేసింది. ఇపుడు గిరిజనుడిని ముఖ్యమంత్రి చేయాలని డిమాండు చేస్తుందని కాంగ్రెస్ నాయకుడు సూర్జేవాలా తెలిపారు. 'మోడీ ప్రభుత్వం ఈ రెండు సమస్యలను పరిష్కరిం చడానికి సమయం వచ్చింది. త్రిపుర రాష్ట్ర విభజన డిమాండుకు నిలబడతారా, గిరిజన ముఖ్యమంత్రి డిమాండును తోసిపుచ్చుతురా' అని ఆయన ప్రశ్నించారు. నాగాలాండ్‌లో ఎన్‌పీఎఫ్, బీజేపీ మిత్రపక్షం ఎన్‌డీపీపీలు రెండింటితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామంటున్నారు. అంటే మరో ఐదేళ్లు నాగాలాండ్‌ను అస్థిరం పాలు చేస్తారా అని ప్రశ్నించారు. ఎన్‌పీఎఫ్ 26 మంది ఎమ్మెల్యేలను నిర్లక్ష్యం చేసి ఎన్‌డీపీపీకి చెందిన 18 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ నాగాలాండ‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి అధికారంలో ప్రధాన భాగాన్ని దక్కించుకునే ప్రయత్నాలు మాత్రమే' అని ఆయన పేర్కొన్నారు. 'సిద్ధాంతపరంగా, రాజకీయంగా, ఎన్నికలపరంగా ఏ ప్రతిపక్ష పార్టీ అయినా బీజేపీతో విభేదిస్తుంది. ఎన్‌పీపీ+యూడీపీ+పీడీఎఫ్+హెచ్ఎస్‌డీపీ+బీజేపీ+ఇండిపెండెంట్ ఎవరైనా సరే ప్రభుత్వ ఏర్పాటు కోసమే' అని తెలిపారు. మేఘాలయ ఆకాంక్షలకు, ప్రభుత్వ స్థిరత్వానికి ఇది సమాధానమా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అభ్యర్థి కాన్రాడ్ సంగ్మా, ఆయన పార్టీ ఎన్‌పీపీ మేఘాలయ విభజనకు హామీ ఇచ్చింది. ప్రత్యేక గరోలాండ్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనిని ఇతర పార్టీలు అంగీకరిస్తాయా అని కూడా ప్రశ్నించారు. సీఎం కావడానికే సంగ్మా ఆ ప్రతిపాదన చేశారా, ఈ విషయమై మోడీ, బీజేపీ ఏమి చేస్తారు' అని సూర్జేవాలా ట్వీట్ చేశారు.

రూ.3,200 కోట్ల అక్రమాలు : ఐటీ

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను శాఖ రూ.3,200 కోట్ల విలువైన కుంభకోణాన్ని గుర్తించింది. 2017 ఏప్రిల్ నుంచి 2018 మార్చి మధ్యలో నిర్వహించిన దర్యాప్తులో ఇది బహిర్గతమైంది. కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తుల టీడీఎస్ అకౌంట్లలో అక్రమాలను కనిపెట్టింది. 447 కంపెనీలు తమ ఉద్యోగుల నుంచి పన్ను వసూలు చేసి, తమ సొంత వ్యాపారాల్లోకి మళ్లించినట్లు కనుగొన్నది. ఆదాయపు పన్ను శాఖలోని టీడీఎస్ విభాగం ఈ దర్యాప్తును నిర్వహించింది. ఈ కేసుల్లో చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. కొందరికి వారెంట్లు జారీ అయ్యాయి.

ఉపహార్ కేసును ఈ ఏడాదిలో తేల్చండి

న్యూఢిల్లీ : ఉపహార్ అగ్నిప్రమాదం కేసులో తీర్పును నవంబరు 30 లోగా వెల్లడించాలని కిందికోర్టుకు ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. 1997లో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన విచారణలో కోర్టుకు నకిలీ పత్రాలు అందచేశారని ఢిల్లీ ప్రభుత్వంపై అభియోగాలున్నాయి. కేసు పరిస్థితిని తెలిపే స్టాటస్ రిపోర్టును సెప్టెంబరు 7నాటికి అందించాలని జస్టిస్ అనుమల్హోత్రాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఆదేశించింది. విచారణకు ప్రభుత్వం సహకరించి కేసు త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని ధర్మాసనం కోరింది.

త్రిపుర ఫలితాల ప్రభావం ఉండబోదు

బెంగళూరు : త్రిపుర ఎన్నికల ఫలితాలు కర్ణాటకపై ప్రభావం చూపబోవని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. ఆ రాష్ట్రంలో మోడీ వేవ్ ఉండవచ్చుకాని ఇక్కడ లేదని ఆయన స్పష్టం చేశారు. కొద్ది నెలల్లో ఎన్నికలు జరుగనుండగా ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గనులు, భూముల డినోటిఫికేషన్‌లతో కటకటాలు లెక్కించిన యడ్యూరప్పను అవినీతిలేని పాలన, సుస్థిర ప్రభుత్వం అందిస్తాడని బీజేపీ ఓటర్లను నమ్మించడానికి చాలా కష్టపడుతోందని ఆయన ఎద్దేవా చేశారు.

లాలూ కుమార్తె, ఆమె భర్తకు బెయిలు

న్యూఢిల్లీ : ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె మీసాభారతి, ఆమె భర్తకు మనీలాండరింగ్ కేసులో బెయిలు లభించింది. ప్రత్యే జడ్జి అరవింద్ కుమార్ వీరిరువురికీ బెయిలు మంజూరు చేస్తూ రెండు లక్షల రూపాయల బాండుతోపాటు కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లవద్దని షరతు విధించారు. ఎన్‌ఫోర్స్ డైరెక్టరేట్ (ఈడీ) వారి బెయిలును అడ్డుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. మిషైల్ ప్యాకర్స్ అండ్ ప్రింటర్స్‌లో నిందితులుగా మీసా, ఆమె భర్త షైలేష్‌లను ఈడీ దోషులుగా పేర్కొంది.

సీఎంను బెదిరించిన వ్యక్తి అరెస్టు

కన్నూర్ : కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌ను హత్యచేస్తానని బెదిరిస్తున్న మతిస్థిమితం లేని యువకుడిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. సీపీఎం కన్నూర్ జిల్లా కార్యదర్శి పీ జయరాజన్ పార్టీ ఆఫీసులో ఈ కాల్‌ను అందుకున్నట్లు ఆయన మీడియాకు తెలిపారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడు పయ్యనూర్‌కు చెందిన విజేష్ కుమార్‌గా పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. అయితే అతని తల్లి, చెల్లినుంచి మొబైల్ తీసుకొని ఇలాంటి ఫోన్లు చేస్తుండాడని స్థానికులు తెలిపారు.

బీజేపీకి ఓటమి రుచి చూపిస్తాం : ఎస్పీ

బల్లియా : గోరఖ్‌పూర్ ఎన్నికల్లో బీజేపీ ఓటమిని చవిచూస్తుందని, దేశంలో ఆ పార్టీ పతనం ప్రారంభమైందని సమాజ్‌వాదీపార్టీ సీనియర్ నాయకుడు రాం గోవింద్ చౌదరి పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రి కేసవ్ ప్రసాద్ మౌర్య ఖాళీ చేసిన గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ నియోజకవర్గాల స్థానాలకు లోక్‌సభ ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గోవింద్ బీజేపీపై విమర్శలు చేశారు. గోరఖ్‌పూర్‌లో బీఎస్పీ మద్దతుతో ఎస్పీ విజయం సాధిస్తుందని, బీజేపీ పతనమయ్యే సమయం ఆసన్నమైందని అన్నారు.

ఎస్పీ-బీఎస్పీల పొత్తు స్వప్రయోజనాలకే... : బీజేపీ

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్ స్థానాలకు లోక్‌సభ ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)ల మధ్య పొత్తు వాటి స్వప్రయోజనాల కోసమేనని బీజేపీ నేత, క్యాబినేట్ మంత్రి శ్రీకాంత్‌శర్మ విమర్శించారు. ప్రజలు ఎప్పుడో ఈ రెండు పార్టీలను విస్మరించారని అన్నారు. కాగా బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆదివారం ఎస్పీతో పొత్తును తోసిపుచ్చారు. అయితే బీజేపీని ఓడించేందుకు కల్సి పనిచేయాలని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో గోరఖ్‌పూర్, ఫుల్‌పూర్‌లలో బీఎస్పీ నాయకులు కూడా ఎస్పీ అభ్యర్థులకు మద్దతును ప్రకటించారు.

హైకోర్టు జడ్జి ఛాంబర్‌లో అగ్నిప్రమాదం

కోల్‌కతా : కోల్‌కతా హైకోర్టు ఆవరణలోని న్యాయమూర్తి ఛాంబర్‌లో అగ్నిప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు సెంటినరీ బిల్డింగ్‌లో మొదటి అంతస్తులోని జస్టిస్ జాయ్‌మాల్యా బగ్చీ ఛాంబర్‌లో అగ్నిప్రమాదం సంభవించిందని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారని, మంటలను అదుపు చేయడానికి వారికి దాదాపు మూడు గంటల సమయం పట్టిందని చెప్పారు. అగ్ని ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియలేదని తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారని చెప్పారు.

సీఎల్పీ నేతపై కాంగ్రెస్ ఎమ్మెల్యే ధ్వజం

పాట్నా: బీహార్‌లో శాసనసభా పక్షనేత సదానంద్ సింగ్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు.సదానంద్‌సింగ్ రాష్ట్రంలో పార్టీని బలహీనపరిచారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తివారీ అలియాస్ మున్నా తివారి ఆరోపించారు. అసెంబ్లీ సెషన్ ముగిసాక ఢిల్లీ వెళ్లి అధిష్టానానికి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై వివరిస్తానని చెప్పారు. కాంగ్రెస్‌లో ఎక్కువ కాలం పనిచేయని కార్యకర్తకు పార్టీ టికెట్ ఇవ్వడం వంటి చర్యలను సదానంద్‌సింగ్ చేపట్టడం వల్లే రాష్ట్రంలో పార్టీ బలహీనపడిందని చెప్పారు.

నిఘా వ్యవస్థ మరింత పటిష్టం : పళనిస్వామి

చెన్నై : తీవ్రవాదం, మతతత్వం, నక్సలిజం సమాజానికి పెద్ద బెడదలని తమిళ నాడు ముఖ్యమంత్రి కె.పళనిస్వామి సోమవారం పేర్కొన్నారు. కలెక్టర్లు, జిల్లా పోలీసు అధికారులతో కూడిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంఘ వ్యతిరేక శక్తులను అడ్డుకునేందుకు నిఘా వ్యవస్థను పటిష్టమంతం చేయాలని సూచించారు. విధ్వంసక శక్తులను కట్టడి చేసేందుకు కృషి చేసినప్పుడే రాష్ట్రం పురోగతి సాధిస్తుందని చెప్పారు. శాంతి స్థాపనే అన్నాడీఎంకే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు.

వైద్యంకోసం విదేశాలకు గోవా సీఎం ?

పనాజీ : వైద్య చికిత్సల నిమిత్తం గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ ముంబైకు వెళుతున్నారని, అవసరమైతే చికిత్స కోసం విదేశాలకు వెళ్లే అవకాశం ఉందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ముంబైకు వెళ్లే ముందర ఆయన గోవాలో డోనా పౌలాలోని ప్రైవేటు నివాసంలో సీనియర్ మంత్రులతో సమావేశమవుతారని తెలిపింది. ఆయన లేని సమయంలో క్యాబినేట్ సలహా కమిటీ పరిపాలనాపరమైన నిర్ణయాలను తీసుకుంటుందని పేర్కొంది.

హైకోర్టు మాజీ న్యాయమూర్తి కన్నుమూత

కోచి : కేరళ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ డి.శ్రీదేవి (79) తమిళ నాడులోని కోచిలో సోమవారం కన్నుమూశారు. అస్వస్థత చెందిన ఆమె కొద్దికాలం నుంచి చికిత్స పొందుతున్నారని ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆమె నివాసంలో కన్నుమూసినట్లు చెప్పారు. 1997 నుంచి 2001 వరకు ఆమె హైకోర్టులో న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. అలాగే 2007 నుంచి 2012 వరకు ఆమె కేరళ మహిళ కమిషన్ ఛైర్‌పర్సన్‌గా కూడా సేవలందించారు.

అమిత్‌షాకు పార్టీ ఎంపీల అభినందనలు

న్యూఢిల్లీ : ఈశాన్యంలో బీజేపీ మెరుగైన ఫలితాలు పొందిన నేపథ్యంలో సోమవారం రాజ్యసభకు విచ్చేసిన అమిత్‌షాకు పార్టీ ఎంపీలు, మంత్రులు ఘనస్వాగతం పలికారు. ఆయన తన సీటు దగ్గరికి వెళ్లే సమయంలో బీజేపీ సభ్యులు, మంత్రులు బల్లలపై దరువు లు వేయడం ప్రారంభించారు. మరికొంతమంది వారి సీట్లలో నుంచి లేచి నిలబడి అమిత్‌షాకు స్వాగతం పలికారు.



ఎమ్మెల్యే 'పతివాడ' తనయులపై అట్రాసిటీ కేసు

కలెక్టరేట్ ఎదుట అంబేద్కర్ ఇండియా మిషన్ ధర్నాలో నేతల డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం (మున్సిపాలిటీ) : విజయ నగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామి నాయుడు తనయులు తమ్మినాయుడు, రామినాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఎదుట అంబేద్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఒమ్మి రమణ, గోకా రమేష్‌బాబు సంఘీభావం ప్రకటించారు. ధర్నాలో నేతలు మాట్లాడుతూ ఇటీవల చంద్రబాబునాయుడు నాయకత్వంలో టీడీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు దళితులపై దాడులకు తెగబడుతున్నారన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే నారాయణ స్వామినాయుడు తనయులు రౌడీయిజం చెలాయిస్తూ దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నా రన్నారు. ఎమ్మెల్యే కుమారులపై తక్షణమే అట్రాసిటీ కేసులను నమోదుచేసి భోగాపురం సీఐ, డెంకాడ ఎస్ఐలను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో ఏజేసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకోటి ఆనంద్, తోలేటి నర్శింహారావు, కె.గౌరీనాయుడు, మాలమహానాడు నాయకులు రామవరపు పైడిరాజు, ఏఐఎం జిల్లా కార్యదర్శి తెరుపల్లి శ్రీనివాసరావు, డీహెచ్‌పీఎస్ టౌన్ కార్యదర్శి గోకా కోటేశ్వరరావు, సచ్చిపాల అప్పలస్వామి పాల్గొన్నారు.

రైళ్లలోని గజదొంగలు దొరికారు



- అంతా హర్యానా ముఠా సభ్యులే
- 2 కేజీల బంగారు వస్తువుల స్వాధీనం
- పట్టుకున్న విజయవాడ రైల్వే పోలీసులు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్) : రైళ్ళలో చోరీలకు తెగబడుతున్న అంతర్ రాష్ట్రాల గజదొంగల ముఠాను ఎట్టకేలకు విజయవాడ రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్ సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ. 60 లక్షల విలువ చేసే 2 కేజీల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ రైల్వే ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆర్పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఎస్.ఆర్. గాంధీతో కలిసి రైల్వే ఎస్పీ కె.వి.మోహనరావు ఈ ముఠా కార్యకలాపాలను మీడియాకు వెల్లడించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను ప్రదర్శించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన రాజేంద్రకుమార్ ఈ దొంగల ముఠా నాయకుడు. ఇదే రాష్ట్రానికి చెందిన అనిల్‌కుమార్, రమేష్‌కుమార్, సునీల్‌కుమార్. సందీప్ కలిసి అంతా ముఠాగా వివిధ రాష్ట్రాల్లో రైళ్లలోని ఏసీ బోగీల్లో నిద్రిస్తున్న మహిళలు, వృద్ధులను ఎంచుకొని హ్యాండ్‌బ్యాగులను, సుట్‌కేసులు, నగదు చోరీ చేస్తుంటారు. ఇప్పటి వరకు వీరు అనేక కేసుల్లో జైలుశిక్షలు అనుభవించారు. ప్రముఖులు ప్రయాణించే రైళ్లను చోరీలకు ఎంచు కుంటారు. ఎవరికీ అనుమానం రాకుండా సాధారణ ప్రయాణికులుగా రిజర్వేషన్లు చేయించుకుంటారు. వేరువేరు కోచ్‌ల్లో తిరుగుతూ అర్ధరాత్రి వేళ ప్రయాణికులు గాఢనిద్రలో ఉన్న సమయంలో చిన్నపాటి వస్తువుతో చాకచక్యంగా బంగారు ఆభరణాలను తెంచుకుపోతారు. దొంగించిన వస్తువులను ఇతర కోచ్‌ల్లోని ముఠా సభ్యులకు అందజేసి ఏమీ తెలియనట్లు ప్రయాణిస్తుంటారు. చోరీ జరిగినట్లు కుడా బాధితులకు వెంటనే తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. గతంలో ఈ ముఠాను విశాఖపట్నంలో అరెస్టు చేశారని, బెయిల్ ద్వారా బయటకొచ్చిన తర్వాత మళ్లీ చోరీలు చేస్తున్నారన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో తమ సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా సోమవారం 10వ నంబరు ప్లాట్‌ఫామ్‌పై తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిని అదుపులోకి తీసుకుని విచారణ చేసినట్లు వివరించారు. విచారణలో విజయవాడలో 3, రాజమండ్రిలో 2, భీమవరంలో 2, గుడివాడ, విశాఖపట్నం, గుంటూరు, చీరాలలో ఒక్కో చోరీ చేసినట్టు తేలిందన్నారు. నింధితులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు. వీరిని పట్టుకున్న పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేయనున్నట్టు ఎస్పీ ప్రకటించారు. సమావేశంలో జీఆర్పీ డీఎస్పీలు సత్తిబాబు, మనోహర్, జీఆర్పీ సీఐలు జి.రత్నరాజు, టి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సిక్కోలు కలెక్టర్‌కు నిరసన సెగ

గ్రీవెన్స్‌లో నిలదీసిన వంశధార నిర్వాసితులు

- నివ్వెరబోయిన జిల్లా యంత్రాంగం
- పునరావాసం పూర్తి కాకుండా తప్పుడు నివేదికపై ఆగ్రహం

విశాలాంధ్ర- శ్రీకాకుళం (కలెక్టరేట్) : శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్ ధనంజయరెడ్డిని వంశధార నిర్వాసితులు మూకుమ్మడిగా నిలదీశారు. నిర్వాసిత గ్రామాల్లో పునరావాసం పూర్తికాకుండా ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఎలా సమర్పించారంటూ ప్రశ్నించారు. నిర్వాసితులంతా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తారని అందరూ ఊహించినప్పటికీ ఆయనపై విరుచుకుపడడంతో గ్రీవెన్స్‌లోని అధికారులు ఒక్కసారిగా నివ్వెరపోయారు. దీంతో కొందరు అధికారులు నిర్వాసితులకు నచ్చజెప్పి బయటకు పంపించారు. ఇటీవల హిర మండల తహశీల్దార్ కాళీప్రసాద్‌పై దుగ్గుపురం గ్రామానికి చెందిన నిర్వాసితులు దాడిచేసిన ఘటన మరువకముందే అదే గ్రామ నిర్వాసితులు కలెక్టర్‌ను నిలదీయడం గమనార్హం. నూరుశాతం పునరావాసం పూర్తయినట్టు ఇటీవల కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీనిపై నిర్వాసితులు తీవ్ర ఆగ్రహంతో కలెక్టర్‌పై విరుచుకుపడ్డారు. 20 మంది అనర్హులకు యూత్ ప్యాకేజీ మంజూరు చేశారని, అందులో 13 మందికి గత నెలలో చెక్కులు కూడా ఇచ్చారని నిర్వాసితులు వాపోయారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసి తమకు న్యాయం చేయమని ప్రభుత్వాన్ని కోరితే, అనర్హులకు ఏ విధంగా లబ్ధి చేకూరుస్తారని కలెక్టర్‌ను ప్రశ్నించారు. కొన్ని నిర్వాసిత గ్రామాల్లో సుమారు 35 ఎకరాల డి-పట్టా భూములకు నష్టపరిహారం ఇవ్వలేదని, నిర్వాసిత చట్టం ప్రకారం డి-పట్టా భూములకు సైతం పరిహారం చెల్లించాలన్న నిబంధన ఉందని, వీటన్నింటినీ పక్కనబెట్టి కలెక్టర్ ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం నానా తంటాలు పడుతున్నారని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.సింహాచలం,వామపక్ష నాయకులు కె.నారాయణరావు, నిర్వాసిత గ్రామాల ప్రజలు జి. ఈశ్వరమ్మ, మడపాం ఉమారాణి, సిఐటీయు నాయకులు తిరుపతిరావు తదితరులు పేర్కొన్నారు.

అమ్మోనియా గ్యాస్ లీక్ :15 మంది మహిళలకు అస్వస్థత



విశాలాంధ్ర-కరప : రొయ్యల ఎక్స్‌పోర్టు కంపెనీలో అమ్మోనియా గ్యాస్ లీక్ అయిన ఘటనలో 15 మంది మహిళలు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన సోమవారం తూర్పు గోదావరి జిల్లా కరప మండలంలోని గురజనాపల్లి గ్రామంలో కలకలం సృష్టించింది. అమ్మోనియా సల్ఫేడ్ అనే విషవాయువు గాలిలోకి విడుదల అయితే ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ చోటుచేసుకుని శ్వాస తీసుకునే నాళాలు మూసుకుపోయే ప్రమాదం ఉంది. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ గ్యాస్ దుర్ఘటనను తలపించేలా చోటుచేసుకున్న ఈ ఘటనతో కంపెనీలో పనిచేస్తున్న కూలీలు, ఉద్యోగులు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని బయటకు పరుగులుతీశారు. గురజనాపల్లి గ్రామంలో వీరభద్ర ఎక్స్‌పోర్టు రొయ్యల కంపెనీలో షిఫ్ట్ పద్ధతిలో వేలాది మంది మహిళలు పనిచేస్తుంటారు. కంపెనీ యాజమాన్యం పూర్తి స్థాయి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో అమ్మోనియా గ్యాస్ పదే, పదే లీక్ అవుతోంది. గతంలో మూడుసార్లు లీకేజీ వెలుగుచూసినా అధికారులు కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో ఐదుగురు మహిళలు కోమాలోకి వెళ్లి ప్రాణాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో మరోసారి సోమవారం జరిగిన దుర్ఘటనలో 15 మంది మహిళలు అస్వస్థతకు గురయ్యారు. సింగిరిమళ్ళ దుర్గ, దేవు సుబ్బలక్ష్మి, ఓలేటి కామేశ్వరి, రేవు కామేశ్వరి, జ్యోతి, దేవి, సుధ తీవ్ర అస్వస్థకు గురికాగా, వీరిలో ఒకరి ఆరోగ్య పరిస్థితి విషయంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికైనా వీరభద్ర ఎక్స్‌పోర్టు రొయ్యల కంపెనీలో గ్యాస్ లీకేజీని అధికారులు పరిశీలించిన తరువాతే పర్మిషన్ ఇవ్వాలని, జాగ్రత్తలు తీసుకోని కంపెనీల లైసెన్సులు రద్దు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఈ-నామ్‌పై నీలినీడలు!

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ-నామ్ అమలు క్షేత్ర స్థాయిలో అభాసుపాలవుతోంది. దేశంలోనే అతిపెద్ద గుంటూరు మిర్చియార్డులో ఎగుమతి వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, రైతులు వ్యతిరేకిస్తున్నారు. ఎట్టి పరిస్థితిలో అమలు చేయాలని అధికారులు ఆదేశిస్తుండటంతో పాక్షికంగానే అమలవుతోంది.



- మిర్చియార్డులో పాక్షికంగా అమలు
- వ్యతిరేకిస్తున్న వ్యాపారులు, రైతులు
- పూర్తి స్థాయి అమలుకు అధికారుల ఆదేశాలు
- ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న రైతులు

విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు : ఎలక్ట్రానిక్ జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం(ఈ-నామ్) అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 57 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన గుంటూరు మిర్చియార్డుకు ఎంతో ఖ్యాతి ఉంది. ఇక్కడ ప్రతి సంవత్సరం దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయిల వ్యాపార లావాదేవీలు జరుగుతాయి. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి మిర్చియార్డులో ఈ-నామ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే వ్యాపారులు వ్యతిరేకించడంతో వాయిదా వేస్తూ వస్తున్నారు. తాజాగా ఈ-నామ్‌కు వ్యతిరేకంగా రైతులు ప్రత్యక్ష ఆందోళన చేపట్టారు.

దీంతో ఈ-నామ్ ద్వారా వ్యాపారులు మిర్చి కొనుగోలు చేసినప్పటికీ ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయడంలేదు. ట్రేడింగ్‌లో పాల్గొనబోమని వ్యాపారులు చెబుతున్నారు. నిబంధనలు ఇబ్బందిగా ఉన్నాయంటున్నారు.దీంతో పాక్షికంగానే అమలవుతుంది. ఈ-నామ్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని మార్కెటింగ్‌శాఖ కమిషనర్ కృతనిశ్చయంతో ఉండటంతో మధ్యలో కింది స్థాయి అధికారులు నలిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు, కర్నూలు, అనంతపురం, కడప, ప్రకాశం జిల్లాల మిర్చి రైతులు సరుకును ఈ-నామ్ అమలులోలేని కర్ణాటక రాష్ట్రంలోని మార్కెట్ యార్డులకు తరలిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో గుంటూరు మిర్చియార్డు ఆదాయం కోల్పోనుంది. ఏటా మిర్చియార్డులో లావాదేవీల ద్వారా సుమారు రూ.40 కోట్ల ఆదాయం వస్తుంది. దీనిలో ఎక్కువ భాగం కోల్పోవాల్సిన పరిస్థితులు తలెత్తడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

ఇబ్బందులివే..

యార్డులో గతంలో రైతులు మిర్చి టిక్కీలు విక్రయించగానే కమీషన్ వ్యాపారులు నగదు చెల్లించేవారు. ఎగుమతి వ్యాపారులకు పదిరోజులపాటు అప్పులు ఇచ్చేవారు. విదేశీ ఎగుమతులు కూడా క్రెడిట్ విధానంలో కొనసాగాయి. ఈ-నామ్‌లో ట్రేడింగ్ అయిన రోజు సాయంత్రంలోపు మార్కెట్ కమిటీ ద్వారా రైతు బ్యాంకు ఖాతాలోకి ఎగుమతిదారుడు నగదు చెల్లించాలి. లేని పక్షంలో గేట్‌పాస్ జనరేట్‌కాదు. దీంతో సరుకును యార్డు నుంచి బయటకు తరలించలేరు. ఈ నిబంధన కారణంగా ఎగుమతిదారులు కొనుగోళ్లు తగ్గించారు. గతంలో మొత్తం టిక్కీల లాట్‌లో మూడు నుంచి నాలుగు బస్తాలు కోసి మిరపకాయల నాణ్యత పరిశీలించేవారు. ఈ-నామ్‌లో రైతు తీసుకొచ్చిన మిర్చి టిక్కీలన్నీ కోసి సరుకు కిందపోయాలి. వ్యాపారులు పరిశీలించిన తర్వాత గోనె సంచుల్లో నింపుకోవాలి. దీంతో కూలీలు ఖర్చు ఎక్కువ అవుతుందని ఆవేదన ఉంది. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం ఈ-నామ్‌ను కొంతకాలం వాయిదా వేయాలని వ్యాపారులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.



పాల బకాయిలు చెల్లించకుంటే

ప్రత్యక్ష ఆందోళన

విశాలాంధ్ర - యర్రగొండపాలెం : ఒంగోలు డెయిరీ యాజమాన్యం పాల ఉత్పత్తి దారులకు బకాయిలను వెంటనే చెల్లించకుంటే ప్రత్యక్ష ఆందోళన తప్పదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ హెచ్చరించారు. ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పాల ఉత్పత్తి దారులు, పాల సేకరణ ఏజెంట్లతో ఆయన సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ యర్రగొండపాలెం పాలశీతల కేంద్రం పరిధిలో రైతులకు సుమారు కోటి 20 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉందన్నారు. కనిగిరి, ఒంగోలు, కొండమంజులూరు, కంభం, గంగవరం, దర్శి పాలశీల కేంద్రాల పరిధిలోని రైతులకు మొత్తం సుమారు రూ.10 కోట్లు రావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం స్పందిం చకపోవడం బాధాకరమన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతుల బకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టాల న్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బకాయిలు రాబట్టేందుకు అను సరించాల్సిన విధానంపై సమగ్రంగా చర్చిం చేందుకు ఈ నెల తొమ్మిదో తేదీన ఒంగోలులో రైతులు, పాలసేకరణ ఏజెంట్లు, అధ్యక్షులతో ప్రత్యేక సమావేశం నిర్వహి స్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని పాల శీతల కేంద్రాల పరిధిలోని బాధ్యులు అందరూ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ సీనియర్ నాయ కులు టీసీహెచ్ చెన్నయ్య, మండల కార్యదర్శి కె గురవయ్య, అగ్రిగోల్డ్ యూనియన్ నాయకులు సుబ్బారావు, ఏజెంట్లు, రైతులు పాల్గొన్నారు.

కంది రైతు కన్నెర్ర

- మార్కెట్ యార్డుల్లో ఆందోళన
- పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నినాదాలు
- అండగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం



విశాలాంధ్ర బ్యూరో కర్నూలు : ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో పాలకులు ఆడుతున్న నాటకాలపై కంది రైతులు కన్నెర్ర చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎకరాకు నాలుగు క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకోకుండా రైతులు పండించిన పంట మొత్తం కొనాలంటూ సోమవారం కర్నూలు, తుగ్గలి, ఆత్మకూరు మార్కెట్‌యార్డుల్లో ఆందోళన బాటపట్టారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌యార్డులో కంది రైతుల ధర్నాలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఏఐటీయూసీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు నరసింహులు అధ్యక్షతన జరిగిన సభలో ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ కందిరైతులకు సోమవారం టోకెన్లు ఇవ్వకుండా నిలిపివేయడం దారుణమన్నారు. బయట మార్కెట్‌లో కందులు క్వింటా ధర 4 వేల రూపాయలు ఉందని, మార్క్‌ఫెడ్ సంస్థ రూ.1500 అధికంగా కొనుగోలు చేయడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి రైతులు అసక్తి చూపుతున్నారన్నారు. కంది పంటను అంతర్‌పంటగా వేస్తారనే విషయం అధికారులకు తెలియకపోవడం బాధాకరమని, రైతులకు ధ్రువీకరణపత్రం ఇవ్వకుండా వ్యవసాయశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేయడం తగద న్నారు. ఆయిల్‌ఫెడ్ సంస్థ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన వేరుశెనగ పంటకు సంబం ధించి డబ్బు ఇంత వరకు చెల్లించపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ఆయిల్‌ఫెడ్, మార్క్‌ఫెడ్ సంస్థలు రైతులకు ఇవ్వాల్సిన సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి టి మద్దిలేటి, రైతు సంఘం జిల్లా నాయకులు కె పుల్లన్న, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి నల్లన్న, మహమ్మద్ ఉన్నారు.

పీజీలో ప్రవేశానికి ఇక బీఆర్‌ఏయూ సెట్



విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం : పీజీ సెంటర్ స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయికి ఎదిగినా పీజీ కోర్సులో ప్రవేశానికి దశాబ్దకాలంగా 'ఆసెట్' పైనే ఆధారపడుతున్న శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఇక సొంతంగా సెట్ నిర్వహించుకునేందుకు సన్నద్ధమవుతోంది. 'ఆ సెట్' స్థానంలో డాక్టర్ బి.ఆర్. ఏయూ సెట్-2018 పేరుతో ఈ ఏడాది జూన్‌లో ఎంట్రన్స్ పరీక్షల నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా యూనివర్సిటీ పరిధిలో పీజీ కళాశాలల్లో 3,500 వరకూ సీట్లు ఉన్నాయి. ఆసెట్ ర్యాంకు ఆధారంగానే జిల్లాలోని కళాశాలల్లో పీజీ సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహించేవారు. యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన కూన రామ్‌జీ ఇదే విషయమై ఇటీవల హైలెవల్ కమిటీ సమావేశం నిర్వహించారు. సొంతంగా సెట్ నిర్వహించుకోవడానికి ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తెలుసుకున్నారు. వాటిని ఎలా ఎదుర్కోవాల్సి ఉంటుంది, నిధులు ఏ మేరకు అవసరమవుతాయనే విషయాలపై చర్చించారు. సాంకేతిక సహాయాన్ని ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పొందుతూ ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మాదిరిగానే శ్రీకాకుళం అంబేద్కర్ యూనివర్సిటీలోని కొత్త బ్లాకుల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభించాలనే యోచన చేస్తున్నట్టు సమాచారం. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో వచ్చే ఏడాది నుంచి తరగతులు మొదలుపెట్టేందుకు అవసరమైన అనుమతులు సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలో ఇంజనీరింగ్ విద్యకంటూ ప్రత్యేక ప్రభుత్వ కళాశాల లేనందున దీనిని అందుబాటులోకి తెచ్చినట్లువుతుందని రామ్‌జీ అభిప్రాయపడుతున్నారు. వర్సిటీలో గత కొద్దికాలంగా మిగిలిపోయిన 48 పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు. వర్సిటీకి ప్రత్యేక నిధులు లేకపోవడంతోనే అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో సెమినార్‌లు సైతం నిర్వహించలేక పోతున్నామని రామ్‌జీ ఆవేదన వ్యక్తంచేశారు.

కనిపించని పరి'శ్రమ'

- విజయనగరంలో పరిశ్రమలన్నీ మూత
- దయనీయ స్థితిలో కార్మికులు
- ఇతర రాష్ట్రాలకు వలసబాట



విశాలాంధ్ర-బొబ్బిలి : అంగడిలో 'అన్నీ ఉన్నా..అల్లుడు నోట్లో శని' అన్న చందాన ఉంది విజయనగరం జిల్లావాసుల పరిస్థితి. జిల్లా నుంచి ఒకరు కేంద్రంలో, మరో ఇద్దరు రాష్ట్ర మంత్రులున్నప్పటికీ ఏమాత్రం ప్రయోజనం లేదని కుమిలిపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామిక ప్రగతికి కొత్తకొత్త ప్రణాళికలు అమలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తునా జిల్లాకు ఒక్క కొత్త పరిశ్రమ రాకపోగా, ఉన్న పరిశ్రమలన్నీ మూతబడటం ఆందోళన కలిగిస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా మూతపడిన పరిశ్రమలను తెరిపించడంలోనూ విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. పరిశ్రమలు తెరిపించండి మహాప్రభో... అంటూ కార్మికులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకొనేవారే కానరాకపోవడం బాధాకరం. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే విజయనగరం జిల్లాలో సహజ, మానవ వనరులు పుష్కలం. కానీ పారిశ్రామిక అభివృద్ధిలో ఎప్పుడూ అట్టడుగు స్థానమే. జిల్లాలో 23.44 లక్షలు జనాభా ఉండగా, గ్రామీణ ప్రాంతంలో 18.53 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 4.91 లక్షల మంది ఉన్నారు. వీరిలో దారిద్ర్యరేఖకు దిగువనున్న 2.53 లక్షల మంది వివిధ రకాల పింఛన్లపై ఆధారపడుతున్నారు. ఏటా 7లక్షల మంది వరకూ ఉపాధి హామీ పథకం ఆధారంగా జీవిస్తున్నారు. తెలుగుదేశం అధికారం చేపట్టి నాలుగేళ్లయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయనగరం జిల్లాను పరిశ్రమల హబ్‌గా చేస్తామని, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో వందలాది పరిశ్రమలు పెట్టించి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల్లో హామీలు గుప్పించారు. నాలుగేళ్ళవుతున్నా గ్రోత్‌సెంటర్‌లో ఏ ఒక్క పరిశ్రమ కానరాలేదు. ఉన్న పరిశ్రమలు సైతం మూతపడ్డాయి. గతంలో రాష్ట్ర పరిశ్రమలశాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా పరిశ్రమల అభివృద్ధిలో అట్టడుగు స్థానంలో ఉంది. పక్కనే ఉన్న విశాఖ మొదటి స్థానం అక్రమించగా, శ్రీకాకుళం మూడో స్థానంలో నిలిచింది. ఈ నాలుగేళ్లలో జిల్లాకు కొత్త పరిశ్రమలు రాకపోగా 13 జూట్ మిల్లులు మూతపడ్డాయి. విజయనగరం జిల్లాలో 32 పారిశ్రామిక ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు 3,000 వరకూ ఉన్నాయి. భారీ, మధ్య తరహా పరిశ్రమలు ఆరు ఉండగా వీటి ద్వారా 1,020 మంది ఉపాధి పొందుతున్నారు. 2015-16లో 32 యూనిట్ల స్థాపన లక్ష్యం పెట్టుకున్నప్పటికీ కేవలం రూ.68.93 కోట్లతో 21 యూనిట్లు మాత్రమే వచ్చాయి. వీటిలో గజపతినగరం కొత్తరోడ్డు వద్ద ఓలం ఆగ్రో ఇండియా లిమిటెడ్ పరిశ్రమ రూ.43.3 కోట్లతో స్థాపించారు. దీనిలో 1000 మంది మహిళా కార్మికులకు ఉపాధి కలిగింది. అంతకు మినహా జిల్లాలో చెప్పుకోదగ్గ పరిశ్రమలేమీ రాలేదు. 2016-17లో 173 యూనిట్ల ద్వారా రూ.43.10 కోట్లు పెట్టుబడులు ఆకర్షించడం ద్వారా 2,880 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ప్రస్తుతం 7 పరిశ్రమల స్థాపనకు ఒప్పందం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కొత్త పరిశ్రమల సంగతి అటుంచితే టీడీపీ అధికారం చేపట్టాక జిల్లాలో ప్రధాన ఉపాధి పరిశ్రమలుగా పేరొందిన బొబ్బిలి, నెల్లిమర్ల జూట్ మిల్లులు, ఫెర్రో పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. ఈ జూట్ మూతతో జిల్లాలో 15 వేల మంది ఉపాధి కోల్పోయారు. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ మూతతో 4, 900 మంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, ఆర్థిక విధానాల ప్రభావం, కార్మిక చట్టాల సవరణల పేరుతో కార్మిక హక్కులను కాలరాయడంతో ఈ ప్రమాదం ముంచుకొచ్చింది. ప్రభుత్వం నుంచి భారీగా సబ్సిడీలు, రాయితీలతోపాటు బ్యాంకు అప్పులు తీసుకున్న పరిశ్రమలను సైతం యాజమాన్యాలు అక్రమ లాకౌట్లు ప్రకటించాయి. పరిశ్రమలు మూతబడటంతో పారిశ్రామికవాడలు బోసిపోయాయి. దీంతో జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. బతుకుదెరువు కోసం పొట్టచేతబట్టుకుని ఇతర రాష్ట్రాలకు వలసబాట పడుతున్నారు.

28 వరకు శాసనసభ: పల్లె రఘునాథ్‌రెడ్డి

విశాలాంధ్ర-అమరావతి:ఏపీ శాసనసభ సమావేశాలు ఈ నెల 28 వరకు జరుగుతాయని ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ రెడ్డి చెప్పారు. శాసనసభ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన మాట్లాడుతు సమావేశాలకు మధ్యలో 5 రోజులు సెల వులు వచ్చాయన్నారు. గవర్నర్ ప్రసంగంపై జరిగే చర్చకు 7న ముఖ్యమంత్రి చంద్ర బాబు సమాధానం ఇస్తారని,. 8వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఆర్థిక మంత్రి యనమల రామ కృష్ణుడు బడ్జెట్‌ను ప్రవేశపెడతా రన్నారు. సమావేశాలు జరిగే కాలంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలను వెల్ల డించారని, 84 లక్షల మంది రైతులకు రూ.24 వేల కోట్ల రుణాలు మాఫీ చేసినట్లు వివరించారు.పట్టి సీమ ద్వారా గోదావరి-కృష్ణా నదులను అను సంధానం చేశారని చెప్పారు. ఈ-ఆఫీస్, ఈ-ఫైల్స్ వంటి వాటి ద్వారా సాంకేతిక రంగంలో రాష్ట్రం ముందుకు దూసుకుపోతుందని చెప్పారు. వ్యాపార అనుకూత లతో దేశంలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని ,రూ.13.54 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా పారి శ్రామిక రంగం పురోభివృద్ధి సాధించనుందన్నారు. ఫైబర్ నెట్ ద్వారా రూ.149 లకే ప్రతి ఇంటికి టీవీ, నెట్, ఫోన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం లో 1కోటి 42 లక్షల కుటుంబాలకు రేషన్ అంద చేస్తూ 50 లక్షల మందికి పెన్షన్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆయూష్ వైద్యాధికారులకు

60 ఏళ్ల వయోపరిమితి పెంపుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ఆయూష్ వైద్య విభాగంలో పనిచేస్తున్న 17 మంది వైద్యాధికారుల ఉద్యోగ కాలపరిమితిని 60 ఏళ్ల వరకూ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాల కొండయ్య సోమవారం జీవో నంబరు-71 జారీ చేశారు. ఏపీలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, సీనియర్ మెడికల్ ఆఫీసర్లు, చీఫ్ మెడికల్ ఆఫీర్లు, వారితో సమాన హోదా గల అధికారులకు 60 ఏళ్ల వరకూ ఉద్యోగ వయోపరిమితి పెంపుదల వర్తిస్తుంది.

విద్యుత్ కార్మికుల సమ్మె ఉధృతం

- రెండో రోజుకు చేరిన నిరవధిక నిరాహార దీక్ష
- కార్మికులకు మద్దతుగా దీక్ష చేపట్టిన చలసాని, గఫూర్
- న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేదిలేదని ప్రకటన
- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీలు, వామపక్ష, కార్మిక సంఘాల నేతలు
- రేపు విద్యుత్ సౌధ ముట్టడి



విశాలాంధ్ర ప్రతినిధి-విజయవాడ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు 14 రోజులుగా చేస్తున్న సమ్మె ఉధృతమైంది. సమ్మెలో భాగంగా నగరంలోని గాంధీనగర్ ధర్నా చౌక్‌లో ఆదివారం నుంచి విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక చైర్మన్ కాశీ మధుబాబు, సెక్రటరీ జనరల్ బాలకాశి, కోశాధికారి చంద్రశేఖర్, కో-కన్వీనర్ నాగరాజు, చీఫ్ కో-ఆర్డినేటర్ జి.హారతి, సీహెచ్ సరోజ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. వారితో కలిసి కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం సోమవారం నుంచి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకటరామారావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ కూడా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. సోమవారం ఉదయం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ఫ్యాప్టో చైర్మన్ బాబురెడ్డి, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకుడు విద్యాసాగర్ తదితరులు నాయకులకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. సమ్మె చేస్తూ కర్నూలులో మరణించిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికుడు తిరుపాలు మృతికి సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తరచూ రాష్ట్రంలో మిగులు విద్యుత్ సాధించామని చెబుతారని.. అయితే ఈ ఘనత కార్మికుల నిరంతర శ్రమ వల్లే సాధ్యమనే విషయాన్ని ఆయన విస్మరించడం సిగ్గుచేటన్నారు. అత్యవసర సర్వీసు అయిన విద్యుత్ శాఖలో పని చేస్తున్న 24 వేల మంది కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు, ప్రభుత్వానికి సంబంధం లేదని చెప్పడం, థర్డ్ పార్టీని రద్దు చేసి కార్మికులు చేసిన పనికి నేరుగా వేతనాలు ఇవ్వాలని కోరితే స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ నెల 7వ తేదీన విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు విద్యుత్ సౌధను ముట్టడించి ప్రభుత్వం మెడలు వంచాలని సూచించారు. సమ్మె విచ్ఛిన్నానికి అధికారులు, కాంట్రాక్టర్లు ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు ఐక్యంగా పోరాడాలని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గఫూర్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేసే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కేవలం 24 వేల మంది కార్మికులు సమ్మె చేస్తున్నారనుకుంటే పొరపాటని, వారి వెనుక లక్షలాది మంది కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నాయకుడు విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు న్యాయమైనవని, వారికి ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు. ఫ్యాప్టో చైర్మన్ బాబు రెడ్డి మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేల వేతనాలను రెండుసార్లు పెంచుకున్నారని, కార్మికుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. రోజు కూలీ రూ.200లతో కార్మికుల కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు కార్మికులు పని చేస్తారని, కాబట్టి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండు చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి అండగా ఉంటామని ప్రకటించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలు కార్మికు లను పేదరికంలోకి నెట్టివేస్తున్నాయన్నారు. కార్మికుల పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర నాయకుడు రమణమూర్తి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సుబ్బరావమ్మ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు ప్రసంగించారు.

శాసనమండలిని స్తంభింపజేస్తాం : ఎమ్మెల్సీలు

ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, వై.శ్రీనివాసులురెడ్డి దీక్షా శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై శాసనమండలిలో చర్చిస్తామని చెప్పారు. ఇప్పటికే శాసనమండలి చైర్మన్ ఫరూక్‌తో మాట్లాడి సమస్యను వివరించామని పేర్కొన్నారు. కార్మికులు ఏడో తేదీన విద్యుత్ సౌధను ముట్టడిస్తే అదే రోజు తాము శాసనమండలిని స్తంభింపజేస్తామని ప్రకటించారు.

సంఘీభావం తెలిపిన పలు సంఘాలు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల నిరాహార దీక్షలకు బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర సర్కిల్ కార్యదర్శి అశోక్ బాబు రూ.3 వేలను ఉద్యమ నిధికి విరాళం ఇచ్చారు. మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్, ఇన్సూరెన్స్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ర్యాలీగా వచ్చి సంఘీభావం తెలిపారు. హమాలీ యూనియన్ నాయకుడు సీతా రాములు, ఏపీ శాక్స్ కౌన్సిలర్స్ అసోసియేషన్ నాయకుడు అశోక్, ఏపీ బేవరేజస్ హమాలీల సంఘ నాయకుడు కొండలరావు తదితరులు కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. విద్యుత్ సౌధ ముట్టడికి తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. సీపీఎం, ఏఐటీయూసీ నాయకులు సీహెచ్ బాబూరావు, ముజఫర్ అహ్మద్, నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



ఆర్టీజీ అదుర్స్ !

చంద్రబాబును అభినందించిన గవర్నర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రియల్‌టైమ్ గవర్నెన్స్ సెంటర్ పనితీరు అద్భుతమని గవర్నర్ నరసింహన్ కొని యాడారు. వెలగపూడి సచివాలయం ముఖ్యమంత్రి కార్యాలయంలో గల ఆర్టీజీ సెంటర్‌ను నరసింహన్ దంప తులు సోమవారం సందర్శించారు. దాదాపు గంటకు పైగా సమయాన్ని ఆర్టీజీ సెంటర్‌లో గడిపారు. ఆర్టీజీ సెంటర్ ఏవిధంగా పనిచేస్తుందో గవర్నర్ దంపతులకు సీఎం చంద్రబాబు ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. గవర్నర్ సంభ్రమాశ్చ ర్యాలకు గురి అవుతూ ఇది చూస్తుంటే గంట కాదు, ఒక రోజంతా ఇక్కడే ఉండిపోవాలని అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఇలాంటి సెం టర్ ఊతముంటే వృద్ధి లక్ష్యం 15 శాతాన్ని సాధించడం సునాయాసమన్నారు. నాలెడ్జి, టెక్నాలజీల సమ్మేళనంతో పాలన సాగి స్తుండటం అద్భుతమని చంద్రబాబును ప్రశం సించారు. సర్వైలెన్స్ కెమెరాలు, డిజిటల్ క్లాసు రూములు, లాక్డ్ హౌస్ మేనేజ్మెంట్, రేషన్ కార్డులు, పెన్షన్లు, డ్రోన్లు, ట్రాఫిక్ మేనేజ్మెంట్, పబ్లిక్ గ్రీవియెన్స్ తదితర అంశాలన్నీ గవర్నర్ దంపతులు ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం సచివాలయం మొత్తాన్ని బ్యాటరీ కారులో తిరిగి గవర్నర్ దంపతులు పరిశీలించారు.

చంద్రబాబు మోసం చేశారు

వైసీపీ ఎంపీలు మేకపాటి, విజయసాయి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక తరగతి హోదాను కేంద్రం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ పార్లమెంటు భవనం వైపు ప్రదర్శనగా వెళ్లేందుకు ప్రయత్నించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ(వైసీపీ)కి చెందిన ఐదుగురు ఎంపీలతోపాటు కొంతమంది ఎమ్మెల్యేలను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. తమ నాయకులను పోలీసులు అరెస్టు చేయకుండా పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అరెస్టు చేసిన వైసీపీ నాయకులను పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు తరలించామని, కొంతసేపటి తర్వాత వారు వెళ్లిపోయేందుకు అనుమతించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అరెస్టు చేయడానికి ముందు ఆ పార్టీ లోక్‌సభ ఎంపీ మేకపాటి రాజమోహన రెడ్డి మాట్లాడుతూ 'మేమందరమూ చంద్రబాబు నాయుడిని నమ్మాం. కానీ రాష్ట్ర అసెంబ్లీలో సీట్ల సంఖ్య పెంచే విషయంలోనే తప్ప, రాష్ట్రానికి ప్రత్యేక హోదా పొందే విషయంలో ఆయన ఎటువంటి ఆసక్తి చూపలేదు' అని తెలిపారు. వచ్చే ఏడాది సార్వత్రిక, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ తమ పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలను నెల్లూరు ఎంపీ రాజమోహన రెడ్డి అభ్యర్థించారు. '2014లో చంద్రబాబు నాయుడికి ఎలా 17 సీట్లు ఇచ్చారో, మాకు 20 ఎంపీ సీట్లు ఇవ్వండి. ఏపీకి ప్రత్యేక తరగతి హోదాను కేంద్రం ఎందుకు ఇవ్వదో మేము చూస్తాం. చంద్రబాబు అందరినీ మోసం చేశాడు' అని పేర్కొన్నారు. అరెస్టయిన మరో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ 'మేము అన్ని అనుమతులూ తీసుకున్నాం. కానీ మేము నిర్బంధానికి గురయ్యాం. 2015లో కూడా మా పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఇదే అంశంపై ఇదే వేదికగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇటువంటి నిర్బంధ యత్నాలు మమ్మల్ని అణచలేవు. మేము నిరసనను కొనసాగిస్తాం' అని తెలిపారు. 'రాష్ట్రంలోని ప్రతి ఓటరు ప్రత్యేక తరగతి హోదా కోరుకుంటున్నాడు. రానున్న ఎన్నికలు హోదా అంశంపై పోరాడుతున్నట్లు నటిస్తున్న వారికి, పోరాడుతున్న ప్రజలకు మధ్య ఎంచుకోవడానికి ఒక ప్రజాభిప్రాయంగా పరిగణించబడతాయి' అని ఆయన తెలిపారు.

ఇంగ్లీషు పరీక్షకు 13,873 మంది గైర్హాజరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఇంగ్లీషు పేపర్-2 (ద్వితీయ సంవత్సరం) పరీక్షలకు 13,873 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.రాష్ట్ర వ్యాప్తంగా 1423 కేంద్రాలలో పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తంగా 4,71,916 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 4,58,043 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులను నమోదు చేశారు.

మోడీ, చంద్రబాబుపై కేసు

- ఢిల్లీ పోలీసులకు ఏపీ కాంగ్రెస్ ఫిర్యాదు
- నేటి నుంచి నాలుగు రోజులు ఆందోళన : రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ : ప్రత్యేక హోదా హామీని అమలు చేయకుండా... ఏపీ ప్రజలను మోసగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబుపై కాంగ్రెస్ నేతలు సోమవారం న్యూఢిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏపీ కాంగ్రెస్ చీఫ్ రఘువీరారెడ్డి, కేంద్రం మాజీమంత్రి పల్లంరాజు, గిడుగు రుద్రరాజులతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీ డీసీపీ మధుర్ వర్మను కలిసి ఫిర్యాదు పత్రాన్ని సమర్పించారు. అనంతరం రఘువీరారెడ్డి మాట్లాడుతూ ఏపీ పునర్విభజన చట్టం 2014ను అమలు చేయకుండా ఐదుకోట్ల మంది రాష్ట్ర ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఇందుకు కారణమైన మోడీ, చంద్రబాబులను బాధ్యులుగా చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని మధుర్ వర్మకు ఫిర్యాదు చేశామన్నారు. పార్లమెంటు సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, కొత్త రాజధాని నిర్మాణానికి నిధులు, విశాఖపట్నానికి రైల్వే జోన్ వంటి హామీలు అమలు చేయలేదని నిందించారు. మోడీ, చంద్రబాబు చేసిన మోసానికి తగిన విధంగా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకే ఏపీలోని రాజకీయ పార్టీలన్నీ ఆందోళనబాట పట్టాయన్నారు. ఆఖరికి తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ ఏపీకి అన్యాయం చేశారని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ రాజధాని ఢిల్లీలో మార్చి 6వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ర్యాలీలు, ఆందోళలు, పార్లమెంటు ముట్టడి వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

అమిత్‌షా నివాసం ముట్టడి : ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ఎస్కేయూ జేఏసీ నేతృత్వంలో విద్యార్థులు సోమవారం న్యూఢిల్లీలోని బీజేపీ చీఫ్ అమిత్‌షా నివాసాన్ని ముట్టడించారు. అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసించారు. అమిత్‌షా, మోడీలకు వ్యతిరేకంగా నినాదాలు చేయటంతో పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను అడ్డుకున్నారు. విద్యార్థులను అరెస్ట్ చేసి తుగ్లక్‌రోడ్డు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రత్యేక హోదా ఇచ్చే వరకు తమ ఆందోళన ఆగదని విద్యార్థులు స్పష్టం చేశారు.

కంది రైతులను ఆదుకుంటాం

మంత్రులు సోమిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో కంది రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి సీహెచ్ ఆదినారాయణరెడ్డి తెలిపారు. సచివాలయంలో మంత్రి సోమిరెడ్డి, ఆదినారాయణ రెడ్డితో కలిసి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారులతో సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ ఏడాది రాష్ట్రంలో కందుల దిగుబడి భారీగా పెరిగిందన్నారు. కంది రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో, పంటనంతా కొనుగోలు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా 45 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి ముందుకొచ్చిందని తెలిపారు. మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి, రైతులకు భరోసా ఇవ్వనుందన్నారు. మొదటగా ప్రతి రైతు నుంచి 25 క్వింటాల చొప్పున కందులు కొనుగోలు చేస్తామన్నారు. మిగిలిన పంట ఎంత ఉదో లెక్కించి, తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.


హోదాతో పాటు మిగతా

అంశాలూ ముఖ్యమే :లోకేశ్

విశాలాంధ్ర అమరావతి : ఏపీకి న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని మంత్రి లోకేష్ అన్నారు. సోమవారం అసెంబ్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పోరాడతామన్నారు. ప్రత్యేక హోదాతో పాటు మిగతా అంశాలూ కీలకమేనన్నారు. బీజేపీ కర్నూలు డిక్లరేషన్ చూసి ఆశ్చర్యపోయానని , రాయలసీమలో గతంలో ఎన్నడూలేని అభివృద్ధి జరిగిందని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఏమిచ్చిందో, ఎంత ఇచ్చిందో వాస్తవాలన్నీ అసెంబ్లీ వేదికగా ప్రజలకు తెలియజేస్తామన్నారు.మోడీ సభలో ఉంటే.. గాంధీ విగ్రహం ముందు వైసీపీ ఎంపీలు ధర్నా చేస్తున్నారని, కేంద్ర బడ్జెట్ బాగుందన్న వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డిని జగన్ ఎందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేయడం లేదని ప్రశ్నించారు. వైసీపీది ద్వంద్వ వైఖరని,రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో సుజనా చౌదరి మాట్లాడుతోంటే, విజయసాయి రెడ్డి అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు విమర్శించారు. జగన్ ఏ రోడ్ల మీద పాదయాత్ర చేస్తోన్న ఆ రోడ్లు మా ప్రభుత్వం వేసినవేనని గుర్తుచేశారు. టీడీపీ చేసిన అభివృద్ధి తెలియాలంటే జగన్ తన పాదయాత్రలో భాగంగా టీడీపీ వేసిన ప్రారంభోత్సవ శిలా ఫలకాలు చూడాలని కోరారు. భారతదేశానికి దక్షిణాదిలో రెండో రాజధాని ఉండాలన్న వాదనను తాను సమర్థిస్తానని కర్నూలును దేశానికి రెండో రాజధాని చేస్తే బాగుంటుందన్నారు. ఇటీవల తెలంగాణ పర్యటనలో చంద్రబాబు పొత్తులు ఉంటాయని ప్రకటించినదానికి విరుద్ధంగా లోకేశ్ స్పందించారు. టీఆర్ఎస్‌తో నే పొత్తు ఉంటుందని సీఎం ఎక్కడా చెప్పలేదని గుర్తుచేశారు.

భూసేకరణ కష్టమైతే భూగర్భ పైపులైన్లు

- ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయడమే లక్ష్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో తలపెట్టిన ప్రాధాన్య ప్రాజెక్టులతో సహా ఇతర ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రధాన ఆటంకంగా మారిన భూసేకరణ సమస్యకు సీఎం చంద్రబాబు అధికారులకు ఉత్తమ పరిష్కారమార్గాన్ని సూచించారు. భూసేకరణకు బదులుగా భూగర్భ పైపులైన్లు వేయడం ద్వారా ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. భూగర్భమార్గంలో పైపులైన్లు వేయడం వల్ల ఎవరి అనుమతి అవసరం వుండదని, అలాగే భూసేకరణకు అయ్యే వ్యయం కూడా ఆదా అవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. సోమవారం సచివాలయంలో పోలవరం సహా ప్రాధాన్య ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే 28 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి, మరో 20కి పైగా ప్రాజెక్టులను ఈ జాబితాలో చేర్చాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే చేపట్టిన 28 ప్రాధాన్య ప్రాజెక్టులలో చాలావరకు పూర్తికావస్తున్నందున కొత్త ప్రాజెక్టులను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. గోదావరి-పెన్నా అనుసంధానం మొదటి దశ, మహేంద్రతనయ, జీఎన్ఎస్ఎస్ రెండో దశ, వెలిగొండ 1, 2 సొరంగాలు, వైకుంఠపురం బ్యారేజ్, స్వర్ణముఖి-సోమశిల, మల్లెమడుగు, శ్రీ బాలాజీ రిజర్వాయర్, వేణుగోపాల్ సాగర్, హీరమండలం-ఇచ్ఛాపురం-సోంపేట, జీడిపల్లి-భైరవానితిప్ప, మూలపల్లి-కుప్పం, పాలేరు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఆల్తూరుపాడు సహా 20కి పైగా ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రాధాన్య ప్రాజెక్టులో చేర్చాల్సిందిగా సూచించారు. వీటికి అంచనాలను తక్షణం రూపొందించి, ఏయే ప్రాజెక్టును ఎప్పటికల్లా పూర్తి చేయాలో లక్ష్యం నిర్దేశించుకుని, టెండర్లను త్వరితగతిన పిలవాలని చెప్పారు. తాజా జాబితాతో ప్రాధాన్య ప్రాజెక్టుల సంఖ్య 50కు చేరుకుంది.అలాగే తారకరామ తీర్థ సాగరం, వెలిగొండ ప్రాజెక్టులను ఈ సీజన్ కల్లా పూర్తి చేయాలని, ఈ ఏడాది వర్షాకాలం నాటికి నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. నాగావళి కాలువలు అభివృద్ధి చేసి 110 ఏళ్లు కావస్తున్నందున వాటిపైనా దృష్టి పెట్టాలని తెలిపారు.పోలవరం ప్రాజెక్టులో వివిధ పనులకు సంబంధించి ఇంకా మిగిలి వున్న డిజైన్లను శరవేగంగా రూపొందించి, కేంద్రం నుంచి ఆమోదం పొందేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. డిజైన్ల రూపకల్పనకు, పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారిని నియమించాలని చెప్పారు. 2018 జనవరి వరకు పోలవరం ప్రాజెక్టు కోసం రూ. 13,053.91 కోట్లు ఖర్చు చేయగా, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన అనంతరం రూ. 7,918.04 కోట్లు ఖర్చు చేసినట్టు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ఇందులో ఈ ఏడాది ఫిబ్రవరి 9 వరకు కేంద్రం రూ. 4,932.26 కోట్లు కేంద్రం ఇచ్చిందని, మరో రూ. 2,985.78 కోట్లు ఇవ్వాల్సి వుందని చెప్పారు. సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రాజమౌళి, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏ రాష్ట్రానికి హోదా పొడిగించలేదు

బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్, సోము వీర్రాజు

విశాలాంధ్ర అమరావతి : కేంద్రం ఏ రాష్ట్రానికి హోదా పొడిగించలేదని దీనిపై అనవసరపు రాద్ధాంతం చేస్తు న్నారని బీజేపీ శాసనమండలి సభ్యులు మాధవ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంపై విస్తృత స్థాయిలో చర్చ జరగాలని, అది నవ్యాంధ్ర ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు.

శాసనసభలో జరిగే చర్చలలో ఈ అంశాన్ని చేర్చమని శాసనసభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశంలో తాము కోరామని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యో గులు, వ్యవసాయం వంటి అంశాలపై నాలుగు రోజులు చర్చలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభి వృద్ధి పనులకు విలేకరుల బృందాన్ని తీసుకువెళ్లే ఆలోచన ఉందన్నారు. కేంద్రం మంజూరు చేసిన నిధులు వాటి వివరాలు పూర్తిస్థాయిలో ప్రజలకి తెలియ చేస్తామని, ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా పొడిగించలేదన్నారు. ఆధారా లుంటే చూపాలని అసత్యాలు ప్రచారం చేసి ప్రజల మనో భావాలు రెచ్చగొట్టవద్దని సూచించారు. ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు జీఎస్టీ మినహాయింపు ఇచ్చారని, ఏపీకీ జీఎస్టీ మినహాయింపు ఇచ్చే అంశం పై కేంద్రం దగ్గర చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. విమర్శలు చేస్తూ హోర్డింగులు ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తుందన్నారు. టీడీపీ నేతలు అనవసరపు విమర్శలు మానుకోవాలని వారు హితవు పలికారు.

ఇవ్వాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు, గ్రీన్‌ఫీల్డ్ క్రూడాయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు, అమరావతికి ఆర్థిక సాయం, దుగరాజపట్నం పోర్టు, జాతీయ సంస్థల ఏర్పాటు, శాసనసభలో సీట్లు పెంపు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలన్నారు. వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం, 9, 10 షెడ్యూల్ సంస్థలను విభజించాల్సి ఉందని చెప్పారు. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు, అమరావతికి ర్యాపిడ్ రైలు, రోడ్డు అనుసంధానం కావాల్సి ఉందన్నారు. అమరావతికి ఆర్థిక సహాయం, జాతీయ ప్రాముఖ్యత గల సంస్థలు ఏర్పాటు కావాలని, పన్ను విధింపు విషయాల్లో తేడాలను పరిష్కరించాలని చెప్పారు. గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, దక్షిణాది రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తలసరి ఆదాయం రూ.35 వేలు తక్కువగా ఉందని. దీనిని సరి చేయాల్సి ఉందన్నారు. ఐదు కోట్ల ప్రజల రాష్ట్రంగా విభజన కష్టాలను అధిగమించాలంటే కేంద్ర సాయం అనివార్యమని గవర్నర్ స్పష్టం చేశారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం

రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించామని, వెనుకబడిన జిల్లాలలో వృద్ధిని పెంచి ఉపాధిని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సహజసిద్ధ వనరులు, తీరప్రాంతం, అధిక నైపుణ్యం కలిగిన సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగంలో నిలుపుతామని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా చేయగలిగామన్నారు. శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించామని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు వ్యవస్థ ఆధునీకరణ చేశామని, రౌడీయిజాన్ని పూర్తిగా అణచివేశామని చెప్పారు. ఎకో, హెరిటేజ్, బీచ్ టూరిజం విభాగాల్లో ఆధునిక సదుపాయాలతో కొత్త పర్యాటక ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నామని, కియా మోటార్స్ కర్మాగారం అనంతపురం జిల్లాకు ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచిందన్నారు. చిత్తూరు జిల్లాలోని తిరుపతి ఎలక్ట్రానిక్ హబ్‌గా మారుతోందన్నారు. ఔషధ, ఏరోస్పేస్, డిఫెన్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల హబ్‌గా విశాఖ, జౌళి, ఆహార శుద్ధి కేంద్రాలుగా కృష్ణా, గుంటూరు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కర్నూలులో ఒక అల్ట్రా మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటు కాబోతోందని నరసింహన్ పేర్కొన్నారు. ప్రైవేటు రంగంలో పెద్దయెత్తున ఉపాధిని ప్రోత్సహిస్తున్నామని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేస్తోందని, 2019లో 10 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించనున్నట్లు గవర్నర్ స్పష్టం చేశారు. 2018లో చమురు, సహజవాయువు అన్వేషణలో ప్రభుత్వం పెట్టుబడులు ఆశిస్తోందని, విజయవాడ, విశాఖ, తిరుపతి విమానాశ్రయాలు ప్రయాణికుల రద్దీ విషయంలో దేశంలోనే అధికవృద్ధి నమోదు చేస్తున్నాయన్నారు. భోగాపురం, ఓర్వకల్లు, దగదర్తి, దొనకొండ, నాగార్జునసాగర్‌లలో కొత్త విమానాశ్రయాల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రాజధాని అమరావతి నగరం నిర్మాణం జరగబోతోందని, 2018 నాటికి సింగపూర్ కన్సార్టియం ద్వారా స్టార్టప్ ఏరియా మాస్టర్ డెవలప్‌మెంట్ ప్రారంభం కానుందని గవర్నర్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరునెలలు వ్యవసాయం, వ్యవసాయానుబంధ రంగాలలో అనూహ్య ప్రగతి సాధించామన్నారు. వ్యవసాయ రుణ విముక్తి పథకంలో ఇప్పటి వరకు 117.6 లక్షల ఖాతాలకు రూ.13,976 కోట్లను జమ చేశామని, రుణ విముక్తి పథకం కింద ఇప్పటి వరకు 2.24 లక్షల మంది ఉద్యాన రైతులకు రూ. 384.47 కోట్ల మొత్తాన్ని అందించామన్నారు. వెనుకబడిన తరగతుల జాబితాలో కాపు, తెలగ, బలిజ కులాలను చేర్చి విద్య, ఉపాధి అవకాశాల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించేందుకు, షెడ్యూలు తెగల జాబితాలో వాల్మీకి, బోయ కులాలను చేర్చేందుకు సిఫార్సు చేసిందని గవర్నర్ చెప్పారు. 2015-16లలో కాపు, బ్రాహ్మణ, అత్యంత వెనుకబడిన తరగతుల వారి సంక్షేమ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఆర్థిక వనరులు కేటాయించిందని, 11 బీసీ సమాఖ్యలకు నిధుల కేటాయింపునకు కూడా గణనీయంగా పెంచామని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థ పథకాన్ని అమలులో ఏపీ అగ్రగామిగా ఉందన్నారు. బాలికల సాధికారతను కల్పించి మద్దతు ఇచ్చేందుకు ఈ ఏడాది నుంచి వివాహ సంబంధిత ప్రోత్సాహకాల పథకాలన్నింటికీ చంద్రన్న పెళ్ళికానుక అమలు పరుస్తున్నామని, ఇందులో రూ.40 వేల ప్రోత్సాహకంతో ఎస్సీ వధువులకు, గిరిపుత్రిక పథకాన్ని, మైనార్టీ వధువులకు దుల్హన్ పథకం కింద 50 వేలు, బీసీ వధువులకు 35 వేలు పెళ్ళికానుక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గత నాలుగు సంవత్సరాలలో షెడ్యూలు కులాల అభివృద్ధి రూ.29,025 కోట్లు కేటాయించామన్నారు. రూ.200 కోట్ల వ్యయంతో 4,333 ఎకరాల భూమి, ఎస్సీ మహిళల కోసం కేటాయించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 86 లక్షల మహిళ స్వయం సహాయక బృందాల సభ్యుల కోసం రూ.8,600 కోట్ల వ్యయంతో ప్రతి మహిళకు రూ.10 వేలు అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. సాధికారమిత్ర పథకం ద్వారా 4.71లక్షల మంది మహిళలను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నియమించి ప్రభుత్వ పథకాలను అమలు పరుస్తున్నామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ క్రింద మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామంటూ మంగళగిరిలో ఎయిమ్స్, రాజధాని అమరావతిలో ప్రపంచశ్రేణి పరిశోధన వైద్య కేంద్రాలు ఏర్పాటవుతున్నాయన్నారు. అర్హత గల కుటుంబాలను కలిపి పక్కా గృహాలను నిర్మించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందని తెలిపారు.

అగ్రిగోల్డ్ అతిపెద్ద స్కామ్

అగ్రిగోల్డ్ స్కామ్‌పై గవర్నర్ తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. అగ్రిగోల్డ్ అతిపెద్ద స్కామ్ అని, డిపాజిట్‌దారులు దాదాపు రూ.6,380 కోట్ల మేర కోల్పోయారని తెలిపారు. 136 మంది అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఈనెల 1వ తేదీ ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిచినట్లు తెలిపారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల స్వాధీనానికి ఎస్సెల్ గ్రూప్ ముందుకొచ్చిందన్నారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవడం, విభజన కష్టాలను అధిగమించడం అనే లక్ష్యంతో పని చేస్తున్నామని, ఇందుకోసం ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. శాసనసభ చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్, స్పీకర్ కోడెల శివప్రసాదరావు గవర్నర్‌తో పాటు వేదికపై ఆశీనులయ్యారు. సభకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, కేబినెట్‌లోని మంత్రులు, టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

ఐపీఎల్ ప్రారంభ వేడుకల తేదీ మార్పు..!



ముంబై: ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీలో ఏప్రిల్ 7నుంచి పోటీలు ప్రారంభంకాను న్నాయి. ఈ నేపథ్యంలో ఒక్క రోజు ముందు అంటే 6న క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియాలో అంగరంగ వైభవంగా ప్రారంభ వేడుకలను నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐతే ప్రారంభ వేడుకల తేదీలో మార్పుతో పాటు వేదిక కూడా మారినట్లు ఓ బీసీసీఐ అధికారి తెలిపారు. ఏ రోజు అయితే పోటీలు ప్రారంభమవుతాయో.. అంటే ఏప్రిల్ 7.. అదే రోజు ప్రారంభ వేడుకలను వాంఖడే మైదానంలో నిర్వహించాలని సుప్రీంకోర్టు నియమించిన పాలకుల కమిటీ తాజాగా నిర్ణయం తీసుకుందట. అలాగే రూ.50కోట్లు పెట్టి ఈ వేడుకలను నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోగా.. రూ.20 కోట్లు తగ్గించి రూ.30కోట్లతోనే కార్యక్రమాన్ని ముగించాలని కమిటీ సభ్యులు సూచించినట్లు సమాచారం. బడ్జెట్‌లో కోత, వేడుకల తేదీలో మార్పుతో ఐపీఎల్ నిర్వాహకులు షాక్‌కు గురయ్యారు. ఏప్రిల్ 7న ప్రారంభమయ్యే ఐపీఎల్ మెగా టోర్నీ మే 27తో ముగియనుంది. ముంబై ఇండియన్స్-చెన్నై సూపర్ కింగ్స్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది.

షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణం



మెక్సికో: అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారులు అదరగొడుతున్నారు. తాజాగా మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ సీనియర్ షూటింగ్ ప్రపంచకప్ పోటీల్లో మరోసారి త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. హర్యానాకు చెందిన 16 ఏళ్ల మనూ భకర్ స్వర్ణం సాధించింది. మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మనూ అగ్రస్థానంలో నిలిచింది. ఆతిథ్య దేశానికి చెందిన అలెజంద్ర జవాలను వెనక్కి నెట్టి మనూ స్వర్ణం కైవసం చేసుకుంది. జవాల గతంలో రెండుసార్లు ప్రపంచకప్ ఫైనల్ విజేతగా నిలిచింది. ఆదివారం మెక్సికోలో జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మనూ 237.5 పాయింట్లతో పసిడిని సొంతం చేసుకుంది. జవాలా(237.1), ఫ్రాన్స్‌కు చెందిన సీలైన్ గోబర్‌విల్లే(217) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. మరో భారత క్రీడాకారిణి యశశ్విని సింగ్ 196.1పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ ప్రపంచకప్ పోటీల్లో భారత్‌కు మొత్తం 5 పతకాలు దక్కాయి. ఇందులో రెండు స్వర్ణాలు, మూడు కాంస్యాలు ఉన్నాయి. గత ఏడాది ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 49వ స్థానంలో నిలిచిన మనూ ఈ ఏడాది స్వర్ణం సాధించడం విశేషం. స్వర్ణ పతకం సాధించిన అనంతరం మనూ మీడియాతో మాట్లాడుతూ..'పసిడిని సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. తొలి ప్రపంచకప్ పోటీల్లోనే స్వర్ణం గెలిచాను. భవిష్యత్తులో మంచి ప్రదర్శనల చేసి మరిన్ని పతకాలు సాధిస్తా' అని తెలిపింది.

వార్నర్-డీకాక్ మధ్య వాగ్వాదం



విచారణకు ఆదేశించిన క్రికెట్ ఆస్ట్రేలియా

దర్బన్: ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుతో మ్యాచ్‌లు అంటే అభిమానులకు వెంటనే గుర్తుకొచ్చేది స్లెడ్జింగ్. మైదానంలో బ్యాట్స్‌మెన్ ఏకాగ్రతను మరల్చడానికి మాటల యుద్ధానికి దిగుతారు. అలాగే మైదానం వెలుపల ప్రత్యర్థి జట్టుపై కాస్త దూకుడు ప్రదర్శించాలని చూస్తారు. తాజాగా ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా మధ్య నాలుగు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ నడుస్తోంది. దర్బన్ వేదికగా ప్రస్తుతం తొలి టెస్టు జరుగుతోంది. ఆదివారం నాలుగో రోజు ఆట టీ విరామ సమయంలో డేవిడ్ వార్నర్.. ఆతిథ్య జట్టు వికెట్ కీపర్ డీకాక్‌పై మాటల యుద్ధానికి దిగాడు. టీ విరామంలో ఇరు జట్ల ఆటగాళ్ల తమ తమ డ్రెస్సింగ్ రూమ్‌లకు వెళ్లే క్రమంలో ముందుగా ఆసీస్ ఆటగాళ్లు మెట్లు ఎక్కుతున్నారు. వారి వెనుక క్రీజులో బ్యాటింగ్ చేస్తోన్న డీకాక్ వస్తున్నాడు. మెట్లు ఎక్కుతూ డీకాక్‌పై మాటలతో విరుచుకుపడ్డాడు వార్నర్. సహచర ఆటగాళ్లు వద్దు వద్దు అని వారిస్తున్నా వార్నర్ తన ఆవేశాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నాడు. కాసేపటికి కెప్టెన్ స్మిత్ వచ్చి వార్నర్‌ను డ్రెస్సింగ్ రూమ్‌లోకి తీసుకువెళ్లిపోయాడు. ఇదంతా మెట్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ఈ వీడియోను స్థానిక మీడియా బయటపెట్టడంతో పెద్ద దుమారం రేగింది. దీంతో అసలు ఏం జరిగిందో తెలుసుకునే పనిలో క్రికెట్ ఆస్ట్రేలియా నిమగ్నమైంది.

ఏబీడీ చెత్త రికార్డు..!



దర్బన్: దక్షిణాఫ్రికా స్టార్ ఆటగాడు ఏబీ డివిలియర్స్ చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో భాగంగా రెండో ఇన్నింగ్స్‌లో రనౌట్‌గా నిష్క్రమించిన ఏబీ.. అంతర్జాతీయ క్రికెట్‌లో దక్షిణాఫ్రికా తరఫున అత్యధికసార్లు రనౌటైన అపప్రదను సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలోనే జాక్వస్ కల్లిస్ చెత్త రికార్డును ఏబీ సవరించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఏబీ 28సార్లు రనౌట్ అయ్యాడు. ఇదే సఫారీ తరపున అత్యధికం. నాథన్ లయన్ వేసిన 12 ఓవర్ చివరి బంతిని క్రీజ్‌లో ఉన్న మర్‌క్రామ్ స్వ్కేర్ లెగ్ వైపు ఆడాడు. దాంతో రన్ కోసం మర్‌క్రామ్-ఏబీలు ప్రయత్నించారు. అయితే చివరినిమిషంలో పరుగు విరమించుకోవడంతో మర్‌క్రామ్ క్రీజ్‌లోకి వెళ్లిపోగా, అప్పటికే ముందుకొచ్చిన ఏబీ వెనక్కు వెళ్లే యత్నం చేశాడు. అదే సమయంలో బంతిని వేగంగా అందుకున్న వార్నర్.. నాన్ స్ట్రైకర్ ఎండ్ వైపు విసిరాడు. ఆ బంతిని లయన్ అందుకోవడం వికెట్లను నేలకూల్చడం వేగంగా జరిగిపోయాయి. దాంతో ఏబీ పరుగులేమీ చేయకుండా పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 118 పరుగుల తేడాతో విజయం సాధించింది.

కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు..!

- యంగ్‌బెంచ్‌కు లక్కీ చాన్స్
- నేటి నుంచి శ్రీలంక-భారత్- బంగ్లాదేశ్ నిదహాస్ ట్రై సిరీస్
- ఫేవరేట్‌గా భారత్
- కోహ్లి, ధోనీ, భువీ, కుల్దీప్ గైర్హాజరు
- రోహిత్‌కు పగ్గాలు



కొలంబో: కొంతకాలంగా శ్రీలంక-భారత్ అంటే క్రికెట్ ప్రేమికుల్లో ఓ విధమైన కుతూహలం ఉండేది. అయితే ప్రస్తుతం శ్రీలంక ఫామ్‌లో లేకపోవడంతో ఈ సిరీస్‌పై పెద్దగా అంచనాల్లేవ్. ఇలాంటి నేపథ్యంలో మంగళవారం నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో టీమిండియా టీ20 ముక్కోణపు సిరీస్ ఆడనున్నది. ఆతిథ్య జట్టు రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియాను మొట్టమొదటిగా ఎదుర్కోనున్నది. అయితే రెగ్యులర్ కెప్టెన్ విరాట్ కోహ్లి, ధోనీలాంటి సీనియర్ల గైర్హాజరీతో ప్రస్తుతం టీంలో ఉన్న యువ కెరటాలకు తామేంటో నిరూపించుకునే అవకాశం వచ్చింది. కొంతకాలంగా భారత్‌లో క్రికెట్ అంటే కోహ్లి-ధోనీల పేర్లే వినబడేవి. కానీ ప్రస్తుతం టీంలోకి వచ్చిన కొత్త నీరు ఎలాంటి ఫలితాల నిస్తుందో వేచిచూడాలి. ఇదంతా వచ్చే ఏడాది జరగబోయే వరల్డ్‌కప్‌కు సన్నాహకంగా భావిస్తున్నారు. ఈ సీజన్‌లో స్వదేశంలోను, విదేశాల్లోను శ్రీలంకతో 18 అంతర్జాతీయ మ్యాచ్‌లు (6 టెస్టులు, 8 వన్డేలు, 4 టీ20లు) టీమిండియా ఆడింది. మరోవైపు ఈ టోర్నీలోకి బంగ్లాదేశ్ వచ్చి చేరడంతో కొంత ఉత్కంఠ ఏర్పడింది. ఇటీవల దక్షిణాఫ్రికాపై విజయదుందుభి మోగించిన టీమిండియా అదే జోరును కొనసాగించే అవకాశం ఉంది. మొత్తంగా టీంలో ఆరుగురు ఆటగాళ్లు విశ్రాంతి తీసుకోవడంతో, కొత్తగా వచ్చిన యువకులకు ఇది సువర్ణావకాశం. సీనియర్‌లకు పోటీ ఇచ్చేందుకు ఈ టోర్నమెంట్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంది. అవడానికి ఇది టీ20 అయినా సెలెక్టర్ల దృష్టిలో ఎవరికైతే మంచి మార్కులు పడతాయో వారికి వన్డేల్లో కూడా అదే అవకాశం ఉంటుంది. దీంతో ఎప్పటినుంచో మిడిల్డార్, చివరిలో ఉన్న పేసర్ల ఖాళీ ఎవరితో భర్తీ అవుతుందో వేచి చూడాలి. ఇక వ్యక్తిగతంగా కెప్టెన్ రోహిత్ శర్మ విషయానికొస్తే, దక్షిణాఫ్రికాలో ఒక్క సెంచరీ మినహాయిస్తే అతడి ప్రదర్శన పేలవం. అయితే ప్రఖ్యాత ప్రేమదాస స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో రోహిత్ శర్మ, శిఖర్‌ధావన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించే అవకాశం ఉంది. మూడో స్థానంలో సురేష్ రైనా రావచ్చు. అలాగే లంక పిచ్‌లు, పేసర్ల త్రయం సురంగ లక్మల్, దుష్మంత చమీర, దాసన్ షనకలకు వారి సొంత గ్రౌండ్లు కొట్టిన పిండి. అయితే నేటి జట్టు కూర్పులో భారత్ ఆల్‌రౌండర్‌ను తీసుకుంటుందా లేక పేసర్‌ను తీసుకుంటుందా అనేది వేచి చూడాలి. ఒకవేళ ఎక్స్‌ట్రా పేసర్ వైపు మళ్లినట్లయితే తమిళనాడు ఆల్‌రౌండర్ విజయ్‌శంకర్ టీంలోకి వస్తాడు. లేక మరో స్పిన్నర్ కావాల్సి వస్తే అక్షర్ పటేల్ ఎలానూ ఉన్నాడు.

జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, సురేష్ రైనా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్ (వికెట్ కీపర్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనాద్కట్, మొహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్

శ్రీలంక: దినేష్ చండీమాల్ (కెప్టెన్), సురంగ లక్మల్ (వైస్ కెప్టెన్), ఉపుల్ తరంగ, ధనుష్క గుణతిలక, కుశాల్ మెండీస్, దాసన్ షనక, కుశాల్ జయంత్ పెరీరా, థిసారా పెరీరా, జీవన్ మెండీస్, ఇస్రు ఉడన, అకీల ధనంజయ, అమిలో అపోన్సో, నువాన్ ప్రదీప్, దుష్మంత చమీర, ధనంజయ డీ సిల్వ

అలా ఉంటే.. దూకుడు లేనట్లా..?



న్యూఢిల్లీ: కొత్తగా నిర్వహించనున్న ముంబై టీ20 లీగ్‌లో భాగంగా ముంబై నార్త్ జట్టు తరపున ఆడబోతున్న అజింక్యా రహానే.. డబ్బు కంటే కూడా గేమ్‌కే అధిక ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశాడు. అతన్ని ముంబై నార్త్ జట్టు రూ.7 లక్షలు కొనుగోలు చేసిన నేపథ్యంలో ఆటను ఇష్టంతో మాత్రమే ఆడతానని పేర్కొన్నాడు. ఇక్కడ డబ్బుకు ఎక్కువ ప్రాధాన్యత ఉండదన్నాడు. దీన్లో భాగంగా మాట్లాడిన రహానే.. 'ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో రాజస్థాన్ రాయల్స్‌కు తిరిగి రావడం చాలా ఆనందం ఉంది. ఆ జట్టు నాకు ఒక కుటుంబం లాంటింది. మళ్లీ మా ఫ్యామిలీలోకి రావడం ఒక సరికొత్త అనుభూతిని తీసుకొచ్చింది. ఇక ఆ జట్టు తరపున మెరుగ్గా ఆడటమే నా ముందున్న లక్ష్యం' అని రహానే పేర్కొన్నాడు. కాగా, మీలో దూకుడు తక్కువా అన్న ప్రశ్నకు మాత్రం రహానే తనదైన శైలిలో జవాబిచ్చాడు. 'నేను కామ్‌గా ఉంటా. అది నాకు సహజంగా వచ్చింది. అంతమాత్రాన ఆటలో దూకుడుగా లేనట్లా. అలా అనుకుంటే పొరపాటు. నేను కూల్‌గా ఉంటే బ్యాటింగ్ సమయంలో దూకుడును ప్రదర్శించలేనని కాదు కదా' అని రహానే బదులిచ్చాడు.

భారత మహిళల శుభారంభం



సియోల్: ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌లో భాగంగా దక్షిణకొరియాతో ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో భారత మహిళలు శుభారంభం చేశారు. చివరివరకూ ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత మహిళలు 1-0తో విజయం సాధించారు. మ్యాచ్ ఐదో నిమిషంలో భారత క్రీడాకారిణి లాల్రేమ్‌షియామి గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపింది. ఆ తరువాత దక్షిణకొరియా గోల్ చేయడానికి చివరివరకూ యత్నించినా ఫలితం దక్కలేదు. భారత రక్షణశ్రేణిని ఛేదించలేకపోయిన దక్షిణకొరియా జట్టు గోల్ చేయడంలో విఫలమైంది. భారత జట్టుకు మరో గోల్ చేసే అవకాశం వచ్చినా దాన్ని దక్షిణకొరియా అడ్డుకుంది. ఆట రెండో క్వార్టర్‌లో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకోలేపోయింది. దక్షిణకొరియా గోల్ కీపర్ మిజిన్ సమర్థవంతంగా పెనాల్టీ కార్నర్‌ను గోల్ పోస్ట్‌లోకి వెళ్లకుండా ఆపి భారత్ స్కోరును మరింత పెరగకుండా నిలువరించింది. కాగా, ఆట ముగిసే సమయానికి భారత్ ఆధిక్యంలో నిలవడంతో సిరీస్‌లో తొలి గెలుపును అందుకుంది.

క్రీడలకు 'కార్పొరేట్' చేయూత

క్రీడలమంత్రి రాథోడ్



న్యూఢిల్లీ: దేశంలో క్రీడా రంగ ప్రగతికి నిధులు ఇచ్చేందుకు కార్పొరేట్ రంగం సిద్ధంగానే ఉందని, వాటిని పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)లు హామీ ఇవ్వాలని కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ అన్నారు. 'నిధుల కోత గురించి నేనెప్పుడూ మాట్లాడలేదు. ఇది మా పరిధిలోనిదే. ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఇచ్చేందుకు సిద్ధం. కానీ... సమాఖ్యలు సొంతంగా నిలదొక్కుకోవాలన్నదే మా ఆలోచన. లీగ్‌ల ద్వారా రెజ్లింగ్, హాకీ, బ్యాడ్మింటన్ సమాఖ్యలు డబ్బు సమీకరిస్తున్నాయి. అయినా వీటికి కేంద్రం సాయం చేస్తోంది కదా?' అని చెప్పుకొచ్చారు. ప్రతిపాదిత 'జాతీయ క్రీడాభివృద్ధి నియమావళి' వ్యవస్థలో భారీ మార్పులు తీసుకొచ్చేదిగా ఉంటుందని మంత్రి వివరించారు. సెప్టెంబర్‌లో జరగనున్న ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్థాన్‌ను అనుమతించడాన్ని కాలమే నిర్ణయిస్తుందని రాజ్యవర్ధన్ అన్నారు. కామన్వెల్త్ పోటీల్లో భారత క్రీడాకారులు ఎన్ని పతకాలు గెలవగలరన్న సంఖ్యను చెప్పేందుకు ఇష్టపడని మంత్రి... సన్నాహాలకు చక్కటి వసతులు సమకూర్చుతున్నామని, దేశ ప్రతినిధులుగా వారు క్రమశిక్షణతో కూడిన ఆటను ప్రదర్శించాలని ఆకాంక్షించారు.

ఆ రెంటిలో రాణిస్తా : సింధు



హైదరాబాద్: 'ఒక సమయంలో ఒకే టోర్నీ గురించే ఆలోచిస్తా. ఇప్పుడు ముందున్నది ఆల్ ఇంగ్లండ్ చాంపియన్ షిప్. అందుకు ప్రస్తుతం సన్నాహాలు బాగా సాగుతున్నాయి. అక్కడ రాణిస్తానని భావిస్తున్నా. కామన్వెల్త్ క్రీడల్లో గట్టి పోటీ ఉంటుంది. అత్యుత్తమ ఆటతీరు కనబర్చాలంటే నేను మరింత కష్టపడాలి' అని పేర్కొంది స్టార్ షట్లర్ పీవీ సింధు. గతంలో కెరీర్ అత్యుత్తమంగా రెండో స్థానంలో నిలిచిన సింధు... ఈ ఏడాది నంబర్‌వన్ ర్యాంక్ సాధించడమే తన లక్ష్యమని ప్రకటించింది. కామన్వెల్త్ క్రీడలు వచ్చే నెల 4న ఆస్ట్రేలి యాలోని గోల్డ్‌కోస్ట్‌లో ప్రారంభం కానున్నాయి. 2014లో గ్లాస్గోలో జరిగిన ఈ క్రీడల్లో సింధు కాంస్యం గెలుచుకుంది.

ఫుట్‌బాల్ ఆటగాడు మృతి



రోమ్: ఇటలీకి చెందిన ఫుట్‌బాల్ ఆటగాడు డావీ అస్టోరి మృత్యువాత పడ్డాడు. అతను బస చేస్తున్న హోటల్ గదిలోనే అస్టోరి మృతిచెందడం ఇటలీ ఫుట్‌బాల్ జట్టును ఒక్కసారిగా కలవరపాటుకు గురిచేసింది. ప్రస్తుతం క్లబ్ జట్టయిన ఫియోరెంటినాకు నాయకత్వం వహిస్తున్న 31 ఏళ్ల అస్టోరి నిద్రలోనే కన్నుమూసినట్లు సదరు క్లబ్ ట్వీట్ చేసింది. అతను కార్డియక్ అరెస్ట్‌కు గురికావడంతోనే చనిపోయి ఉండవచ్చని ఫియో రెంటినా పేర్కొంది. యుడినెస్ జట్టుతో పోరుకు ముందు అస్టోరి మృత్యువాత పడటానికి అనారోగ్య సమస్యలే కారణంగా స్పష్టం చేసింది. ఇటలీ ఫుట్‌బాల్ జట్టు తరపున 14 మ్యాచ్‌లు ఆడిన అస్టోరి..2016లో ఫియోరెంటినా క్లబ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. ఇప్పటివరకూ ఫియోరెంటినా తరపున 58 మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. అతనికి భార్య, రెండేళ్ల కూతురు ఉన్నారు. అయితే అస్టోరి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భార్య ఫ్రాన్‌సెస్కాతో విభేదాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడని స్థానిక వార్తా సంస్థలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. కాగా, అతని మృతిపై శవ పరీక్ష జరిగిన తర్వాత ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

ఢిల్లీలో వైసీపీ మహాధర్నా

- సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల మద్దతు
- ఎంపీల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు ఉద్రిక్తత.. అరెస్టులు
- ప్రత్యేక హోదా ప్రకటించే వరకూ ఆందోళన



విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ: ప్రత్యేక హోదా సాధన కోసం దేశ రాజధాని ఢిల్లీ వేదికగా వైసీపీ చేపట్టిన మహాధర్నాకు ఇతర పార్టీల నేతలు, ప్రజాసంఘాల కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఎం ఏపీ కార్యదర్శి మధు కూడా మహాధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆప్ నేత రామారావు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు సదాశివరెడ్డి, ఆంధ్ర మేధావుల సంఘం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ తదితరులు పార్లమెంటు స్ట్రీట్‌లో జరిగిన మహాధర్నాలో పాల్గొని వైసీపీ పోరాటానికి అండగా నిలబడారు. సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ ధర్నాలో ప్రసంగించారు. ప్రత్యేక హోదా మన హక్కు అని, అది సాధించే పోరాటంలో అందరూ కలిసి రావాలని కోరారు. అందరూ కలిసి పోరాడితే.. రాష్ట్రానికి హోదా తప్పకుండా వస్తుందన్నారు. ఏపీకి హోదా రాకపోవడానికి మొదట ద్రోహి కేంద్ర ప్రభుత్వం, రెండో ద్రోహి రాష్ట్ర ప్రభుత్వమని, హోదా ఇవ్వకపోతే.. ఈ రెండు ప్రభుత్వాలకు గట్టిగా బుద్ధి చెప్పాలని మేధావుల సంఘం నేత చలసాని శ్రీనివాస్ సూచించారు. హోదా కోసం శాంతియుతంగా ఢిల్లీలోని సంసద్ మార్గ్‌లో మహాధర్నా నిర్వహిస్తున్న వైసీపీ నేతలపై పోలీసులు నిర్బంధకాండను ప్రయోగించారు. తమ ఆందోళనలో భాగంగా కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ర్యాలీగా పార్లమెంటుకు బయలుదేరిన వైసీపీ నేతలను అడ్డుకొని.. బలవంతంగా అరెస్టు చేసి తరలించారు. పోలీసులను అడ్డుకునేందుకు పార్టీ శ్రేణులు ప్రయత్నించడంతో కొంతసేపు సంసద్ మార్గ్‌లో ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, వరప్రసాద్, వైవీ సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులను అరెస్టు చేసి.. పోలీసు స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా హోదా కోసం ఆందోళన నిర్వహిస్తున్న తమను పోలీసులు అరెస్టు చేయడంపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రాజీనామాలకు సిద్ధపడ్డామని, అలాంటిది అరెస్టులకు భయపడతామా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి హోదా సాధించేవరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఐదు కోట్ల ఆంధ్ర ప్రజల ఆకాంక్షను తెలియజేసేందుకు తాము ఢిల్లీకి వచ్చామని, అరెస్టులు, ఆంక్షలతో తమ ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. తమ నేతల అరెస్టుపై వైసీపీ నాయకులు భగ్గుమన్నారు. 'ఢిల్లీ పెద్దలను ఎదిరించడం మాకు కొత్త కాదు. గతంలో చాలాసార్లు ఎదిరించాం. గతంలో బీజేపీ ఏం చేసిందో.. ఇప్పుడూ అదే చేస్తోంది. హోదా హామీని కేంద్రం నెరవేర్చాలి' అని వైసీపీ నేత కురసాల కన్నబాబు అన్నారు. 'టీడీపీ-బీజేపీ కుట్రలతో ఏపీకి అన్యాయం జరుగుతోంది. అరెస్టులకు మేం భయపడం. మరింత ఉధృతంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తాం' అని ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, పార్టీ నేతలు తమ్మినేని సీతారాం, విశ్వరూప్ స్పష్టం చేశారు.



డాలీశివానీకి మెగా ఉమెన్ అవార్డ్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ ఆర్చరీ కిడ్‌గా గుర్తింపు పొందిన చెరుకూరి డాలిశివానీ మెగా ఉమెన్ 2018 అచీవ్‌మెంట్ అవార్డ్‌కు ఎంపికయినట్టు చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ అధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. అతిచిన్న వయసులో డాలీశివానీ ఆర్చరీలో చూపిన ప్రతిభను గుర్తించి తమిళనాడుకు చెందిన టీవీ మెగానెట్‌వర్క్ సంస్థ ఈ అవార్డుకు ఎంపికచేశారన్నారు. శివానీ ఈ అవార్డును అందుకునేందుకు తల్లిదండ్రులతో కలిసి చెన్నై వెళ్లనున్నది. శివానీ ఆమెరికాలో ఫిబ్రవరి 18న జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌కు తల్లిదండ్రులతో కలిసి హాజరైంది. మెక్సికన్ ఆర్చరీ కోచ్ హేమీవద్ద యూఎస్‌లోని పెన్సిల్వేనియాలోని ల్యాన్‌క్యాష్టర్ ఆర్చరీ సెంటర్‌లో ఆరురోజులపాటు శిక్షణపొంది ఆర్చరీ నూతన పరికరాలను రాబిన్‌హుడ్ ఆర్చరీ చైర్మన్‌ద్వారా బహుమతిగా పొంది సాధన ప్రారంభించింది. శివానీ అందుకున్న ఈ నూతన ధనుస్సుతో భవిష్యత్తులో అనేక ఫలితాలను అందిపుచ్చుకోగలదని శిక్షకులు భావిస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.